అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

బుధవారం 11-01-2023 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 11 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు వెల : 6.50

విరాట్ శతక వీరంగం



- తొలి వన్డేలో శ్రీలంకపై భారత్ గెలుపు
- రాణించిన రోహిత్ శర్మ, శుభమన్ గిల్

వివరాలు 12లో

సీఎస్ గారూ.. ఏపీకి వెళ్లాల్సిందే...



సోమేశ్ కుమార్‌కు హైకోర్టు ఆదేశాలు

- క్యాడర్ కేటాయింపు వివాదంపై కీలక తీర్పు
- గతంలో క్యాట్ ఇచ్చిన ఉత్తర్వులు కొట్టివేత
- రేపటిలోగా ఆంధ్రా సర్వీసుల్లో చేరాలంటూ డీవోపీటీ ఆదేశాలు



నవతెలంగాణ - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ (1989 బ్యాచ్, ఏపీ క్యాడర్)... ఆంధ్రప్రదేశ్ సర్వీసులో చేరాల్సిందేనంటూ హైకోర్టు కీలక తీర్పును వెలువరించింది. తెలంగాణ సర్వీసులో సోమేశ్ కుమార్ కొనసాగొచ్చంటూ 2016లో కేంద్ర పరిపాలనా ...2లో



గెటౌట్ రవి పోస్టర్లు

తమిళనాడులో ముదురుతున్న వివాదం



- రాష్ట్ర ప్రభుత్వ చిహ్నం తొలగించి.. పొంగల్ ఇన్విటేషన్ పంపిన గవర్నర్

న్యూఢిల్లీ : తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి, ఎం.కె.స్టాలిన్ ప్రభుత్వానికి మధ్య వివాదం అంతకంతకూ ముదురుతోంది. సోమవారం అసెంబ్లీలో చోటుచేసుకున్న రసాభాసకు కారణమైన గవర్నర్ తీరును విమర్శిస్తూ మంగళవారం పలు చోట్ల 'హ్యాష్‌ట్యాగ్ గెటౌట్ రవి' పోస్టర్లు వెలిశాయి. ట్విట్టర్‌లో పెద్ద సంఖ్యలో ట్వీట్లు వెలువడ్డాయి. దీనికి పోటీగా బీజేపీ మద్దతుదారులు గవర్నర్‌కు అనుకూలంగా సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టారు. పలు చోట్ల నిరసనలు తెలియజేశారు. గవర్నర్, స్టాలిన్ సర్కార్ మధ్య వివాదం ముదురుతున్న క్రమంలో మంగళవారం గవర్నర్ పంపిన సంక్రాంతి వేడుకల ఆహ్వానం సైతం డీఎంకే క్యాడర్ ఆగ్రహాన్ని రెట్టింపు చేసింది. ఈ ఇన్విటేషన్‌లో రాష్ట్ర ప్రభుత్వ చిహ్నం ...5లో

ఎన్నికల వైపే...



రాష్ట్రంలో వ్యూహాత్మకంగా పార్టీల అడుగులు

సంక్రాంతి తర్వాత మరింత జోరు

- ఖమ్మంలో బీఆర్ఎస్ భారీ సభ
- రంగంలోకి మోదీ...బీజేపీ రాష్ట్ర నేతల్లో సమన్వయలేమి
- భద్రాచలం నుంచి రేవంత్ పాదయాత్ర
- బీఎస్పీ, వైఎస్ఆర్‌టీపీ యాత్రలు
- సైకిల్‌పై పవన్ కళ్యాణ్...బీజేపీతో సోపతి
- టికెట్ వస్తే ఎలా? రాకపోతే ఎలా? ఆలోచనల్లో ఆశావాహులు



రాష్ట్రంలో ఎన్నికల మూడ్ వచ్చేసింది. అందుకనుగుణంగా రాజకీయ పార్టీలు వ్యూహాత్మకంగా అడుగులేస్తున్నాయి. తమ తమ వ్యూహాలకు అవి పదును పెడుతున్నాయి. ఆయా పార్టీలు నిర్వహిస్తున్న బహిరంగ సభలు, పాదయాత్రలు, సమావేశాలన్నీ రానున్న సాధారణ ఎన్నికలే లక్ష్యంగా కొనసాగుతున్నాయి. సాధారణ ఎన్నికలకు ఏడాది సమయం ఉన్నప్పటికీ పార్టీలు ఇప్పటి నుంచి కూస్తున్నాయి. సంక్రాంతి పండుగ తర్వాత ఎన్నికల రాజకీయాలు మరింత జోరందుకోనున్నాయి.

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో అధికారాన్ని చేజిక్కించుకునేందుకు ఆయా పార్టీల నేతలు ఎవరికి తోచిన విధంగా వారు పావులు కదుపుతున్నాయి. ఒకవైపు రాజకీయ పార్టీలు అనేక ప్రకటనలు చేస్తూనే, మరోవైపు అంతర్గత సమావేశాలు నిర్వహించుకుని ఎప్పటికప్పుడు తాజా రాజకీయ పరిస్థితులను అంచనా వేస్తున్నాయి. ఇప్పటికే వివిధ రాజకీయ పార్టీలు ప్రజలతో మమేకమయ్యేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టాయి.

సంక్రాంతికే ఎన్నికల శంఖారావం

టీఆర్ఎస్ కాస్త బీఆర్ఎస్‌గా మారిన క్రమంలో దాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, దేశ వ్యాప్తంగా విస్తరించేందుకు సీఎం కేసీఆర్ ప్రయత్నాలు ముమ్మరం చేశారు.ఈనెల 18న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భారీ బహిరంగసభను నిర్వహించనున్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ సభ అని చెబుతున్నా...దీంతోనే ఆ పార్టీ ఎన్నికల శంఖారావాన్ని పూరించనున్నది. ఇక్కడి నుంచి దేశ ప్రజలకు ఏం చేయబోతారో చెప్పేందుకు కసరత్తు ప్రారంభించింది. నదిజలాల సద్వినియోగం, రైతుల సమస్యలు, ఆహార భద్రత తదితర అంశాలతోపాటు తెలంగాణాలో అమలవుతున్న పథకాలను దేశ వ్యాప్తంగా విస్తరిస్తామనే సంకేతాలు ఇవ్వనున్నారు. బీఆర్ఎస్ ఎన్నికలకు పావులు కదుపుతున్న నేపథ్యంలో దాన్ని అక్కడే కట్టడి చేసేందుకు బీజేపీ రంగంలోకి దిగింది. ఏకంగా ప్రధాని మోడీని రప్పిస్తున్నది. హైదరాబాద్ వేదికగా సభకు ప్లాన్ చేసింది. మరోవైపు ఇతర పార్టీల్లోని అసంతృప్తులను అక్కున చేర్చుకునేందుకు ఆపరేషన్ ఆకర్ష్ తో గాలం వేయటానికి ప్లాన్ చేసినట్టు కనపడుతున్నది.

మునుగోడులో ప్లాన్ రివర్స్...
ఖమ్మంలో మరో ప్లాన్

మునుగోడులో బీజేపీ ప్లాన్ రివర్సయింది. అంతటితో ఊరుకోకుండా ఖమ్మం జిల్లాకు చెందిన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై ...2లో

బీజేపీకి చుక్కలు చూపిస్తాం

సెస్ ఎన్నికల ఫలితం ట్రైలర్ మాత్రమే..

- పెట్రో డీజిల్, సిలిండర్ ధరలు పెంచిన మోడీ దేవుడెలా? : మంత్రి కేటీఆర్



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

"పెట్రో డీజిల్, సిలిండర్ సహా అన్ని రకాల నిత్యావసర సరుకుల ధరలు పెంచిన మోడీ.. ప్రజలకు దేవుడెలా అవుతాడు? ఆయన రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌కి, గుజరాత్ ప్రజలకు మాత్రమే దేవుడవుతాడు. కర్నాటక, మహారాష్ట్రలో అధికారంలో ఉన్న బీజేపీ ఆ రాష్ట్రాల మధ్య గెట్టు పంచాయితీ తేల్చలేకపోతోంది. అలాంటి పార్టీ నేత మోడీ రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపాడని చెప్పటం సిగ్గుచేటు.. సిరిసిల్ల సెస్ ఎన్నికలు ట్రైలర్ మాత్రమే.. అసలు సినిమా ముందు చూపిస్తాం" అని ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ...5లో

బీజేపీ ఆశలను వమ్ము చేస్తాం
ఆ దమ్ము కమ్యూనిస్టులది..

తెలంగాణలో అడుగుపెట్టనివ్వం

- 18న ఖమ్మం సభకు కేరళ ముఖ్యమంత్రి హాజరు
- బీజేపీని అడ్డుకునేందుకు రాష్ట్రంలో బీఆర్ఎస్‌తో కలిసి పని చేస్తాం: తమ్మినేని



నవతెలంగాణ-సూర్యాపేట

తెలంగాణలో అధికారంలోకి రావాలని ఆశ పడుతున్న బీజేపీ ఆశలను అడియాసలు చేసే దమ్ము కమ్యూనిస్టులకు మాత్రమే ఉందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సూర్యాపేట ...5లో

నిండాముంచిన లాంగ్‌జంప్



4 మీటర్లు దూకినా ఎంపిక చేయని వైనం

- షాట్‌పుట్ 6 మీటర్లు వేసినా అర్హత పొందలే
- పరుగుపందెంలో రాణించినా కొలువుకు దూరం
- ఆర్మీకి కూడా లేని నిబంధనలు అమలు
- 'పోలీసు' అభ్యర్థుల గోస పట్టని సర్కారు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ నియామక ప్రక్రియలో నిబంధనల ప్రకారం దేహదారుఢ్య పరీక్షల్లో చిన్నచిన్న కారణాలతో అనర్హులుగా ప్రకటించడం పట్ల వేలాది మంది అభ్యర్థులు మనోవేదనకు గురవుతున్నారు. కొన్నేండ్ల నుంచి ఇంటిని వదిలి ప్రాక్టీస్ చేసినా అడ్డగోలు నిబంధనలతో సర్కారు తమ జీవితాలతో చెలగాటమాడిందని కుమిలిపోతున్నారు. లాంగ్‌జంప్ అభ్యర్థులను నిండాముంచింది. ఆర్మీకి కూడా లేని నిబంధనలను పోలీసు కానిస్టేబుల్, ఎస్ఐ అభ్యర్థులకు వర్తింపచేశారు. పురుషులు 1,600 మీటర్లు, మహిళలు 800 మీటర్లు పరుగుపందెంలో అర్హత సాధించినా లాంగ్‌జంప్, షాట్‌పుట్‌లో అనర్హులు కావడం గమనార్హం. గత నోటిఫికేషన్‌లో ఉన్న నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర పోలీసు నియామక బోర్డు పూర్తిగా మార్చాయి. అవే అభ్యర్థులకు శాపంగా పరిణమించాయి. గత నోటిఫికేషన్‌లో పురుషుల పరుగుపందెం 800 మీటర్లు ఉండేది. దాన్ని అధికారులు 1,600 మీటర్లకు పెంచారు. మహిళల పరుగుపందెం గతంలో 100 మీటర్లు ఉంటే, దాన్ని 800 మీటర్లకు పొడిగించారు. పురుషులకు లాంగ్‌జంప్ ...2లో

ఆకట్టుకున్న జానపద కళాకారుల శోభాయాత్ర



నవతెలంగాణ-ముషీరాబాద్

స్వామి వివేకానంద జయంతి నేపథ్యంలో నిర్వహించిన జానపద కళాకారుల శోభాయాత్ర ఆకట్టుకుంది. భారత ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహానీయుడు స్వామి వివేకానంద 160వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం తెలంగాణ జానపద వృత్తి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్యపార్కు వద్ద శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. ఈ శోభాయాత్రను అన్నమయ్య కళాక్షేత్ర పీఠాధిపతి విజయశంకరస్వామి ప్రారంభించి.. వివేకానందుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శోభాయాత్రలో భాగంగా కోలాటం, హరికథలను కళాకారులు ప్రదర్శించారు. అవి ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జానపద వృత్తి కళాకారుల సంఘం అధ్యక్షులు కొండూరి భాస్కర్, సహాయ కార్యదర్శి ఎంజే వినోద్‌కుమార్, పీఎస్ మూర్తి, కుమ్మరి శంకర్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఐదేండ్లలో 79 శాతం జడ్జీలు అగ్రకులాల వారే

- ఎస్సీ, మైనార్టీలు కేవలం 2 శాతమే 5లో..
- పార్లమెంటరీ ప్యానెల్‌కు చెప్పిన కేంద్రం




పేదోళ్లపై ఉక్కుపాదం

నడిగడ్డ తండాపై సీఆర్‌పీఎఫ్ డేగ

కాలనీల్లో కవాతులు, పేదల గుడిసెలపై దాడులు, బెదిరింపులు

- బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్న 3000 కుటుంబాలు
- కార్పొరేటర్ నుంచి కేంద్ర మంత్రికి విన్నవించినా ఫలితం శూన్యం
- భూములకు పట్టాలు ఇప్పించి, కేంద్ర బలగాల నుంచి కాపాడాలని బాధితుల డిమాండ్



నవతెలంగాణ- రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

'మా తాతల కాలం నుంచి గీడనే బతుకుతున్నాం. కూలీ నాలీ చేసుకుని పూట గడుపుతున్నం. గీ గుడిసెలే మా ఆస్తి.. గిప్పుడు ఈ గుడిసెల నుంచి మమ్మల్ని ఎల్లగొట్టేందుకు కుట్రలు చేస్తుండ్రు.. గీ భూములు సీఆర్‌పీఎఫ్ పోలీసోళ్ల యి అంటుండ్రు.. పోలీసోళ్లంటే రక్షణ భటులని ఇన్నాం గానీ గీళ్లు మా మీదే దాడి జేస్తుండ్రు. రాత్రుళ్లు కాలనీల్లో కవాత్ జేస్తుంటే.. అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని బతుకుతున్నాం. కాలనీ ఎంట్రెన్స్‌లో చెక్‌పోస్టు పెట్టిండ్రు.. కూలిన గుడిసెలకు మరమ్మతులు చేసుకుందామన్న, బాత్‌రూంలు కట్టుకుందామన్న ఇటుక పెళ్ల కూడా తేనిస్తలేరు. గుడిసెలు ఖాళీ చేయాల్సిందే అని బెదిరింపులకు దిగుతుండ్రు.. మా గోసను ఏండ్ల సంధీ కార్పొరేటర్ నుంచి కేంద్ర మంత్రి దాకా మొర పెట్టుకున్నా వినే నాథుడే లేడు. గీ బలగాల నుంచి మమ్మల్ని కాపాడేదెవ్వరో..' అని మియాపూర్ పరిధిలోని నడిగడ్డ తండా ప్రజలు తమ గోడును 'నవతెలంగాణ' ముందు వెళ్లబోసుకున్నారు. సీఆర్‌పీఎఫ్ బలగాల అరాచకాలకు బలవుతున్న పేదలపై కథనం.

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్ డివిజన్ నడిగడ్డ తండా సర్వే నెంబర్ 28లో 'జిలాని బేగం' (నావాబ్) వారసురాలికి సుమారు 251 ఎకరాల భూమి ఉంది. ఈమె విదేశాలకు వెళ్లే క్రమంలో దేశం నుంచి ఎలాంటి పర్మిషన్లు లేకుండా వెళ్తూ దేశ రహస్యాలను ఇతర దేశాలకు చేరవేస్తుందన్న నెపంతో ఈ భూములను ఎనిమీ ప్రాపర్టీగా ప్రభుత్వం గుర్తించింది. అయితే జిలాని బేగం ఇక్కడ ఉన్నప్పటి నుంచే ఈ భూముల్లో పేదలు నివసిస్తున్నారు. సుమారు ...5లో

ఉపాధ్యాయుడిని దూషించిన.. మతోన్మాదులపై చర్యలు తీసుకోవాలి

కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు డిమాండ్

- సమాజం రక్షణగా నిలవాలి : సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వీరయ్య



నవతెలంగాణ-బోధన్

కోటగిరిలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్న మల్లికార్జున్‌ను కులం పేరుతో దూషించి, వేధించిన మతోన్మాదులను కఠినంగా శిక్షించాలని కుల వివక్ష వివక్ష పోరాట సమితి (కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా బోధన్‌లో బాధిత ఉపాధ్యాయున్ని పరామర్శించి మాట్లాడారు. కోటగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న దళిత సామాజిక తరగతికి చెందిన ఉపాధ్యాయుడిని బలిచ్చే గొర్రెను తీసుకెళ్లినట్టుగా బడి నుంచి గుడి వద్దకు బలవంతంగా మెడలు పట్టి లాక్కెళ్లి జై శ్రీరాం అనిపించారని, ఒత్తిడి చేసి బొట్టుపెట్టి ఆయన మనోభావాలు దెబ్బతీశారన్నారు. 2022 సెప్టెంబర్‌లో వినాయక చందా ఇవ్వనందుకు నాటి నుంచి ...2లో

ఉపాధ్యాయుడిని దూషించిన.. మతోన్మాదులపై చర్యలు తీసుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

కక్షపెంచుకొని జనవరి 2న ఈ దుర్మార్గానికి ఒడిగట్టారని ఉపాధ్యాయుడు ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలిపారు. కులం పేరుతో దూషించి తీవ్రమైన పరుష పదజాలంతో హేళన చేశారని అన్నారు. ఒక టీచర్ సైన్స్ హేతువాదాన్ని మాత్రమే బోధిస్తాడని, మూఢత్వాలు ఎందుకు బోధిస్తాడని ప్రశ్నించారు? సైన్స్ బోధించడం నేరం కాదన్నారు. ఉపాధ్యాయున్ని అవమానించిన దుండగులను ప్రభుత్వం అరెస్ట్ చేయడంలో జాప్యం చేయడం సరికాదన్నారు.

దౌర్జన్యం చేసిన మతోన్మాద దుండగులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు హత్యాయత్నం నమోదు చేయాలని, అలాగే ప్రభుత్వ విధులకు ఆటంకపర్చినందుకు కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జిల్లా పోలీసు కమిషనర్, కలెక్టర్ జోక్యం చేసుకొని తక్షణమే దుండగులను అరెస్ట్ చేయాల న్నారు. ఆయనకు ప్రాణభయం ఉందని, ఆయన కుటుంబానికి పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాలని కోరారు. లేకుంటే కేవీపీఎస్ ఆధ్వర్యంలో అన్ని సామాజిక ప్రజాసంఘాలను కలుపుకొని ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం టీచర్ మల్లిఖార్జున్‌ను పూలదండ, శాలువతో ఘనంగా సన్మానించారు. పరామర్శిన వారిలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్యాల సుమన్, కొండ గంగాధర్, జిల్లా ఉపాధ్యక్షులు నల్వాల నర్సయ్య, జిల్లా కమిటీ సభ్యులు డి. శంకర్, భాస్కర్, రైతుసంఘం నాయకులు భాస్కర్, సీఐటీయూ వ్యవసాయ కార్మికసంఘాల జిల్లా అధ్యక్షులు ఎం.గంగాధరప్ప, శంకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌కు సమాజం అండగా నిలవాలి : సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వీరయ్య

కోటగిరి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న మల్లికార్జున్‌ను కొంతమంది ఉద్దేశపూర్వకంగా మతం పేరుతో అవమానపరచడం సహించలేనిదని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్. వీరయ్య అన్నారు. మతోన్మాదుల చేతిలో అవమానాల పాలైన ఉపాధ్యాయుడికి సమాజం అండగా నిలవాలని కోరారు. మంగళవారం ఆయన బోధన్ పట్టణంలోని బాధిత ఉపాధ్యాయ కుటుంబాన్ని పరామర్శించి మాట్లాడారు. ప్రతి వ్యక్తిలోనూ ఆస్తికత్వం, నాస్తికత్వం ఉంటాయని, ఆస్తికులంతా దేశ పౌరులు, నాస్తికులంతా దేశద్రోహులు అనడం సమంజసం కాదన్నారు. దళితుడైన మల్లికార్జున్ టీచర్‌గా ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యను బోధిస్తు న్నాడని అన్నారు. మనిషిని మనిషిగా చూడలేని ఈ వ్యక్తులు ప్రజలకు ఏ విధంగా సేవ చేస్తారని ప్రశ్నించారు. ప్రతి వ్యక్తికి భావవ్యక్తీకరణ స్వేచ్ఛ, మతాన్ని స్వీకరించే స్వేచ్ఛ భారత రాజ్యాంగం కల్పించిందని అన్నారు. టీచర్‌ను బెదిరించి అవమానపరిచిన వారిపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మల్లికార్జున్ కుటుంబానికి సీఐటీయూ తరపున పూర్తి సహకారం ఉంటుందని భరోసాని చ్చారు. ఆయన వెంట కార్యదర్శులు శ్రీకాంత్, రమేష్, జిల్లా సీఐటీయూ కార్యదర్శి నూర్జహాన్, అధ్యక్షులు శంకర్‌గౌడ్, తదితరులున్నారు.

విచ్ఛిన్నకర శక్తులను తిప్పికొడతాం

- కార్మికులకు కనీసవేతనం కోసం కొట్లాడుతాం
- అన్నదాతలకు గిట్టుబాటు ధర కల్పించాలి: సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్
- అఖిల భారత మహాసభల నేపథ్యంలో సీఐటీయూ జెండాఎగురవేత



నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

దేశాభివృద్ధికి ఆటంకంగా మారిన విచ్ఛిన్నకరశక్తుల ఎత్తుగడలను తిప్పికొడతామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనాల కోసం కొట్లాడుతామన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని సీఐటీయూ రాష్ట్ర కార్యాలయం వద్ద ఆ యూనియన్ అఖిల భారత మహా సభలను పురస్కరించుకుని అరుణపతాకాన్ని ఆయన ఎగుర వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఐటీయూ అఖిల భారత మహాసభలు బెంగుళూరులో ఈ నెల 18 నుంచి 22 వరకు జరుగబోతున్నాయనీ, వాటిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మతోన్మాద శక్తులు, కార్పొరేట్ శక్తులు దేశాన్ని దివాళా తీయిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం, దేశ ఆర్థిక సార్వభౌమత్వాన్ని కాపాడుకునేందుకు కార్మికులను రాజకీయంగా చైతన్యపరిచి పోరాటాలు చేస్తామన్నారు. దేశంలో శాంతిని నెలకొల్పేం దుకు కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి ముందుకు సాగుతామని చెప్పారు. సమాజమార్పు, దోపిడీ అంతానికి సీఐటీయూ ఎల్ల వేళలా కృషి చేస్తుందని తెలిపారు. ఏప్రిల్ ఐదో తేదీన కార్మి కులు–వ్యవసాయ కూలీలు–రైతులు సంయుక్తంగా తల పెట్టిన చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయా లని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపా ధ్యక్షులు ఎస్వీ.రమ, రాష్ట్ర కార్యదర్శి మధు, వర్కింగ్ కమిటీ సభ్యులు ఆర్.కోటంరాజు, కె.సోమన్న, ఎస్ఎస్ఆర్ ప్రసాద్, ఎ.సునీత, తదితరులు పాల్గొన్నారు.

గజగజ వణికిస్తున్న చలి

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

రాష్ట్ర ప్రజలను చలి గజగజ వణికిస్తున్నది. రాష్ట్రంలో మరో మూడ్రోజులు ఇదే పరిస్థితి కొనసాగనున్నది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో చలితీవ్రత ఎక్కువ ఉండే అవకాశం ఉంది. మెదక్, సంగారెడ్డి, ఆదిలాబాద్ జిల్లాల్లో చల్లని గాలులు వీచే సూచనలు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో, హైదరాబాద్ నగరంలో ఉదయం పూట పొగమంచు ఏర్పడే అవకాశముంది. రాష్ట్రం మీదుగా తూర్పు, ఈశాన్య దిశల నుంచి చల్లని గాలులు వీస్తున్నాయి. తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ (టీఎస్‌డీపీఎస్) నివేదిక ప్రకారం మంగళవారం కొమ్రంభీమ్ అసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యు)లో అత్యల్పంగా 5.9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలో చాలా జిల్లాల్లో పది డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు రికార్డ య్యాయి. బుధవారం నాడు కూడా 15కుపైగా జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు పది డిగ్రీల లోపే నమోదయ్యే అవకాశం ఉందని టీఎస్‌డీపీఎస్ తన వెదర్ రిపోర్టులో పేర్కొంది.

హైదరాబాద్ జిందాబాద్ ఆధ్వర్యంలో.. ఉచితంగా కండ్లద్దాల పంపిణీ



నవతెలంగాణ–సిటీబ్యూరో

హైదరాబాద్ జిందాబాద్ ఆధ్వర్యంలో మంగళవారం జీహెచ్ఎంసీ కార్యాలయంలో 67 మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. డిసెంబర్ 25న రాంనగర్ ఎంసీహెచ్ కాలనీలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన 'మెగా మెడికల్ క్యాంప్'లో కంటి పరీక్షలు చేయించుకున్న వారికి అద్దాలు తయారు చేయించి, మంగళవారం ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా టీఎస్ఆంటీసీ సీనియర్ ఆఫీసర్ కిరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉచితంగా వైద్య సేవలు అందించడం చాలా ఉదాత్తమైన కార్యక్రమమని, హైదరాబాద్ జిందాబాద్ కృషిని అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమంలో తనకు భాగస్వామ్యం కల్పించినందుకు సంతోషంగా ఉన్నదని, ప్రతి ఒక్కరూ తమ వరకే కాక సమాజం కోసం ఆలోచించాలని, సాటి మనిషి కోసం ఏదో ఒకటి చేయాలని ఉద్బోధించారు. ఈస్ట్ ఎంసెట్ కాలనీ అధ్యక్షులు శ్రీధర్‌గౌడ్ మాట్లాడుతూ. తమ కాలనీలో వైద్య శిబిరాన్ని నిర్వహించి, ఉచిత కండ్లద్దాలు పంపిణీ చేసిన హైదరాబాద్ జిందాబాద్ సంస్థకు కృతజ్ఞతలు తెలియజేశారు. సినీ నిర్మాత శివనారాయణ వాసిరెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి హాజరై కండ్ల అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిందాబాద్ ముషీరాబాద్ డివిజన్ నాయకులు రాజమౌళి, శ్రీవల్లి, నగర ప్రధానకార్యదర్శి కె.వీరయ్య, సంయుక్త కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు, పి. నాగేశ్వరరావు తదితరులు నాయకత్వం వహించారు.

వీఆర్ఎస్సా..? బీఆర్ఎస్సా...?

కిం కర్తవ్యం..?
సోమేశ్ భవితవ్యం...?

- అధికార, రాజకీయ వర్గాల్లో చర్చోపచర్చలు
- తదుపరి సీఎస్‌గా రామకృష్ణారావు
- సీఎం పరిశీలనలో ఆయనతోపాటు అర్వింద్ కుమార్

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

మూడేండ్లకు పైగా రాష్ట్ర ప్రభుత్వంలో ఆయన కీలక పాత్ర పోషించారు. సీఎం కేసీఆర్ తర్వాత అధికార వర్గాల్లో అంతటి ఇమేజ్‌ను సంపాదించుకున్నారు. పథకాలు, కార్యక్రమాల రూపకల్పనలో తనదైన ముద్రవేశారు. ఆయనే మంగళవారం వరకూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించిన సోమేశ్ కుమార్. తాజాగా హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఈ ఏడాది చివరి వరకూ ఉన్న ఆయన సర్వీసు, దాంతోపాటు ఆయన భవితవ్యం రెండూ సందిగ్ధంలో పడ్డాయి. సోమేశ్ కుమార్ కచ్చితంగా ఏపీకి వెళ్లి తీరాలంటూ ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయటంతో ఆయన పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో సోమేశ్‌కు మూడే మూడు మార్గాలున్నాయని మేధావులు, న్యాయ నిపుణులు, రాజకీయ నాయకులు అభిప్రాయపడుతున్నారు. కోర్టు తీర్పునసుసరించి ఏపీకి వెళ్లటం, హైకోర్టు తీర్పుపై సుప్రీంను ఆశ్రయించటం, స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) చేయటమనే మూడు మార్గాలను వారు సూచిస్తున్నారు. వీటిలో మొదటి దాని ప్రకారం.. ఏపీకి వెళితే, ఆయన ఏదో ఒక సాధారణ పోస్టులో సర్దుకుపోవాల్సి (లూప్ లైన్‌లో) ఉంటుంది. ఎందుకంటే అక్కడ ఆయనకు పెద్దగా ప్రాముఖ్యత కలిగిన పదవి ఇచ్చే అవకాశం ఉండదు కాబట్టి. ఇక రెండో దాని ప్రకారం సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే... నిబంధనల ప్రకారమే నడుచుకోవాలంటూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరిస్తే, అది హైకోర్టు తీర్పును సమర్థించినట్టే అవుతుంది. అందువల్ల ఈ రెండింటికంటే మూడోదైన స్వచ్ఛంద పదవీ విరమణ తనకు సులవైన పరిష్కారమార్గంగా సోమేశ్ భావిస్తున్నట్టు వినికిడి. ఇదే విషయాన్ని ఆయన తన సన్నిహితులతో చెప్పినట్టు సమాచారం. ఒకవేళ కచ్చితంగా ఏపీకి వెళ్లాల్సి వస్తే 'లాంగ్ లీవ్...' ఒక్కటే మేలైందని ఆయన వాపోయినట్టు తెలిసింది.

మరోవైపు తెలంగాణను వదిలి వెళ్లేందుకు ఆయన విముఖత వ్యక్తం చేస్తున్నారని సచివాలయ వర్గాలు చెబుతున్నాయి. అందువల్ల వీఆర్ఎస్ తీసుకోవటమే మేలని ఆయన భావిస్తున్నారు. అదే జరిగితే సీఎం కేసీఆర్ తనకు అత్యంత దగ్గరి వాడైన సోమేశ్‌కు ప్రభుత్వంలో కీలక పదవి ఇచ్చే అవకాశాలున్నాయి. ఇప్పటికే విశ్రాంత ఐఏఎస్, ఐపీఎస్‌ల్లో తనకు దగ్గరగా ఉన్న వారికి ప్రభుత్వ సలహాదారుల పదవులనివ్వటం ద్వారా సీఎం... వారిని తన పక్కనే కూర్చోబెట్టుకున్నారు. ఆ రకంగానే సోమేశ్ కుమార్‌కు సైతం సలహాదారు పోస్టునిచ్చే అవకాశాల్లేకపోలేదని అధికార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అదీ కుదరకపోతే వీఆర్ఎస్ అనంతరం సోమేశ్‌ను బీఆర్ఎస్‌లో చేర్చుకోవటం ద్వారా ఆయనకు రాజకీయంగా పెద్ద పీట వేయనున్నారనే ఊహాగానాలు కూడా చక్కర్లు కొడుతున్నాయి. ఆ తర్వాత ఆయన స్థాయికి తగ్గట్టు కేసీఆర్... పెద్ద పోస్టునిచ్చి కాపాడుకుంటారనే చర్చ కూడా కొనసాగుతున్నది. మరోవైపు సీఎస్ పదవి నుంచి సోమేశ్ కుమార్ వైదొలిగిన నేపథ్యంలో ఆయన స్థానంలో తదుపరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఎవరిని నియమించా లనే దానిపై సీఎం కేసీఆర్ సీరియస్‌గా దృష్టి సారించారు. ప్రస్తుతం ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా ఉన్న సీనియర్ ఐఏఎస్ కె.రామకృష్ణారా వును ఆ పదవి వరించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఆయన సీఎస్ కుర్చీలో కూర్చుంటే... గతంలో ఆ శాఖలో పని చేసిన సీనియర్ ఐఏఎస్ సందీప్ కుమార్ సుల్తానియాను ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించే అవకాశాలున్నాయి. ఇక రామకృష్ణారావుతోపాటు సమాచార పౌర సంబంధాల శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న అర్వింద్ కుమార్, సాగునీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న రజత్ కుమార్ కూడా ఆ రేసులో ఉన్నారు. ఇక సోమేశ్ మాదిరిగానే ఏపీ క్యాడర్ అయిన ఐఏఎస్‌లు రొనాల్డ్ రాస్ (2006 బ్యాచ్), ఏ.వాణీ ప్రసాద్ (1995), వాకాటి కరుణ (2004), ఐపీఎస్‌లు అంజనీ కుమార్ (ప్రస్తుత డీజీపీ–1990 బ్యాచ్), అభిలాష్ బిస్త్ (1994), సంతోష్ మెహ్రా (1987) కూడా తెలంగాణలో కొనసాగుతున్నారు. హైకోర్టు తీర్పు నేపథ్యంలో వీరి భవితవ్యం కూడా ప్రశ్నార్థకంగా మారింది. సోమేశ్ మాదిరిగానే వీరు సైతం ఏపీకి వెళ్లాల్సి వస్తుందా..? లేక ఎవరూ కోర్టుకు పోలేదు కాబట్టి.. తెలంగాణలోనే కొనసాగుతారా..? అనేది వేచి చూడాలి.

ఎన్నికల వైపే...

(మొదటిపేజీ తరువాయి)

వల విసిరింది. ఆ జిల్లాలో బలమైన నేతగా ఎదిగిన ఆయన...బీఆర్ఎస్‌పై అసంతృప్తితో ఉన్నారు. దీంతో ఆయన్ను చేర్చుకునేందుకు బీజేపీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నది. ఇప్పటికే పొంగులేటి బీజేపీలో చేరుతారనే వార్తలు ఊపందుకున్నాయి. కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీలకు చెందిన నేతలు వస్తారంటూ ముందుగానే ఆపార్టీ పుకార్లు పుట్టిస్తున్నది. ఆ తర్వాత బీజేపీలో చేర్చుకుంటున్నది. కమలనాథుల ఎత్తులను చిత్తు చేసేందుకు వీలుగా కేసీఆర్ ప్రాంతీయ పార్టీలను కూడగట్టేందుకు ఎత్తులు వేస్తున్నారు.

ఒకే దెబ్బకు రెండు పిట్టలు.. అదే రేవంత్ వ్యూహం

అంతర్గత కుమ్ములాటల్లో కొట్టుమిట్టాడుతున్న కాంగ్రెస్ కూడా తామేమీ తక్కువ తినలేదంటూ... పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఈనెల 26 పాదయాత్రకు ప్లాన్ చేశారు. ఆ యాత్రను భద్రాచలం నుంచి అడుగులు పడనున్నాయి. యాత్ర ద్వారా బీఆర్ఎస్, బీజేపీ పార్టీలను ఎదుర్కోవడం ఒక ఎత్తైతే, పార్టీ సీనియర్ నేతల నోర్లు మూయించడం మరో ఎత్తు. అందుకోసం రేవంత్ అన్ని విధాల సిద్ధమవుతు న్నారు. ఇప్పటికే అధిష్టానం కూడా రేవంత్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది. బీఎస్పీ కూడా రానున్న ఎన్నికల్లో తమ ఉనికి చాటుకునేందుకు ప్రయత్ని స్తున్నది. ఆ పార్టీని మునుగోడు ఎన్నికలు నిరాశ పరిచినప్పటికీ ముందుకు సాగుతున్నది. వైఎస్ ఆర్‌టీపీ అధినేత్రి షర్మిల తమ పాదయాత్రల ద్వారా ప్రజల్లోకి వెళ్లారు. ఎమ్మెల్యేలు, మంత్రులపై ఆమె వ్యక్తిగత విమర్శలకు దిగుతుం డటంతో వివాదాల్లో చిక్కుకుంటున్నారు. దీంతో వరంగల్‌లో జరగాల్సిన ఆమె పాదయాత్రకు పోలీసులు అనుమతివ్వడం లేదు. ఖమ్మం జిల్లా పాలేరు నుంచి షర్మిల పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతున్నది. అక్కడ పార్టీ ఆఫీస్ నిర్మాణానికి ఆమె పూనుకున్నారు. ఇదిలా ఉండగా వైఎస్ఆర్‌టీపీ వెనుక బీజేపీ ఉన్నదనే చర్చ కొనసాగుతున్నది.

టీడీపీ, జనసేన, బీజేపీ మూడు ముక్కలాట

మరోవైపు టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇటీవల హైదరాబాద్‌లో భేటీ కావడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏపీలో ఆ రెండు పార్టీలు బీజేపీ జతకట్టి, తెలంగాణ లోనూ బీజేపీకి సహకరించేందుకు ప్లాన్‌చేస్తున్నా యనే చర్చ జోరందుకుంది. ఖమ్మంలో టీడీపీ నిర్వహించినసభ విజయవంతం కావడంతో ఇలాంటి అనుమానాలు వస్తున్నాయి. ఎన్నికలవాతావరణ పరిస్థితులు రావడంతో ఆశావాహులు కూడా ఆలో చనల్లో పడ్డారు. సొంతపార్టీలో టికెట్ రాకపోతే తమ భవిష్యతు ఏంటనే ఆందోళనతో ఉన్నారు. ఈ పరిస్థితి బీఆర్ఎస్‌లో ఎక్కువగా కన పడుతున్నది. ఒక్కొక్క నియోజకవర్గానికి నలుగురు లేదా ఐదు మంది పోటీ పడు తున్నారు. కాంగ్రెస్‌లోనూ ఇదే పరిస్థితి నిండు కుండలా ఉన్నది. ఆయా పార్టీల్లోని అసంతృప్తులను తమవైపుతిప్పుకునేందుకు బీజేపీ కాచుకుని కూర్చున్నది.

సీఎస్ గారూ.. ఏపీకి వెళ్లాల్సిందే...

(మొదటిపేజీ తరువాయి)

ట్రిబ్యునల్ (క్యాట్) ఇచ్చిన తీర్పును హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ సూరేపల్లి నందలతో కూడిన ధర్మాసనం కొట్టేసింది. తీర్పు అమలును మూడు వారాలపాటు నిలిపేయాలన్న సోమేశ్‌కుమార్ తరపు కౌన్సిల్ వినతిని కోర్టు నిర్ద్వందంగా తోసిపుచ్చింది. హైకోర్టు తీర్పు వెలువడిన గంటల వ్యవధిలోనే...అఖిల భారత సర్వీసు అధికారుల వ్యవహారాలు చూసే డిపార్టుమెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీవోపీటీ) కార్యదర్శి అన్షుమన్ మిశ్ర కీలక ఆదేశాలు జారీచేశారు. గురువారం (ఈనెల 12)లోగా ఆంధ్రప్రదేశ్ సర్వీసులో చేరాలంటూ సోమేశ్ కుమార్‌కు స్పష్టంచేశారు. ఈ క్రమంలో తెలంగాణ సర్వీసులో కొనసాగేందుకు ఆయనకున్న దారులన్నీ మూసుకు పోయాయి. ఈ క్రమంలో కొత్త సీఎస్ ఎంపికపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తులు షురూ చేసింది.

ఇదీ కేసు నేపథ్యం...

ఏపీ పునర్విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య అఖిల భారత సర్వీసులైన ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల సర్దుబాటుకు సెంట్రల్ విజిలెన్స్ మాజీ కమిషనర్ ప్రత్యూష్ సిన్హా నేతృత్వంలో ఆరుగురు సభ్యుల కమిటీని కేంద్రం నియమించింది. అన్ని కసరత్తులను పూర్తిచేసిన ఆ కమిటీ.. రెండు రాష్ట్రాలకు ఆలిండియా సర్వీసెస్ (ఏఐఎస్) అధికారులను కేటాయిస్తూ 2014 సెప్టెంబర్‌లో ఉత్తర్వులు జారీచేసింది. ఆ ప్రకారంగా తెలం గాణకు 133 మంది ఐఏఎస్, 95 మంది ఐపీఎస్, 58 మంది ఐఎఫ్ఎస్‌ల ను...ఏపీకి 161 ఐఏఎస్, 116 ఐపీఎస్, 69 ఐఎఫ్ఎస్‌లను కేటాయించింది. ఆ ప్రకారంగా సోమేశ్ కుమార్ ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లాల్సి ఉంది. అయితే తాను తెలంగాణలోనే కొనసాగుతానంటూ సోమేశ్‌కుమార్ క్యాట్‌ను ఆశ్రయించారు. 2016 మార్చిలో ఆయనకు అనుకూలంగా తీర్పు వెలువడింది. అయితే, క్యాట్ తీర్పును సవాల్ చేస్తూ డీవోపీటీ 2017లో తెలంగాణ హైకోర్టులో రిట్ పిటిషన్ (4938/2017) దాఖలు చేసింది. ఈ కేసులో ఐదేండ్లకు పైగా సుదీర్ఘ వాదోపవాదాలు కొనసాగాయి. మంగళవారం 89 పేజీల తీర్పును వెలువరించింది.

ఫిబ్రవరిలో ఇందిరాపార్కు వద్ద ధర్నా

- రైతు ఆత్మహత్యలను నివారణ కోసం చర్యలేవి?
- ఏఐకేఎఫ్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

రైతుల ఆత్మహత్యల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఏఐకేఎఫ్ రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. ప్రభుత్వ పథకాలను కౌలు రైతులకు వర్తింపజేయాలని కోరారు. మద్దతు ధరల చట్టం, రుణ విముక్తి చట్టం తేవడం ద్వారానే రైతుల ఆత్మహత్యలు ఆగుతాయని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఓంకార్ భవన్‌లో ఏఐకేఎఫ్ ఆధ్వర్యంలో రైతు ఆత్మహత్యలు.. .మన కర్తవ్యం అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఏఐకేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వస్కుల మట్టయ్య అధ్యక్షతన నిర్వహించారు. రైతు ఆత్మహత్యల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిబ్రవరి నెలలోఇందిరాపార్కువద్ద ధర్నా నిర్వహించాలనీ, కౌలు రైతుల గుర్తింపు, రైతాంగ సమస్యలపై ఐక్య కార్యాచరణ చేపట్టాలని సమావేశం నిర్ణయించింది. జనవరి 16 నుంచి 31 వరకు జిల్లా కేంద్రాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించాలని పిలుపు నిచ్చింది. ఈసందర్భంగా తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, ప్రొఫెసర్లు మరిం గంటి యాదగిరి ఆచార్యులు, కూరపాటి వెంకట నారాయణ, ఏఐకేఎఫ్ ప్రధాన కార్యదర్శులు పెద్దారపు రమేష్, రైతు స్వరాజ్య వేదిక అధికార ప్రతినిధి విస్సా కిరణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలను నివారించకపోవడం సిగ్గుచేటన్నారు. పాలకులు మారినా విధానాలు మారకపోవడంతో ఉత్పత్తి ఖర్చులు విపరీతంగా పెరిగి రైతు అప్పులబారిన పడుతున్నారని తెలిపారు. 70 శాతం మంది కౌలు రైతులే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక తర్వాత సుమారు 7వేల మంది రైతులు బలవంతంగా ప్రాణాలు తీసుకున్నారని గుర్తు చేశారు. వాస్తవ సాగుదారులైన కౌలు రైతులను తక్షణమే గుర్తించి ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతాంగానికి ఆహార ధాన్య పంటలకు ఎకరాకు రూ పదివేలు, వాణిజ్యపంటలకు రూ. 20వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులను గుర్తించాలనీ, రైతు ఆత్మహత్యలను నివారించాలనీ, డిమాండ్ చేశారు. ఆయా సమస్యలపై గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వానికి వినతి పత్రాలు ఇవ్వాలన్నారు. ఈ సమావేశానికి మాదిగ పరిశోధకులు మామిడాల భరత్ భూషణ్, వివిధ రైతు ప్రజా సంఘాల రాష్ట్ర నాయకులు సోమిరెడ్డి శ్రీనివాస్, బి కొండల్ రెడ్డి, ప్రభాకర్, కేమిడీ ఉప్పలయ్య, గోపాల్ యాదవ్, వనం సుధాకర్, తుకారాం నాయక్, కన్నం వెంకన్న, వస్కుల సైదమ్మ అంగడి పుష్ప, ఏపూరి సోమన్న, సుధీర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నిండాముంచిన లాంగ్‌జంప్

(మొదటిపేజీ తరువాయి)


దూరాన్ని 3.8 మీటర్ల నుంచి నాలుగు మీటర్లకు పెంచారు. షాట్‌పుట్ దూరాన్ని 5.6 మీటర్ల నుంచి ఆరు మీటర్లకు పొడిగించారు. మహిళలకు 3.75 మీటర్ల దూరాన్ని నాలుగు మీటర్లకు పెంచారు. పరుగుపందెంలో (పురుషులు 1,600 మీటర్లు, మహిళలు 800 మీటర్లు) అర్హత పొందినా లాంగ్‌జంప్, షాట్‌పుట్‌లో అర్హత సాధించకపోవడంతో వేలాది మంది అభ్యర్థులు కొలువుకు దూరమయ్యారు. ఇంకోవైపు నోటిఫికేషన్‌లో ప్రకటించిన నిబంధనల ప్రకారం పురుషులు లాంగ్‌జంప్ నాలుగు మీటర్లు దూకినా కూడా వారిని మెయిన్స్ రాతపరీక్షలకు ఎంపిక చేయలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాలుగు మీటర్ల కంటే ఎక్కువ దూకిన వారినే అధికారులు ఎంపిక చేశారు. ఇక షాట్‌పుట్ ఆరు మీటర్ల దూరం వేసిన వారు కూడా అర్హత పొందలేకపోయారు. ఆరు మీటర్ల కంటే ఎక్కువ దూరం వేసినోళ్లనే మెయిన్స్ రాతపరీక్షలకు ఎంపిక చేశారు.

గతంలో సులభంగా మెయిన్స్‌కు ఎంపిక

రాష్ట్రంలో 17,516 పోలీసు కానిస్టేబుల్, ఎస్ఐ పోస్టులకు 5,07,890 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వారిలో ప్రిలిమినరీ రాతపరీక్షలో 2,07,106 మంది అర్హత సాధించారు. ఈవెంట్లు నిర్వహించిన తర్వాత మెయిన్స్ రాతపరీక్షలకు 1,11,209 మందిని పోలీసు నియామక బోర్డు ఎంపిక చేసింది. వారికి మార్చి 12 నుంచి ఏప్రిల్ 23వ తేదీ వరకు రాతపరీక్షలను నిర్వహించనున్నట్టు ప్రకటించింది. పాత పద్ధతిలో ఈవెంట్లను నిర్వహిస్తే అభ్యర్థులు సులభంగా మెయిన్స్ రాతపరీక్షలకు ఎంపికయ్యే అవకాశముండేది. గత నోటిఫికేషన్‌లో ప్రిలిమినరీ రాతపరీక్షలో అర్హత పొందిన వారికి ఐదు రకాల ఈవెంట్లను నిర్వహించేవారు. అందులో పురుషులకు 800 మీటర్లు, వంద మీటర్ల పరుగుపందెం, లాంగ్‌జంప్, షాట్‌పుట్, హైజంప్ ఉండేవి. అందులో 800 మీటర్ల పరుగుపందెంలో అర్హత సాధించడం తప్పనిసరి.

దీంతో ఉద్యోగానికి దూరమవుతారు. ఇక మహిళలకు సంబంధించి గతంలో వంద మీటర్ల పరుగుపందెం, లాంగ్‌జంప్, షాట్‌పుట్ ఈవెంట్లను నిర్వహించారు. అందులో వంద మీటర్ల పరుగుపందెంతో తప్పనిసరిగా అర్హత సాధించాలి. మిగిలిన రెండింటిలో ఒకదాంట్లో అర్హత పొందితే మెయిన్స్ రాతపరీక్షలు రాసేందుకు ఎంపికయ్యే వారు. కానీ ఇప్పుడు 800 పరుగు పందెం, లాంగ్‌జంప్, షాట్‌పుట్ మూడు ఈవెంట్ల నూ తప్పనిసరి చేశారు. అయితే ఎలాంటి చాయిస్ లేకుండా నిబంధనలు రూపొందించడం వేలాది మంది అభ్యర్థులు అన్యాయానికి గురవుతున్నారు. పాతపద్ధతిలోనే ఈవెంట్లను నిర్వహిస్తే వేలాది మంది అభ్యర్థులు మెయిన్స్ రాతపరీక్షలకు ఎంపికయ్యే అవకాశముండేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. పరుగుపందెంలో అర్హత పొందిన (పురుషులు, మహిళలు) అభ్యర్థులందరినీ మెయిన్స్ రాత పరీక్షలకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మాకు న్యాయం చేయాలి : శ్రీకాంత్, కరీంనగర్



పోలీసు నియామక బోర్డు తప్పిదం వల్ల మాకు అన్యాయం జరిగింది. నాలుగు మీటర్ల లాంగ్ జంప్ దూకినా అనర్హులుగా ప్రకటిం చడం సరైంది కాదు. పరుగుపందెంలో అర్హత పొందిన వారికి సివిల్, ఎక్సైజ్, ఫైర్, జైల్, వార్డెన్, డ్రైవర్, కమ్యూనికేషన్ పోస్టులు పొందేందుకు మెయిన్స్‌కు ఎంపిక చేయాలి. దానివల్ల రాష్ట్ర ప్రభుత్వానికి, పోలీసు నియామక బోర్డుకు ఎలాంటి ఇబ్బంది లేదు.

4 మీటర్లు దూకినా అనర్హులుగా ప్రకటించారు : మహేష్, నాగర్‌కర్నూల్



నేను మూడుసార్లు నాలుగు మీటర్ల గీత వద్ద లాంగ్‌జంప్ దూకాను. అయినా నన్ను అనర్హులుగా ప్రకటించారు. నాలుగు మీటర్ల కంటే ఎక్కువ దూరం దూకాలనడం సరైంది కాదు. ఆ నిర్ణయం వల్ల నేను ఉద్యోగం కోల్పోయాను. పరుగుపందెంలో అర్హత పొందిన నన్ను మెయిన్స్ రాతపరీక్షలకు ఎంపిక చేయాలి.

షాట్‌పుట్ 6 మీటర్ల గీత మీద వేశాను : సోమేశ్, నల్లగొండ



షాట్‌పుట్ ఆరు మీటర్ల గీత మీద వేశాను. అయినా అనర్హులు ప్రకటిం చడం అన్యాయం. డీఎస్పీని రివ్యూ చేయాలని కోరినా స్పందించలేదు. గ్రౌండ్ నుంచి బలవంతంగా బయటికి పంపారు. మాకు న్యాయం చేయాలి.

మూత్రవిసర్జనకూ అవకాశమివ్వలేదు : బోద బాబురావు, మహబూబాబాద్



పరుగుపందెం అర్హత సాధిం చాను. నాకు మూత్రం వస్తుందం టూ అధికారులను వేడుకున్నా వెళ్లేందుకు అవకాశమి వ్వలేదు. దీంతో ఈవెంట్లపై పూర్తిగా కేంద్రీకరించలేకపో యాను. అయినా లాంగ్‌జంప్ ఐదు మీటర్లు దూకినా ఫౌల్ పేరుతో అనర్హునిగా ప్రకటించారు. రివ్యూ అడిగినా అవకాశం కల్పించలేదు. సీసీ పుటేజీ బయటపెట్టాలి. లేదంటే మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తాం.

రవాణా రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పే కుట్ర

- కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- పబ్లిక్ అండ్ ప్రయివేట్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) సంఘర్ష యాత్రలో..: అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వీరయ్య, శ్రీకాంత్



నవతెలంగాణ–బోధన్/బాన్సువాడ/రామాయంపేట

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన మోటారు రవాణా సవరణ చట్టం–2019 ప్రకారం మొత్తం రవాణా రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పే కుట్ర జరుగు తుందని ఆలిండియా పబ్లిక్ అండ్ ప్రయివేట్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు ఎస్ వీరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టం అమలులోకి వస్తే ఆటో, టాక్సీ, మినీ గూడ్స్, బస్సులు.. నడుపుకుంటూ ఉపాధి పొందుతున్న వారు సైతం ఇకపై ఈ వాహనాలన్నింటినీ కార్పొరేట్ సంస్థలకి అప్పజెప్పి వారి కింద దేహి అని బతికేలా కార్మికుల జీవితాలను దిగజార్చే పరిస్థితి తీసుకోచ్చారని అన్నారు. యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రవాణా రంగ కార్మికుల సంఘర్షణ యాత్ర మంగళవారం ఉదయం నిజామాబాద్ జిల్లా బోధన్, కామారెడ్డి జిల్లా బాన్సువాడలో కొనసాగింది. బోధన్ బస్టాండ్ వద్ద యాత్రకు కార్మికులు, నాయకులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి మెదక్ జిల్లా రామాయంపేట పట్టణానికి చేరుకుంది. రామాయంపేట శివారులోకి ఆటో కార్మికులు పెద్ద ఎత్తున చేరుకొని అధ్యక్షులు వీరయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌లకు పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి మెదక్ క్రాస్ రోడ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పట్టణాల్లో, అడ్డాల్లో జరిగిన సభల్లో వీరయ్య, శ్రీకాంత్ మాట్లాడారు. కార్పొరేట్ శక్తులను ఎదిరించి రవాణా రంగ వ్యవస్థను కాపాడుకునే విధంగా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నరేంద్ర మోడీ తీసుకువచ్చిన కార్మిక చట్టాల సవరణ వల్ల సంఘాలు పెట్టుకునే హక్కును హరించే ధోరణిని తెలంగాణలోని టీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీలో అమలు చేస్తున్నట్టుగా స్పష్టంగా కనబడుతోందని అన్నారు. ఈ ధోరణిని రాష్ట్ర ప్రభుత్వం విడనాడి ఆర్టీసీ సంస్థను పరిరక్షిస్తూ, ఆర్టీసీలో కార్మిక సంఘాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. హక్కులను హరిస్తే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. మోటారు వాహనాల సవరణ చట్టం ప్రకారమే ప్రతిరోజు వాహనాల ఫొటోలు తీస్తూ పెద్ద ఎత్తున జరిమానాలు విధిస్తూ దుర్మార్గపు చర్యకు పాల్పడుతున్నారని అన్నారు. వాహనాలకు జరిమానాలు విధించే పరిస్థితి తెలంగాణకే పరిమితం కాలేదని, దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి నెలకొందన్నారు. ఇది మోడీ చేసిన చట్టం ఫలితమన్నారు. ఈ చట్టాన్ని అడ్డుకోవడానికి దేశవ్యాప్త ఉద్యమాలు రావాలన్నారు. యాత్రలో సీఐటీయూ మెదక్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, నాయకులు, రవాణా రంగ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

నీరాకు వేదామృతం పేరు పెడితే తప్పేంటి?

- బ్రాహ్మణ సంఘాలది అనవసర రాద్ధాంతం: కేజీకేఎస్

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

నీరాకు వేదామృతం అని పేరుపెడితే తప్పేంటని కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) రాష్ట్ర అధ్యక్షులు ఎంవి రమణ ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్వచ్ఛమైన ప్రకృతి పానీయం నీరాకు వేదామృతం అని పేరు పెడితే వేదాలను కించపరిచినట్టు ఎలా అవుతుందని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నీరా కేఫ్ త్వరలో ప్రారంభం కానున్నదని తెలిపారు. ప్రకృతి సిద్ధంగా తాటి, ఈత చెట్లనుండి సూర్యరశ్మి రాకముందే తీసే స్వచ్ఛమైన పానీయమే నీరా అని పేర్కొన్నారు. దీన్ని బాటిళ్లలో, ప్యాకెట్లలో నింపి వినియోగదారులకు అందజేయనున్నారని తెలిపారు.

రేంజర్ల రాజేష్‌పై దాడిని ఖండించండి..

- బాధ్యులను వెంటనే అరెస్టు చేయాలి : కేవీపీఎస్


నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

బహుజన కవి, వాగ్గేయకారుడు రెంజర్ల రాజేష్ కుటుంబంపై భౌతిక దాడులకు పాల్పడిన మతోన్మాద దుండగులను తక్షణమే అరెస్టు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్‌వెస్లీ టి స్కైలాబ్ బాబు ఒక ప్రకటన విడుదల చేశారు. అయ్యప్ప స్వాముల ముసుగులో వచ్చిన ఆర్ఎస్ఎస్, భజరంగ్ దళ్, బీజేపీ పరివారం రెంజర్ల రాజేశ్ ఇంటిపై దాడి చేసి, అతని కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేసిందని తెలిపారు. రాజేశ్‌ను ముక్కలు ముక్కలుగా నరుకుతామంటూ, కుటుంబాన్ని తగలబెడతామంటూ బెదిరింపులకు పాల్పడ్డారని పేర్కొన్నారు. మహిళలపై దౌర్జన్యం చేశారని తెలిపారు. తక్షణమే రాజేశ్ కుటుంబానికి రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దౌర్జన్యానికి పాల్పడిన మతోన్మాద దుండగులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

అరెస్టులపై ఉన్న శ్రద్ధ సమస్యల పరిష్కారంపై లేదు

- ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యల పరిష్కార పోరాట సమితి

నవతెలంగాణ–హిమాయత్‌నగర్



రాష్ట్ర ప్రభుత్వానికి అరెస్టులపై ఉన్న శ్రద్ధ ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యల పరిష్కారంపై లేకపోవడం విచారకరమని ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యల పరిష్కార పోరాట సమితి, పలు విద్యార్థి సంఘాలు విమర్శించాయి. సోమవారం చలో ప్రగతిభవన్‌కు తరలివస్తున్న యువజన, విద్యార్థి సంఘాల నేతలు, పోలీసు అభ్యర్థులను అక్రమంగా అరెస్టు చేయడం, నిర్బంధించడం, దాడులు చేయడానికి ఖండించాయి. అక్రమ అరెస్టులను నిరసిస్తూ.. ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యల పరిష్కార పోరాట సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం హైదరాబాద్ నారాయణగూడ ఫ్లైఓవర్ వద్ద పలు విద్యార్థి సంఘాలు నిరసన ప్రదర్శన నిర్వహించాయి.

ఈ సందర్భంగా పోరాట సమితి కో–ఆర్డినేషన్ కమిటీ సభ్యులు వలీ ఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్ర, నేర్లకంటి శ్రీకాంత్, సత్యప్రసాద్ (ఏఐవైఎఫ్), అనగంటి వెంకటేష్, జావీద్ (డీవైఎఫ్ఐ), సలీం పాషా (వైజే ఎస్), అశోక్ రెడ్డి, సునీల్ (ఎస్ ఎఫ్ఐ), అరుణ్ కుమార్(విజేఎస్) రాష్ట్ర బాధ్యులు మాట్లాడారు. తెలంగాణ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు వల్ల ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అభ్యర్థులకు జరిగిన అన్యాయంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. బోర్డ్ చైర్మెన్ రోజువారీ ప్రకటనలు ఆపాలని, అభ్యర్థుల వాదనను బోర్డు పరిగణలోకి తీసుకోవాలని, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి

- అదుపుతప్పి కాల్వలో బోల్తాకొట్టిన కారు

నవతెలంగాణ-జగదేవపూర్

కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టి పక్కనే గల కాల్వలో పడటంతో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన సిద్ధిపేట జిల్లా జగదేవపూర్ మండలం మునిగడప గ్రామంలో జరిగింది. సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐ కృష్ణమూర్తి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బీబీనగరర్, బొమ్మల రామారానికి చెందిన ఆల్టో కారు ఏపీ 29 బీడీ 4538లో బోల్లు సమ్మయ్య, బొల్లు స్రవంతి, రాజమణి, భవ్యశ్రీ, లోకేష్, వెంకటేష్ వేములవాడ వెళ్లి రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్నారు. తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో ప్రమాదం జరిగింది .దాంతో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురిలో బోల్లు సమ్మయ్య(40), బొల్లు స్రవంతి(32), రాజమణి(48), భవ్యశ్రీ(15), లోకేష్(12) అక్కడికక్కడే మృతి చెందారు.

పదో తరగతి విద్యార్థులకు మరింత ఛాయిస్ ఇవ్వాలి

- విద్యాశాఖ కార్యదర్శికి ఎస్ఎఫ్ఐ వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పదో తరగతి విద్యార్థుల పరీక్షలకు సంబంధించి మరింత ఛాయిస్ ఇవ్వాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. వ్యాసరూప ప్రశ్నల్లో సెక్షన్ల వారీగా ఛాయిస్ ఇవ్వాలని కోరింది. ఈ పరీక్షలు రోజు విడిచి రోజు నిర్వహించాలని సూచించింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి వాకటి కరుణను మంగళవారం హైదరాబాద్‌లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు, సహాయ కార్యదర్శి కె అశోక్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు లెనిన్‌గువేరా కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులకు సూక్ష్మ ప్రశ్నలకు 30 శాతం ఛాయిస్ పెంచాలని వారు ఈ సంద ర్భంగా డిమాండ్ చేశారు. వ్యాసరూప ప్రశ్నలకు సెక్షన్ల వారీగా ఛాయిస్ ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో ప్రస్తుత పదో తరగతి విద్యార్థులు కరోనా కారణంగా అభ్యసనకు సరైన పరిస్థితుల్లేవనీ, ఇలాంటి తరు ణంలో ఈ విధానంలో ఛాయిస్ లేకుండా పరీక్షలు నిర్వహిస్తే సిలబస్ మొత్తం పరీక్షలు రాయడానికి సమయం సరిపో దని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం ఛాయిస్ ఇచ్చి విద్యార్థులు నష్టపోకుండా చూడాలని కోరారు.

ఇండియన్ బ్యాంక్ డోర్ టు డోర్ క్యాంపెయిన్



హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని ఇండియన్ బ్యాంక్ తన పథకాలను క్యాంపెయిన్ చేయ డానికి సరికొత్త ఆలోచన చేసింది. ఆ బ్యాంక్ సిబ్బంది హైదరాబాద్‌లో ఆదివారం వేకువ జామునే 'డోర్ టు డోర్ క్యాంపెయిన్‌'ను చేపట్టారు. ఇండియన్ బ్యాంక్ అందిస్తున్న 'ఇండ్ శక్తి 555 డేస్' ప్లాన్ సహా డిజిటల్ ఉత్పత్తులు, కరెంట్, సేవింగ్ ఎకౌంట్లు, రిటైల్ రుణాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ చంద్ర ప్రకాశ్ నేతృత్వంలో జరిగిన ఈ క్యాంపెయిన్‌లో అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు, చీఫ్ మేనేజర్లు, ఇతర ఉద్యోగ, సిబ్బంది పాల్గొన్నారు.

జనగామ ఆస్పత్రి సిబ్బందికి అభినందనలు : హరీశ్ రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జనగామ మాతా, శిశు ఆస్పత్రి సిబ్బందికి వైద్యారోగ్యశాఖ మంత్రి టి.హరీశ్ రావు అభినందనలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ట్వీట్ చేశారు. ఒకే రోజు 35 మందికి ప్రసవాలు చేసి తమ సేవను చాటుకోవడం అక్కడి డాక్టర్లు, సిబ్బందికి ఉన్న నిబద్ధతకు, అంకితభావానికి నిదర్శనమని పేర్కొన్నారు.

ఎల్అండ్‌టీ మెట్రో రైలు నుంచి సెస్ బకాయిలను రికవరీ చేయాలి

- లేబర్ కమిషనర్‌కు సీపీఐ(ఎం) వినతి

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎల్అండ్‌టీ హైదరాబాద్ మెట్రోరైలు సంస్థ నుంచి రూ.163కోట్ల సెస్ బకాయిలను వెంటనే రికవరీ చేయాలని, బడా నిర్మాణ సంస్థల నుంచి సెస్ వసూలు చేయాలని సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం లేబర్ కమిషనర్‌కు సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శివర్గ సభ్యులు ఎం.శ్రీనివాస్‌రావు, ఎం.దశరథ్‌తో కలిసి వినతిపత్రం అందజేశారు. పత్రంలోని పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ మెట్రోరైలును నిర్మించి, నిర్వహిస్తున్న ఎల్అండ్‌టీ సంస్థ కార్మిక శాఖకు చెల్లించాల్సిన రూ.163కోట్ల లేబర్ సెస్‌ను ఎగవేసింది. 2014లోనే సెస్ చెల్లించాలని కార్మికశాఖ అధికారులు ఎల్అండ్‌టీ సంస్థకు నోటీసులు జారీచేసినా చెల్లించలేదు. సెస్ చెల్లింపు గురించి హైకోర్టు నుంచి స్టే తెచ్చుకున్న ఎల్అండ్‌టీ సంస్థకు కార్మికశాఖ అధికారులు వత్తాసు పలికారు. 2019 వరకు హైకోర్టులో కనీసం అఫిడవిట్ కూడా దాఖలు చేయలేదు. సీపీఐ(ఎం) నగర కమిటీ ఫిర్యాదుతో ఇటీవల కోర్టులో కౌంటర్ వేసినప్పటికీ సెస్ వసూలుకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఎల్అండ్‌టీ సంస్థకు మూడు వారాలే స్టే ఇచ్చినప్పటికీ స్టే ఉందనే పేరుతో అధికారులు సెస్ వసూలుకు పూనుకోలేదు. సెస్ చట్టం ప్రకారం ప్రతి బకాయిపైనా నెలకు రెండు శాతం చొప్పున వడ్డీ వసూలు చేయాల్సి ఉంటుంది. రూ.163కోట్లకు వడ్డీతో కలిపి తక్షణమే ఎల్అండ్‌టీ నుంచి రికవరీ చేయడానికి చర్యలు ప్రారంభించాలి. మెట్రోరైలు నిర్మాణానికి వ్యయం పెరగడంతో మొత్తం వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుని ఒక శాతం చొప్పున సెస్ వసూలు చేయాలి. ఎల్అండ్‌టీ సెస్ ఎగవేతకు బాధ్యులైన అధికారులపైనా చర్యలు తీసుకోవాలి. విజిలెన్స్ శాఖ చేసిన సిఫార్సులను అమలు చేయాలి. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని అనేక బడా నిర్మాణ సంస్థలు 2014 నుంచి 2020 వరకు సెస్ చెల్లించలేదు. సెస్ వసూలు చేసే బాధ్యతా జీహెచ్ఎంసీదా? కార్మిక శాఖదా? అనే వివాదంతో ఇంతరకు వసూలు చేయలేదు. సీపీఐ(ఎం) చేసిన ఆందోళనతో 2020కి ముందు సెస్ చెల్లించని సంస్థలు వేల సంఖ్యలో ఉన్నాయి. వీటన్నింటి నుంచి సెస్ వసూలుకు చర్యలు ప్రారంభించాలని పేర్కొన్నారు.

11,103 మంది కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించండి

- సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 11,103 మంది కాంట్రాక్టు ఉద్యోగులు, అధ్యాపకులను క్రమబద్ధీ కరించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు మంగళవారం ఆయన లేఖ రాశారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామంటూ గతేడాది మార్చి తొమ్మిదిన సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించారని గుర్తు చేశారు. 80,039 ఖాళీ పోస్టులను కొత్త నియామకాల ద్వారా భర్తీ చేస్తామన్నారని తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులు, అధ్యాపకులు రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన ప్రక్రియ పూర్తి చేసి సీఎం ఆమోదం కోసం దస్త్రాన్ని అధికారులు సమర్పిం చారని పేర్కొన్నారు. 11,103 మంది ప్రధానంగా మెడికల్ అండ్ హెల్త్ ఉద్యోగులు, జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీల్లో కాంట్రాక్టు అధ్యాపకు లుగా పనిచేస్తున్నారని వివరించారు. రెగ్యులరైజే షన్ ఉత్తర్వుల కోసం వేయి కండ్లతో ఎదురు చూస్తున్నారని తెలిపారు. రెగ్యులరైజేషన్ ఆలస్యం కావడం ప్రభుత్వానికి మంచిది కాదని పేర్కొ న్నారు. రెగ్యులరైజేషన్ ఉత్తర్వులను వెంటనే జారీ చేయాలంటూ అధికారులను ఆదేశించాలని కోరారు.

డిసెంబర్ వేతనాలు చెల్లించాలి

- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 2022 డిసెంబర్ నెల జీతాన్ని వెంటనే చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఆ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.వెంకటేశ్, జె.కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు పద్మశ్రీ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఎడ్యుకేషన్, ఇరిగేషన్, కార్పొరేషన్లు, యూనివర్సిటీలు, హెల్త్, రెవెన్యూ తదితర 36 శాఖల్లో లక్షా నలభై వేల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు.

వారికి పదో తేదీ దాటినా ఇంకా వేతనం చెల్లించకపోతే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. ప్రతినెలా 15 తేదీ వరకు జీతాలు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. ట్రైబల్ వెల్ఫేర్‌లోని సిబ్బంది జీతాలు కూడా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 2022 డిసెంబర్ నెల వేతనం చెల్లించడమే కాకుండా జనవరి నెల నుంచి ఈ సమస్య ఉత్పన్నం కాకుండా చూడాలని కోరారు. ఇదే అంశాన్ని జె.వెంకటేశ్, గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్ యూనియన్ రాష్ట్ర నేత బి. మధు ఆర్థిక శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

సంపాదకీయం

వైజ్ఞానిక అద్భుతాలు సాకారమయ్యేనా?

'శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రపంచానికే భారత్ దిక్సూచి' అని ఏటేటా భారీగా వెలువడుతున్న పరిశోధనా పత్రాలను ఉటంకిస్తూ ప్రభుత్వ పెద్దలు కొన్నేండ్లుగా ఊదరగొడుతున్నారు. తాజాగా నాగ్‌పూర్ విశ్వవిద్యాలయం వేదికగా జరిగిన 108వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌ను ప్రారంభిస్తూ ప్రధాని నరేంద్రమోడీ 'ఆత్మనిర్భర భారత్ ఆవిష్కారానికి

> ఆర్అండ్‌డీకి ప్రభుత్వ కేటాయింపులు ఇతోధికం కావాలని పార్లమెంటరీ సంఘం ఎప్పుడో సూచించింది. 84వేలకు పైగా అంకుర సంస్థలతో నూతన ఆవిష్కరణలకు ప్రధాన కేంద్రంగా భారత్ అవతరిస్తోందని ప్రధాని సహా వారి నేతలందరూ హెూరెత్తిస్తున్నారు. కానీ, వినూత్న సాంకేతికతలతో ముందడుగు వేస్తున్న స్టార్టప్‌ల సంఖ్య నాలుగు వందలకు మించడం లేదన్నది ప్రభుత్వ వర్గాల అంచనే. పేటెంట్ నమోదు చేసుకోవాలంటే సగటున 42 నెలలు సమయం పడుతోందని 2021-22 ఆర్థిక సర్వే స్పష్టం చేస్తోంది.

శాస్త్రవేత్తలు దోహదపడాలని, జనజీవనంలో మేలిమి మార్పులు తీసుకొచ్చేందుకు తమ మేధాశక్తిని వినియోగించాలి' అని పిలుపిచ్చారు. ప్రధాని ఆశించినట్టు వైజ్ఞానిక అద్భుతాలు సాకారం కావాలంటే పరిశోధనలూ అభివృద్ధి(ఆర్అండ్‌డీ)కి విరివిగా నిధులు కేటాయించాలి. రెండున్నర దశాబ్దాల క్రితం ఈ రంగానికి ఇండియా, చైనాల వ్యయం దాదాపు సమంగానే (జీడీపీలో సుమారు 0.6శాతం) ఉండేది. తరువాతి కాలంలో చైనా ఆ మొత్తాన్ని అధికంగా పెంచి... నేడు శాస్త్రసాంకేతిక అగ్రశక్తిగా ఎదిగింది. మనం మాత్రం ఇప్పటికీ జీడీపీలో 0.7శాతం మాత్రమే ఖర్చు పెడుతున్నాం. అంటే బ్రెజిల్, దక్షిణాఫ్రికా వంటి దేశాలకన్నా తక్కువే అని దేశ దుస్థితిని పార్లమెంటరీ సంఘమే నివేదించింది.

కేంద్ర పెద్దలు చెప్పినట్టు శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత్ దూసుకుపోతుంటే విశ్వ జ్ఞాన సూచీ(జీకేఐ)లో 138 దేశాలకుగాను 75వ స్థానంలో ఎందుకుంది? ఎందుకంటే ఇప్పుడు దేశంలో నాటి చాందస భావాలను, ఆచార సంప్రదాయాలను నేటి విజ్ఞానంలో మిళితం చేయడానికి అధికారంలో ఉన్న సూడోసైన్స్ ప్రచారకులు ప్రయత్నిస్తున్నారు కాబట్టి. పాఠ్య పుస్తకాలు, మీడియా, రచనలు, సినిమాలు, పత్రికల నుపయోగించి చరిత్రను వక్రీకరిస్తున్నారు. గతంలో 'ఇండియన్ సైన్స్ కాంగ్రెస్' సాక్షిగా మోడీ సహా వారి వంది మాగాధులందరూ డార్విన్ సిద్ధాంతంపై, న్యూటన్ సిద్ధాంతంపై చేసిన అనుచిత వ్యాఖ్యలు గుర్తుకురాక మానవు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఏ- క్లాజ్ హెచ్ ద్వారా శాస్త్రీయ దృక్పథాన్ని, మానవ విలువల్ని, నూతన విషయాలను కనుక్కొనే స్ఫూర్తి, సంస్కరణ శీలతను అభివృద్ధి పరచడం ప్రతి పౌరుని ప్రాథమిక బాధ్యతగా నిర్దేశించబడింది. కానీ రాజ్యాంగబద్ధంగా ప్రజల చేత ఎన్నుకోబడిన నాయకులు, శాస్త్రీయ ఆలోచనలతో విజ్ఞానాన్ని అందించాల్సిన ప్రొఫెసర్లే అశాస్త్రీయ భావజాలాన్ని ప్రచారం చేయటం దౌర్భాగ్యం.



ఆర్అండ్‌డీకి ప్రభుత్వ కేటాయింపులు ఇతోధికం కావాలని పార్లమెంటరీ సంఘం ఎప్పుడో సూచించింది. 84వేలకు పైగా అంకుర సంస్థలతో నూతన ఆవిష్కరణలకు ప్రధాన కేంద్రంగా భారత్ అవతరిస్తోందని ప్రధాని సహా వారి నేతలందరూ హెూరెత్తిస్తున్నారు. కానీ, వినూత్న సాంకేతికతలతో ముందడుగు వేస్తున్న స్టార్టప్‌ల సంఖ్య నాలుగు వందలకు మించడం లేదన్నది ప్రభుత్వ వర్గాల అంచనే. పేటెంట్ నమోదు చేసుకోవాలంటే సగటున 42 నెలలు సమయం పడుతోందని 2021-22 ఆర్థిక సర్వే స్పష్టం చేస్తోంది. అమెరికా, చైనా, దక్షిణ కొరియాలతో పోలిస్తే ఇది దాదాపు రెండు రెట్లు అధికం. అటువంటి ప్రగతి విఘాతక వ్యవస్థాగత లోపాలను పరిష్కరించకుండా, ఉన్నత విద్యను పరిశ్రమలతో అనుసంధానం చేయకుండా ప్రధాని ఎన్ని పిలుపులిచ్చి ఏం ఉపయోగం?

కేంద్ర ప్రభుత్వ ప్రధాన వైజ్ఞానిక సలహాదారు ఆచార్య అజయ్ కుమార్ సూద్ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో మాట్లాడుతూ, మన శాస్త్రీయ ప్రచురణల నాణ్యతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన ఉదాహరించిన లెక్కల ప్రకారం దక్షిణ కొరియా, జపాన్‌లలో ప్రతి పది లక్షల జనాభాకు వరసగా7498, 5304 మంది చొప్పున పరిశోధకులు ఉన్నారు. అదే భారత్‌లో140 కోట్లకు ఆ సంఖ్య కేవలం 255. మార్కులు ర్యాంకుల చట్రంలో ఇరుక్కుపోయిన మన విద్యావ్యవస్థ నవతరంలో వైజ్ఞానిక స్పృహ పెంపొందించడం లేదు. పైగా సమాజాన్ని తిరోగమనం వైపు నడిపే నూతన విద్యావిధానాన్నికి తలుపులు తీసి, వైజ్ఞానికంగా దేశం దూసుకుపోతుందంటే ఎలా? మౌలిక పరిశోధనలపై ఆసక్తి కలిగిన యువతకు దాన్నే జీవనోపాధిగా ఎంచుకొనేందుకు అవకాశాలూ కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. తత్ఫలితంగా శాస్త్రవేత్తలుగా రాణించగలిగినవారు అనివార్యంగా ఇతర రంగాల వైపు మరలిపోతున్నారని నిటి అయోగ్ గతంలోనే ఆందోళన వ్యక్తంచేసింది. రాశిలోనే కాదు, వాసిలోనూ మన పరిశోధనలు సమాజానికి ఉపయోగపడాలంటే మూస చదువులను సంస్కరించినప్పుడే మన విజ్ఞానశాస్త్ర వెలుగులు దేశ సరిహద్దులు దాటుతాయి.

దేశ సుస్థిరాభివృద్ధికి చోదకశక్తిగా విజ్ఞానశాస్త్రాన్ని గుర్తించి దీర్ఘకాల ప్రణాళికలతో ప్రభుత్వాలు దాన్ని ప్రోత్సహించాలి. విజ్ఞానశాస్త్ర ఫలితాల్ని అనుభవించడమే కాదు, ఆ జ్ఞానానికి బాసటగా నిలబడటం శాస్త్రీయతకు బలం. ఇదే నిజమైన జ్ఞానం. శాస్త్రీయ వివేచన పెంపొందేలా జీవితాన్ని మలుచుకోవాలి. నూతన ఆవిష్కరణలతోనే సమాజం మారుతోంది. అప్పుడే మూఢత్వపు చీకట్లు తొలగి జ్ఞానకాంతులు ప్రసరిస్తాయి. వీన్ బర్గ్ అనే శాస్త్రవేత్త చెప్పినట్టు ప్రస్తుత సమాజంలోని సాంఘిక సమస్యలను ఎదుర్కోవటం విజ్ఞాన శాస్త్రంతోనే సాధ్యం.

బ్రెజిల్ అధికార కేంద్రాలపై బోల్సనారో మద్దతుదార్ల దాడి!

-ఇంటి ముందు తలుపులకు సెంటర్ లాక్ వేసి బయట గొళ్లం పెట్టకండి.

-ఇళ్లకు నాసిరకం తాళాలు వాడొద్దు, తాళం కనపడకుండా కర్టెన్స్ వేయాలి. ఇంటి తలుపుల ముందు చెప్పులు ఉంచండి.

-పేపర్ బాయ్, పాలు వేసే వాళ్లకు రావద్దని చెప్పండి.

-మీరు ఊరికి వెళ్లేటప్పుడు మీకు నమ్మకమైన వారికి, అలాగే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వండి.

-బయట గేటుకు లోపల నుంచి తాళం వేయండి. మీ ఇంట్లో ముందు గదిలో లైట్ వేసి ఉంచండి.

-ఊరికి వెళ్లి న తర్వాత కూడా ఇంటి పక్క వారికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకుంటూ ఉండాలి.

-బయటకు వెళ్లేటప్పుడు, వాకిట్లో ముగ్గులు వేసేటప్పుడు మెడలోని బంగారు ఆభరణాలు జాగ్రత్త. వీలైతే చీర కొంగుతో కవర్ చేసుకుంటే మంచిది.

-మీ కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే దొంగలు భయపడే అవకాశం ఉంది. భద్రత ఎక్కువగా ఉంటుంది.

-ఇంటికి సీసీ కెమెరాలు సొంతంగా ఏర్పాటు చేసుకొని, వాటిని మీ మొబైల్‌కి అనుసందానం చేస్తే, మొబైల్ ఫోన్ ద్వారా సీసీకెమెరా దృశ్యాలను ఏపాటికప్పుడు వీక్షించే అవకాశం ఉంటుంది.

- ఇంటి సమీపంలో కానీ, మీ కాలనీలో కాని ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించిన ఎవరిమీదైనా అనుమానం వస్తే వెంటనే 100 టోల్ ఫ్రీ నెంబర్ కు గాని, రాచకొండ పోలీస్ కంట్రోల్ రూమ్ 9494721100కు లేదా వాట్సాప్ నెంబర్ 9490617111కు డయల్ చేయాలి.

-మరింత సమాచారం కోసం మీర్ పేట్ పోలీస్ స్టేషన్ నెంబర్: 8333993351,ఎం మహేందర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, సెల్ నెంబర్: 9490617342,ఆర్. సైదులు, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, సెల్ నెంబర్: 9491030081 సంప్రదించవచ్చు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-కాప్రా



సంక్రాంతి సంబరాల్లో భాగంగా కాప్రా శ్రీ శ్రీనివాస ఆఫీసర్స్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రంగోలీ ముత్యాల ముగ్గుల పోటీలు ఉత్సాహంగా సాగాయి. గెలుపొందిన మహిళలకు బహుమతులను ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ కార్పొరేటర్ కొత్త రామారావుతో పాటు కాలనీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు చంద్రమౌళి, భాస్కర్‌రెడ్డిలు అందజేశారు. ప్రథమ బహుమతి నాగదుర్గా, శిరీష, ద్వితీయ బహుమతి జ్యోతి, తతీయ బహుమతి హేమ గెలుచుకున్నారు. మణి ప్రభ, రాధ, కల్పన, రమాదేవి, సుజనా, వనజా కాలనీ నేతలు ఠాగూర్, ప్రభాకర్ రెడ్డి, సుభాష్ రెడ్డి, క్రిష్టా రెడ్డి, సుబ్బారావు మురళి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వేయించినందుకు కార్పొరేటర్‌కు సన్మానం

నవతెలంగాణ-కాప్రా



చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్న న్యూ రాఘవేంద్రనగర్ ఉప్పలయ్య రోడ్డును సుమారు 30 లక్షల రూపాయల వ్యయంతో కొత్త సిమెంట్ రోడ్డు వేయించినందుకు కాలనీవాసులు జీహెచ్ ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ శాంతి సాయి జన శేఖర్‌కు కతజ్ఞతలు తెలుపుతూ మంగళవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప్పలయ్య, మదన్‌చారి, చక్రపాణి, ప్రభాకర్, తుల్జాబాయ్, అమరేందర్, విజయలక్ష్మి, స్వరూప, రాంబాయి తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'తో చరిత్ర సృష్టించిన రాష్ట్ర ప్రభుత్వం

- 18 నుంచి కంటి వెలుగు
- కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి
- కంటి వెలుగుపై అవగాహన సదస్సు

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్



ప్రపంచంలోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టి చరిత్ర సష్టించిందని ప్రజలకు ఇలాంటి ఉపయోగకరమైన కార్యక్రమాన్ని ఎక్కడా చేపట్టలేదని ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల కోసం పని చేస్తూ వారి బాగోగులకై పరితపిస్తున్నారని రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మంగళవారం మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఈనెల 18వ తేదీ నుంచి నిర్వహించనున్న కంటి వెలుగు కార్యక్రమంపై జెడ్పీ చైర్మెన్ మలిపెద్ది శరత్ చంద్రా రెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, కలెక్టర్ హరీశ్, సంబంధిత శాఖల అధికారులతో కంటి వెలుగు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా మంత్రి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు.

అనంతరం మంత్రి మాట్లాడుతూ రూ. 250 కోట్లతో కంటి వెలుగు నిర్వహించడం జరుగుతుందని.. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేసి రాష్ట్రం లోనే ప్రథమ స్థానంలో నిలవాలన్నారు. ఈ విషయంలో అధికా రులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఉంటే అది తప్పకుండా సాధ్యమవుతుందని మంత్రి స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా శిబిరాలు ఏర్పాటు చేసిన చోట్లలో పరీక్షలు నిర్వహించడంతో పాటు కంటి పరీక్షలు నిర్వహించేందుకు ప్రజల ఇండ్ల వద్దకే వైద్యులు, సిబ్బంది వస్తారని తెలిపారు. కంటి పరీక్షలు ప్రయివేటు ఆస్పత్రుల్లో చూపించుకోలేని వద్దులు, వయస్సు పైబడిన వారికి, ఆర్థిక స్తోమత లేని వారికి ఇది వరం లాంటిదన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయ వంతం చేయడానికి జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు.

ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ కంటి వెలుగుపై విస్తత ప్రచారం కల్పించాలని, ప్రజలకు పూర్తి స్థాయిల తెలిసేలా అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అవసర మైన చోట్ల శిబిరాల (క్యాంపు)ల సంఖ్యను పెంచాలని సూచిం చారు. ప్రభుత్వం ప్రజల కోసం చేపడుతున్న కంటి వెలుగు కార్యక్ర మాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా పరిషత్ చైర్మెన్ మాట్లాడుతూ.. ఎంపీడీవోలు, గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించి ఈ కార్యక్ర మం విజయవంతమయ్యేలా చూడాలన్నారు. దీనికి సంబంధించి ఆయా మండలాల మండల పరిషత్ అభివద్ధి అధికారులు (ఎంపీడీవోలు) ముందస్తుగా ఒక కార్యాచరణ రూపొందిం చుకోవాలని పంచాయతీ కార్యదర్శులు వారి గ్రామాల్లో ప్రజలకు తెలియజేసేలా అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు శిబిరాలు నిర్వహించే గ్రామాల వివరాలను ముందస్తుగా ప్రజలకు తెలిసేలా చూడాలని వివరించారు.

కలెక్టర్ హరీశ్ మాట్లాడుతూ అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని సంబంధిత శాఖల అధికారులు, జిల్లా అధికారులతో సమీక్ష సమావే శాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. జిల్లా వ్యాప్తంగా కంటివెలుగుకు సంబంధించి 27,51,810 మందిని గుర్తించామని వారిందరికి కంటి పరీక్షలు నిర్వహిచడం జరుగుతుందన్నారు. దీనికి సంబంధించి జిల్లాలో 480 లొకేషన్లలో 79 బందాలను (టీమ్స్) ఏర్పాటు చేసినట్టు వివరించారు. కంటి వెలుగుకు సంబం ధించి ముందస్తు ప్రణాళికను తయారు చేసి ఎక్కడ శిబిరాన్ని నిర్వహిస్తున్నారనే సమాచారాన్ని ఒకరోజు ముందుగానే ప్రజలకు తెలిసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా కంటి వెలుగుకు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేసినారు కార్యక్రమానికి ముందు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీనివాస్ కంటి వెలుగు కార్యక్రమంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ దయాకర్ రెడ్డి, జిల్లాలోని మేయర్లు, డిప్యూటీ మేయర్లు, కార్పొ రేటర్లు, కౌన్సిలర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, మున్సిపల్ కమిషనర్లు, ఆయా మండలాల ఎంపీడీవోలు, ప్రజాప్రతినిధులు, వైద్యాధికారులు, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఊరెళ్తున్నారా... జర భద్రం

- ఇన్‌స్పెక్టర్ కె. చంద్రశేఖర్

నవతెలంగాణ-జవహర్‌నగర్



ప్రజలు ఊరెళ్తుంటే జర భద్రంగా ఉండాలని జవహర్ నగర్ ఇన్‌స్పెక్టర్ కె. చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం జవహర్ నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఆటోలతో వినూత్నంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ఊరికి వెళ్లే సందర్భంలో అనుమానస్పద వాహనాల్లో ప్రయాణించవద్దని, దూర ప్రాంతాలకు వెళ్లేవారు తమ ఇంటి చిరునామా, ఫోన్ నెంబర్లను సంబంధిత పోలీస స్టేషన్ అధికారులకు తెలపాలన్నారు. రాత్రి సమయంలో కొత్తవారు ఎవరైనా వస్తే వారి వివరాలు తెలుసుకొని నమో దు చేసుకోవడం మంచిదని, అనుమానితులు కనిపిస్తే వెం టనే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. ఇంట్లోని బంగారు నగలు, నగదును బ్యాంక్ లాకర్లలో భద్రపరుచు కోవడం ఉత్తమమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్‌లు నాగరాజు, మోహన్, రాంబాబు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్

పేదలు ఆర్థిక ఇబ్బందులతో సరైన వైద్య చికిత్సలు చేయించుకోలేక అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని.. వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. రాంగోపాల్ పేట డివిజన్ కలాసిగూడకు చెందిన రవి కుమార్ గత కొంత కాలంగా అనేమియా వ్యాధితో బాధపడుతున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా సరైన చికిత్స పొందలేక ఆర్థిక సహాయం కోసం మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణ శ్రీనివాస్ గౌడ్ సహకారంతో మంత్రిని అతను ఆశ్రయించాడు. ఈ మేరకు మంత్రి చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 1.5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం మంజూరు కాగా, మంజూరు పత్రాన్ని రవి కుమార్ కుమారుడు అవినాష్‌కు మంత్రి మంగళవారం వెస్ట్ మారేడ్ పల్లిలోని తన నివాసంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణ శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలించిన కార్పొరేటర్

నవతెలంగాణ-కాప్రా

మల్లాపూర్ డివిజన్ పరిధి భవానినగర్ కాలనీలో జరుగుతున్న బాక్స్ డ్రైన్ అభివృద్ధి పనులను కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి సోమవారం పరిశీలిం చారు. ఈ సందర్భంగా బాక్స్ డ్రైన్‌లో మంచి నీటి పైపులైన్ అడ్డుగా జాయింట్ ఉన్న నేపథ్యంలో అట్టి సమస్యకు పరిష్కారంగా పైపు లైన్ జాయింట్ లేకుండా నూతన పైపు లైను వేయాలని జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులను, వాటర్ వర్క్స్ అధికారులను కార్పొరేటర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ శ్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, వాటర్ వర్క్స్ అధికారి సందీప్ స్థానిక కేఎల్ రెడ్డి నగర్ కాలనీ వాసులు మహేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మనిక్ రెడ్డి, బాబు భాయ్, తండా వాసుగౌడ్, పీఆర్ ప్రవీణ్, చిగుళ్ల మల్లేష్, భూమండ్ల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ మల్కాజిగిరి జోన్ ఇన్‌చార్జి తల్లి కన్నుమూత

- సంతాపం వ్యక్తం చేసిన సీజీఎం, ఎడిటర్

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్



నవతెలంగాణ పత్రిక మల్కాజిగిరి జోన్ ఏడీవీటీ ఇన్‌చార్జి ఎండీ జహంగీర్ తల్లి గాజుల మహబూబ్ (90) మంగళవారం సాయంత్రం 5 గంటల సమయంలో మౌలాలిలోని వారి స్వగృహంలో కన్ను మూశారు. వారి మృతదేహాన్ని నవతెలంగాణ హైదరాబాద్ రీజియన్ జనరల్ మేనేజర్ లింగారెడ్డి, హెచ్ఆర్ జీఎం నరేందర్ రెడ్డి, సిబ్బంది డి.వెంకటేష్, శ్యామ్, టి.రవి, విలేకరులు సందర్శించి నివాళ్లర్పించారు. గాజుల మహబూబ్ మృతికి నవతెలంగాణ సీజీఎం ప్రభాకర్, ఎడిటర్ సుధా భాస్కర్‌లు సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం మధ్యాహ్నం ఒంటిగంటకు ఆమె అంత్యక్రియలు జరుగుతాయని మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపారు.

మహిళల భద్రత, సైబర్ క్రైమ్, డ్రగ్స్ నివారణపై నగర పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు ఈ నేపథ్యంలో నగర పోలీస్ కమిషనరేట్‌లో సీపీ సి. వి ఆనంద్ మంగళవారం పోలీసు అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 2013 సంవత్సరానికి గాను యాక్షన్ ప్లాన్ పై చర్చించారు. అలాగే పలు సలహాలు సూచనలను అధికారులకు సీపీ అందించారు. నవతెలంగాణ-సిటీబ్యూరో





సీఐటీయూ జెండా ఆవిష్కరణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

బెంగళూరులో జనవరి 18 నుండి 22 వరకు జరగబోయే సీఐటీయూ 17వ అఖిల భారత మహాసభలు జయప్రదం కావాలని ఆకాంక్షిస్తూ భవన నిర్మాణ కార్మిక సంఘం మల్కాజిగిరి అడ్డా కమిటీ ఆధ్వర్యంలో మంగళ వారం సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. బీసీ డబ్ల్యూ అడ్డా మల్కాజ్‌గిరి యూనియన్ అధ్యక్షులు తాటప్ప గారి చంద్రశేఖర్ జెండా ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా కమిటీ నాయకులు , మల్కాజిగిరి మండల కమిటీ కార్య దర్శి బంగారు నర్సింగ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ, కార్మిక చట్టాలను నీరుగారు వస్తున్నారన్నారు. అడ్డా కార్మికులందరికీ కనీసం ఏడాదికి 150 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. అడ్డా కార్మికుల సమస్యలు పరిష్కరించడం కోసం కేంద్ర ,రాష్ట్ర కార్మిక శాఖలు చిత్తశుద్ధిగా పనిచేయడం లేదన్నారు . కార్మికులందరికీ లేబర్ మరియు ఇన్సూరెన్స్ కార్డులు జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ డబ్ల్యూ జిల్లా నాయకులు కుర్ర యాదగిరి, ఎర్రోళ్ల సుమిత్ర, మూడవ కష్ణమ్మ అడ్డా కార్మికులు నరసింహ, సాహెబన్న, వీరన్న చారి, భూమయ్య, గోపాల్ గౌడ్, సీతారాం నాయక్, బాలు నాయక్, పరుశురాం, సీతమ్మతో పాటు అడ్డా కార్మికులు పాల్గొన్నారు.



నవతెలంగాణ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన డీఈవో

నవతెలంగాణ-సిటీబ్యూరో

నవతెలంగాణ దినపత్రిక నూతన క్యాలెండర్, డైరీని హైదరాబాద్ విద్యాశాఖాధికారిణి(డీఈవో) ఆర్.రోహిణీ మంగళవారం టీఎస్జీవోస్ స్కూల్ ఎడ్యూకేషన్ డిపార్టుమెంట్ హైదరాబాద్ జిల్లా యూనిట్ అధ్యక్షుడు కె.ఆర్.రాజ్ కుమార్, సూపరిటెండెంట్ జి.రాజ్‌కుమార్, ముజాహిద్ అలీ, రాకేష్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ నవతెలంగాణ తెలుగు సమగ్ర దినపత్రిక దినదినాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

ఫిబ్రవరి 5న తెలంగాణ బాలసాహిత్య సమ్మేళనం

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

మొట్టమొదటి తెలంగాణ బాలసాహిత్య సమ్మేళనం నిర్వహించాలని తెలంగాణ సారస్వత పరిషత్తు నిర్ణయించింది. ఫిబ్రవరి 5వ తేదీన హైదరాబాద్ ఆబిడ్స్ తిలక్ రోడ్డులోని డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో జరిగే ఈ సమ్మేళనంలో బాలసాహిత్య స్వరూపం, తెలంగాణలో బాలసాహిత్య వికాసం, పాఠశాలలు-లలిత కళావేదికలు, బాలమేధావులతో ముఖాముఖి అని నాలుగు సదస్సులుంటాయి. బాలసాహిత్య రచయితలను, పాఠశాల స్థాయిలో బాలలను రచయితలుగా మలచే విషయంలో విశేష కృషినందిస్తున్న ఉపాధ్యాయులను ఒక వేదిక మీదకు తేవడం లక్ష్యమని పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డా.జె.చెన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు సదస్సుల్లో ప్రసంగించే వక్తలను పరిషత్తు ఎంపిక చేస్తుంది. బాల సాహిత్య రచయితలు పాఠశాలల్లో విద్యార్థులను ప్రోత్సహించి రచనలకు ప్రాచుర్యం కల్పిస్తున్న ఉపాధ్యాయులు ప్రతినిధులుగా పాల్గొనవచ్చు. ఈనెల 20వ తేదీలోగా 9603727234 వాట్సాప్ నెంబర్లో తమ పేరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. తమ కృషి గురించి క్లుప్తంగా పేర్కొంటే దాని ఆధారంగానే ఎంపిక జరుగుతుంది. ప్రతినిధులు తమ సొంత ఖర్చులతో రావాల్సి ఉంటుంది.

తాగునీటి సమస్యలు, పెండింగ్ పనులపై అధికారులతో సమావేశం

నవతెలంగాణ-బంజారాహిల్స్



ఖైరతాబాద్ డివిజన్‌లో నెలకొన్న సివరేజీ తాగునీటి సమస్యలు, పెండింగ్ పనులపై వాటర్ వర్క్స్ డివిజన్-4, జీఎం జాన్ షరీఫ్, డీజీఎం శ్రీనివాస్, మేనేజర్ స్వామి, ఎలక్ట్రికల్ డీజీఎం వెంకటకృష్ణ, మేనేజర్ చారితో మంగళవారం ఖైరతాబాద్ పి.విజయారెడ్డి సమావేశమయ్యారు. అత్యధికంగా డివిజన్ పరిధిలో సివరేజీ సమస్య ఉందన్నారు. దానికి ప్రధాన కారణం సెక్రటేరియేట్‌లో ఉన్న సివరేజీ మ్యాన్ హెూల్స్ శిథిలం కావడమే అన్నారు. వాటర్ వర్క్స్ బోర్డ్ ఆఫీస్ నుంచి ఎన్టీఆర్ గార్డెన్, వయా డాక్టర్ కార్స్ డబుల్ బెడ్ రూమ్ ఇంద్ర నగర్ కాలనీ ఖైరతాబాద్ రైల్వే స్టేషన్ వరకు ఉన్న ఏ - మెయిన్ రెగ్యులర్ గా డీ-సిల్టింగ్ చేయకపోవడం వల్ల ఓవర్ ఫ్లో ఆగుతూ ఉన్నదని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో దారుల్ షిఫా ఉన్నత పాఠశాల

- కూలిపోయిన ప్రహరీ, కుక్కల హల్చల్..
- దుర్గందంలో టాయిలెట్స్
- అమలుకు నోచుకోని మనబస్తీ-మనబడి
- ఆందోళనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

నవతెలంగాణ-ధూల్ పేట్

కూలిన గోడలు.. అస్తవ్యస్తమైన టాయిలెట్స్.. కుక్కల విహారం.. శిథిలమైన ప్రహరీ గోడలు.. బండలు. ఇదీ పాతబస్తీ దారుల్ షిఫా ఉర్దూ మీడియం ప్రభుత్వ ఉన్నత పాఠశాల దుస్థితి.

పాతబస్తీ దారుల్ షిఫా ఉర్దూ మీడియం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళనల మధ్య చదువులు కొనసాగించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. పాఠశాలకు భద్రతగా ఉండే ప్రహరీ గోడ కూలిపోవడంతో ఆ గోడ దూకి కుక్కలు పాఠశాలలో విహారం చేస్తున్నాయి. విద్యార్థులు తిరగాల్సిన చోట కుక్కలు విహారం చేస్తున్నాయి. ప్రహరీ గోడ అటు ఇటు దూకుతూ కుక్కలు తిరుగులడుతూ.. మొరుగుతూ దాడి చేస్తున్నాయని విద్యార్థులు, ఉపాధ్యాయులు భయపడుతున్నారు. ఎప్పుడు ఏమవుతుందో అని ఆందోళన చెందుతున్నారు. బహదుర్‌పురా డిప్యూటీ ఎడ్యుకేషనల్ అధికారి కార్యాలయం సమీపంలో ఇలా ఉండటం గమనార్హం. డిప్యూటీవో ఉన్న ఈ పాఠశాలలోనే ఇలా ఉంటే పాతబస్తీలోని ప్రభుత్వ పాఠశాల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని పలువురు ప్రత్యక్షంగానే మాట్లాడుతున్నారు.





దుర్గందంగా టాయిలెట్స్..

పాఠశాలలోని టాయిలెట్స్ దుర్గంధబరితంగా మారాయి. అపరిశుభ్రంతో ముక్కు పుటలు అదిరే దుర్వాసన వెదజల్లుతుంది. విద్యార్థినులు మూత్రశాలలకు వెళ్లాలంటేనే జంకాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. పాఠశాలలోనే ప్రాంగణపు బండలు శిథిలమయ్యాయి. విద్యార్థులు తిరుగులాడుచుండగా అటు ఇటు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాపోతున్నారు. ప్రహరీ సరిగా లేకపోవడంతో పరిసర ప్రాంతాల్లో ఇబ్బందులు తలెత్తుతుండటంతో విద్యార్థులు స్కూలుకు రావాలంటేనే జంకుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు.

మన బస్తీ-మన బడి ఏది..?

ప్రభుత్వం ఎంతో అట్టహాసంగా విద్యార్థుల కోసం మౌలిక వసతులు కల్పించేందుకు చేపట్టిన మన బస్తీ-మన బడి ఆచరణకు నోచుకోవడం లేదు. దారుల్ షిఫా ఉన్నత పాఠశాలలో మచ్చుకు కనబడటం లేదు. పాఠశాల ప్రహరీ భద్రత లేక అస్తవ్యస్తంగా.. టాయిలెట్స్‌తో నిత్యం ఇబ్బందులకు విద్యార్థులు, ఉపాధ్యాయులు గురవుతున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పాఠశాలల్లో మౌలిక వసతులు, భద్రత కల్పించేందుకు కృషి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రయివేటు యూనివర్సిటీల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి

- రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్
- విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కార్యాలయం ముట్టడి

నవతెలంగాణ-హిమాయత్ నగర్

ప్రయివేటు యూనివర్సిటీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ సంయుక్త ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దశల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రయివేటు కాలేజీలను యూనివర్సిటీలుగా మారుస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ఎత్తి వేశారన్నారు. ఇది ఒక పథకం ప్రకారం పేద కులాలకు ఉన్నత, సాంకేతిక విద్య అందకుండా చేసే కుట్రగా అభివర్ణించారు. ప్రయివేటు విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని అసెంబ్లీ, పార్లమెంట్‌లో చట్టం చేసిందనీ, అప్పటి నుంచే ప్రయివేటు ఇంజినీరింగ్, పీజీ, మెడికల్ కాలేజీల్లో రిజర్వేషన్లు అమలు



చేస్తున్నారని గుర్తు చేశారు. ప్రయివేటు యూనివర్సిటీల్లో రిజర్వేషన్లు అమలు చేయకపోవడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఈ వర్గాలకు రిజర్వేషన్లు పెట్టకపోవడంతో తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారనీ, వారిని చదువుకోకుండా చేసే కుట్రలను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. రూ.4,500 నుంచి రూ.20 వేలకు స్కాలర్ షిప్‌లను పెంచాలనీ, పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్ షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ ముట్టడి కార్యక్రమంలో తెలంగాణ నిరుద్యోగ జేఏసీ నేతలు జిల్లపల్లి అంజి, పగిళ్ల సతీష్, అనంతయ్య, నర్సింగ్ గోజు, నిఖిల్, మణికంఠ, శ్రీనివాస్, ఇతర నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులను ఖండిస్తూ ఓయూలో నిరసన



నవతెలంగాణ-ఓయూ

ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యమాలు చేస్తుంటే, ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేస్తోందని అభ్యర్థులు ఆరోపించారు. ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ఎదుట మంగళవారం అక్రమ అరెస్టులను నిరసిస్తూ నల్ల రిబ్బన్లతో అభ్యర్థులు నిరసన చేపట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన మొండి వైఖరి విడనాడి పోలీసు అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఐ, కానిస్టేబుల్ ప్రధాన డిమాండ్లు హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలనీ, రన్నింగ్‌లో అర్హత సాధించిన వారికి మెయిన్స్‌కి అవకాశం కల్పించాలనీ, తప్పుడు ప్రశ్నలకు మార్కులు కలపాలని అభ్యర్థులు డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం వెంటనే చర్చలకు ఆహ్వానించాలని కోరారు. లేదంటే తమ డిమాండ్ల సాధన కోసం పోరాటాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రెహమాన్, టీజేవైఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుఅరుణ్‌కుమార్, సలీంపాషా, ఓయూ ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి నెల్లి సత్య, ఎస్ఐ కానిస్టేబుల్ అభ్యర్థుల పోరాట నాయకుడు ఉప్పల ఉదయ్ కుమార్, ఏఐఎస్ఎఫ్ ఓయూ ఉపాధ్యక్షులు లెనిన్, అభ్యర్థులు రఫీ, అనిల్, సురేష్, వెంకటేష్, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

జనవరి రేషన్ వెంటనే విడుదల చేయాలి

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రతినెలా 5వ తేదీన పంపిణీ చేయాల్సిన రేషన్ సరుకులు ఇప్పటి వరకు డీలర్లకు చేరలేదనీ, దాంతో ఈనెల రేషన్ పంపిణీ ప్రారంభం కాలేదనీ, ఈ సమస్యపై ప్రభుత్వం చర్యలు తీసుకుని వెంటనే రేషన్ కోటాను విడుదల చేయాలని సీపీఐ(ఎం) నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ సమస్యపై అధికారులను సంప్రదించగా 'ఈపాస్'కు సంబంధించిన టెక్నికల్ సమస్యలు ఉన్నాయనీ, వాటిని సరిచేసిన అనంతరం మాత్రమే సరఫరా జరుగుతుందనీ, సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపినట్టు చెప్పారు. సాంకేతిక సమస్య ఎన్నిరోజుల్లో పరిష్కారం అవుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొందనీ, ఈ తరుణంలో మ్యానువల్ విధానంలో రేషన్ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సంక్రాంతి పండగ సందర్భంగా కనీసం రేషన్ సరుకులు కూడా దొరకని పరిస్థితికి ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యమే నిదర్శనమన్నారు. ఇప్పటికైనా పౌరసరఫరాల అధికారులు వెంటనే డీలర్లకు రేషన్ సరుకులను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో పండగ సందర్భాల్లో చక్కెర, వంటనూనె, కందిపప్పు లాంటి సరుకులు అదనంగా ఇచ్చే సాంప్రదాయాన్ని తిరిగి ప్రారంభించాలనీ, ఈ సంక్రాంతి పండుగకు అదనపు రేషన్ చక్కెర, వంటనూనె, గోధుమలు, బియ్యం, కందిపప్పు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

నీరాకు వేదామృతం పేరు పెడితే కించపరిచినట్టు ఎలా అవుతుంది



- వేదామృతం అనే పదం వాడకూడదని ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం
- తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ

నవతెలంగాణ-ముషీరాబాద్

స్వచ్ఛమైన ప్రకృతి పానీయం నీరాకు వేదామృతం పేరు పెడితే కించపరిచినట్టు ఎలా అవుతుందని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బలగాని బాలరాజు గౌడ్, కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్, వర్కింగ్ చైర్మన్ ఎలికట్టె విజయ్ కుమార్ ప్రశ్నించారు. మంగళవారం చిక్కడపల్లిలోని సమన్వయ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బ్రాహ్మణ సంఘాలు ఇలాంటి వ్యతిరేకమైన ఆలోచనలను మానుకోవాలని హితవు తెలిపారు. ప్రకృతి సిద్ధంగా తాటి, ఈత చెట్ల నుంచి సూర్యరశ్మిరాకముందే తీసే స్వచ్ఛమైన పానీయం అని నీరా అని స్పష్టం చేశారు. కొన్ని బ్రాహ్మణ సంఘాలు దీన్ని అనవసరంగా రాద్ధాంతం చేయడం సరికాదన్నారు. వేదామృతం అనే పదం వాడకూడదని చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. అమృతం అంటే సురా అని, సురా అంటే నీరా అని, నీరా అంటే ఖండిస్తున్నాం అన్నారు. అమృతం అంటే సురా అని, సురా అంటే నీరా అని, నీరా అంటే కల్లు అని అవగహణ లేని వారు తప్పుడు మాటలతో రాష్ట్రంలోని లక్షలాది మంది గీతా వృత్తిదారులను అవమానించడమే అవుతుందన్నారు. ఆనాడే సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ బ్రాహ్మణులు లేకుండా ఎల్లమ్మ గుడులు, కాటమయ్య, గ్రామ దేవతల గుడులు నిర్మించి బహుజనుల రాజ్యస్థాపన చేశారనీ, నేడు మంత్రి శ్రీనివాస్ గౌడ్ పాపన్నగౌడ్ స్ఫూర్తితో నెక్లెస్ రోడ్డులో నీరాకు వేదామృతం అని పేరుపెట్టడాన్ని హర్షిస్తున్నాం అన్నారు. వేదామృతం అనే పదాన్ని వ్యతిరేకిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సమన్వయ కమిటీ చైర్మన్ గడమీది విజయ్ కుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

18-22 వరకు సీఐటీయూ ఆలిండియా మహాసభలు

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

బెంగళూరు సిటీలో ఈనెల 18-22వ తేదీ వరకు జరుగుతున్న సీఐటీయూ ఆలిండియా మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం, రహమత్‌నగర్ డివిజన్‌లోని ఎస్పీఆర్ హిల్స్‌లో మంగళవారం సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జోన్ కన్వీనర్ స్వామి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 5వ తేదీన సీఐటీయూ, రైతు సంఘం, రైతు వ్యవసాయ కూలీల సంఘం, సీఐటీయూ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ



కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ జూబ్లీహిల్స్ నుంచి పెద్ద ఎత్తున కార్మికులు ఢిల్లీ బయలుదేరడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.బాలయ్య, టి. భాగ్యరాజ్, బి.లక్ష్మణ్, ఆర్ జైపాల్, సాయిలు, మొగులయ్య, బుజ్జమ్మ, శ్రీనివాస్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల భర్తీకి వెంటనే అనుమతివ్వాలని వినతి

నవతెలంగాణ-ఓయూ

విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల భర్తీకి వెంటనే అనుమతి ఇవ్వాలని తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ యూనివర్శిటీ టీచర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో మంగళవారం గవర్నర్, రాష్ట్ర విశ్వవిద్యాలయాల ఛాన్సలర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్‌కు విజ్ఞప్తి చేసింది. పదేండ్లుగా అధ్యాపకుల నియామకాలు లేకపోవటంతో రోజు రోజుకూ యూనివర్శిటీల్లో అధ్యాపకుల సంఖ్య తగ్గుతూ వస్తోందని గవర్నర్‌కు గుర్తు చేశారు. టీఎస్ ఫుటా చైర్మన్ ప్రొ.రాగి మల్లికార్జున రెడ్డి, ఉస్మానియా యూనివర్శిటీ టీచర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ప్రొ.జి.మల్లేశం నేతృత్వంలోని బృందం మంగళవారం రాజ్ భవన్‌లో గవర్నర్ ను కలిసి విశ్వవిద్యాలయాల్లో నెలకొన్న సమస్యలపై చర్చించారు. సీనియర్ ప్రొఫెసర్లు పదవీ విరమణ పొందుతుండటంతో విశ్వవిద్యాలయాల్లోని విభాగాలన్నీ ఖాళీ అవుతున్నాయనీ, వారి స్థానంలో పార్ట్ టైం, కాంట్రాక్ట్ అధ్యాపకులతో నెట్టుకొస్తున్నారని గవర్నర్ కు చెప్పారు. రెగ్యులర్ అధ్యాపకులు లేకపోవటంతో న్యాక్ గ్రేడింగ్ నష్టపోతున్నామనీ, ఫలితంగా యూజీసీ, రూసా నిధులు రాకుండా పోతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 2017లో విశ్వవిద్యాలయాల్లో 1,061 అధ్యాపక పోస్టులను మంజూరు చేసిందనీ, అయితే రకరకాల న్యాయ వివాదాల నేపథ్యంలో విశ్వవిద్యాలయాలు వాటిని భర్తీ చేయలేక పోయాయన్నారు. ఇలాంటి సమస్యలు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ యూనివర్శిటీస్ కామన్ రిక్రూట్ మెంట్ బోర్డును తీసుకొచ్చిందని తెలిపారు. అయితే ఇది గవర్నర్ దగ్గర పెండింగ్‌లో ఉందనీ, దీన్ని అనుమతిస్తే కామన్ రిక్రూట్ మెంట్ బోర్డు ద్వారా యూనివర్శిటీల్లో అధ్యాపకు ఖాళీలను నింపడానికి మార్గం సులువవుతుందని ఫుటా టీఎస్ బృందం గవర్నర్‌కు తమ అభిప్రాయాన్ని తెలియజేసింది. గవర్నర్‌ను కలిసిన వారిలో ఫుటా టీఎస్ సెక్రెటరీ జనరల్ ప్రొ.విద్యాసాగర్, ఉస్మానియా టీచర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ప్రొ.జి.మల్లేశం, ఔటా కోశాధికారి డాక్టర్ చలమల్ల వెంకటేశ్వర్లు, టీఎస్ ఫుటా సభ్యులు డాక్టర్ వనజ ఉదయ్ ఉన్నారు.

ప్రభుత్వ పథకాలు లబ్దిదారులకు చేరేలా ఏర్పాట్లు

- డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్

నవతెలంగాణ-ఓయూ

ప్రభుత్వ పథకాలు లబ్దిదారులకు చేరేలా ఏర్పాట్లు జరుపుతున్నామని డిప్యూటీ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. తార్నాక డివిజన్ పరిధిలో ఇంటింటికీ తిరుగుతూ లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం సహాయ నిధి చెక్కులను మంగళవారం డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, బీఆర్ఎస్ యువ నాయకులు కిరణ్ కుమార్ గౌడ్, కార్మిక నేత, బీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డి, అధికారులు, నేతలతో కలిసి అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద ప్రజలకు ఉపకరించేలా వివిధ కార్యక్రమాలను చేపడుతున్నట్టు తెలిపారు. మానికేశ్వరీనగర్, ఓయూ క్యాంపు, తార్నాక, చింతల్, గోకులనగర్, చంద్రబాబు నగర్, లక్ష్మీనగర్, లాలాపేట, ఆర్య నగర్ ప్రాంతాల్లో పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా పాదయాత్ర నిర్వహించి చెక్కులను పంపిణీ చేయడంతోపాటు స్థానికుల సమస్యలను కుడా అడిగి తెలుసుకుని పరిష్కరించాలని అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. మానికేశ్వరీనగర్‌లో హాస్పిటల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలనీ, వివిధ ప్రాంతాల్లో సివరేజీ పైప్ లైన్లు ఏర్పాటు చేయాలనీ, చింతల్ ప్రాంతంలో నాలా పై స్లాబ్ నిర్మించాలని అధికారులను ఈ సందర్భంగా ఆదేశించారు. రూ.32 లక్షల కు పైగా విలువ చేసే 29 కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, 6 సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.



సమాజానికి మంగలి కులస్తుల సేవలు ఎనలేనివి



- బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

ఆధునిక సమాజ నిర్మాణంలో ప్రగతి కారకులుగా మంగలి కులస్తుల సేవలు ఎనలేనివని బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ అన్నారు. నాగరికత రూపకల్పనలో మానవ సమాజానికి వీరు సేవలు అనితర సాధ్యమైనవి అన్నారు. మంగళవారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో తెలంగాణ నాయీ బ్రాహ్మణ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్-2023 ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని రాష్ట్ర అధ్యక్షులు దేవరకొండ నాగరాజుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎక్కడాలేని విధంగా సెలూన్స్‌కు ప్రభుత్వం 250 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను తెలంగాణలో అందిస్తున్నట్టు తెలిపారు. సంఘం నాయకులు తన దృష్టికి తీసుకొచ్చిన అన్ని అంశాలను సీఎం కేసీఆర్‌కు నివేదిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దేవరకొండ నాగరాజు, ప్రధాన కార్యదర్శి కొరటాల యాదగిరి, రిజిస్టర్ కో-ఆపరేటివ్ సొసైటీ రిటైర్డ్ ఎస్.రామనంద స్వామి, కంటెస్టు ఎమ్మెల్సీ మల్లగల గురప్ప, క్రిమినల్ కోర్టు సీనియర్ అడ్వకేట్ భూపాల్, రాష్ట్ర కార్యదర్శి ఎం. రామచందర్, రాజ్, హరినాథ్, శ్రీనివాస్, ప్రముఖ కవి డాక్టర్ రాపోలు సుదర్శన్, శ్రీధర్ మురాహరి, యాదాద్రి కళ్యాణకట్ట అధ్యక్షులు జానకిరామ్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



త్వరలో కమ్యూనిటీ హాల్ పనులు పూర్తి

నవతెలంగాణ-అడిక్ మెట్

కమ్యూనిటీ హాల్‌లో పనులను త్వరగా పూర్తి చేయిస్తాం అని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ తెలిపారు. మంగళవారం అశోక్‌నగర్ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులతో కార్పొరేటర్ అశోక్ నగర్ లైబ్రరీ హాల్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు సమస్యలతో కూడిన వినతిపత్రం కార్పొరేటర్‌కు సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కమిటీ హాల్ నిర్మాణానికి కేంద్ర బడ్జెట్‌తో మిగిలి ఉన్న పనులను పూర్తి చేస్తామని తెలిపారు. త్వరలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను ప్రారంభిస్తామని అసోసియేషన్ సభ్యులకు హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో అశోక్ నగర కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షుడు బి.రామ్మూర్తి, కార్యదర్శి బి.సూర్యప్రకాష్, కోశాధికారి జె.రమేశ్, సభ్యులు ఎం.నాగలక్ష్మి, ఎం వి వి. సూర్యనారాయణ, వై.శ్రీ రామ్ పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల సాధనకు పోరాటం



- సీఐటీయూ చాంద్రాయణగుట్ట జోన్ కార్యదర్శి ఎస్.కిషన్

నవతెలంగాణ-ధూల్ పేట్

కార్మికుల హక్కులను కాలరాస్తే సహించేది లేదనీ, హక్కుల సాధనకు పోరాటమేనని సీఐటీయూ చాంద్రాయణగుట్ట జోన్ కార్యదర్శి ఎస్.కిషన్ అన్నారు. సీఐటీయూ చాంద్రాయణగుట్ట జోన్ కమిటీ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చి 8 ఏండ్లు గడుస్తున్నా దేశంలో ఉన్న పేద, కార్మిక ప్రజల గురించి పట్టించుకోని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికే అనేక కార్మిక హక్కులను కలరాస్తున్నారన్నారు. కరోన కాలంలో భారత ఆర్థిక వ్యవస్థ మందగించిందనీ, కరోనా నుంచి దేశం కోలుకున్న తర్వాత కూడా బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థ నిలబెట్టిన పరిస్థితి లేదన్నారు. మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు పెట్టుబడిదారులకు, కార్పొరేట్ కంపెనీలకు రూ.11లక్షల కోట్లు రాయితీలుగా ఇచ్చిందన్నారు. ఇది చాలదన్నట్టు కార్పొరేట్లకు 10శాతం పన్ను తగ్గించి దేశానికి రూ.లక్షా 84వేల కోట్ల నష్టం కలిగించారని తెలిపారు. ఇలా ప్రతీది కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలు 6 4కంపెనీలు మూసివేశారన్నారు. దీనికి తోడు బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ, ప్రజలపై ధరల భారం మోపుతుండటంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నాం ని తెలిపారు. ఈ ప్రభుత్వం గద్దె దిగే వరకు సీఐటీయూ పోరాటాలు చేస్తుందనీ, ఇందుకు ఈ మహా సభలో దిశా నిర్దేశం చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

డా.లక్ష్మి, డా.నిరంజన్ రెడ్డి మరణం సైకాలజీ రంగానికి తీరని లోటు

నవతెలంగాణ-హిమాయత్ నగర్

తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ లక్ష్మి నిప్పాని, ప్రముఖ క్లినికల్ సైకాలజిస్ట్ డాక్టర్ కె.నిరంజన్ రెడ్డి మరణం సైకాలజీ, క్లినికల్ రంగానికి తీరని లోటని ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మోతుకూరి రాంచందర్ అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పిస్తూ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్మి నిప్పాని సంఘంలో చేరిన నాటి నుంచి క్రియాశీలకంగా పని చేశారని కొనియాడారు. సైకాలజీ రంగానికి తన వంతు కృషి చేస్తూ ఒక మంచి మానవతా వాదిగా ఎల్లప్పుడూ చిరు నవ్వును చిందిస్తూ తన మాటలతో సమవేశాల్లో సైకాలజిస్టులలో ఉత్సాహాన్ని నింపేవారని గుర్తు చేశారు. సంఘం కార్యక్రమాల్లో వ్యాఖ్యాతగా వ్యవహరించి, అందరి హృదయాలను దోచుకున్నారన్నారు. నిజంగా గొప్ప మనస్తత్వవేత్త, వ్యాఖ్యాతను తమ అసోసియేషన్ కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె మరణానికి సంతాపం తెలియజేస్తూ, వారి కుటుంబ సభ్యులకు



సానుభూతి తెలిపారు. అలాగే రెండు తెలుగు రాష్ట్రాల్లో సైకాలజీ రంగంలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న క్లినికల్ సైకాలజిస్ట్ డాక్టర్ కె.నిరంజన్ రెడ్డి అని కొనియాడారు. అతను 12 ఏండ్లుగా తమతో పాటు అనేక మంది మనస్తత్వవేత్తలకు శిక్షణ ఇచ్చారని గుర్తు చేశారు. సైకాలజీ రంగం అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. సైకాలజీ విభాగంలో పితామహుడిగా గుర్తింపు పొందిన ప్రముఖ క్లినికల్ సైకాలజిస్ట్ డాక్టర్ నిరంజన్ రెడ్డి మరణం సైకాలజీ రంగానికి తీరని లోటనీ, ఆయన ఆకస్మిక మృతి పట్ల సంతాపం తెలియజేస్తూ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వెంపటి రాజు, ఉపాధ్యక్షులు డాక్టర్ షర్మిల కున్ను, డాక్టర్ మనోహర్, ఎ.సుధాకర్, శ్రీపూజ, నాయకులు కృష్ణ సాహితి, డాక్టర్ శివరామ ప్రసాద్ పాల్గొని, సంతాపం వ్యక్తం చేశాయి.

సోమాజిగూడ డివిజన్ పరిధిలోని పంజాగుట్ట పోచమ్మ బస్తీలో కొద్దిరోజులుగా పెండింగ్‌లో ఉన్న నూతన డ్రయినేజీ పైప్ లైన్ పనులను వాటర్ వర్క్స్ మేనేజర్ మమత, వినోద్‌తో కలిసి స్థానిక కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్ పరిశీలించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు హైమద్, సర్గు రమేష్,వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కమిటీ అధ్యక్షులు డివిజయకుమార్, నాయకులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-బంజారా హిల్స్

రవీందర్ నాయక్ నగర్ కాలనీ కమిటీ హాల్‌లో ఎస్ఐ, కానిస్టేబుల్ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-ధూల్ పేట్

రవీందర్ నాయక్ నగర్ కాలనీ కమిటీ హాల్‌లో ఎస్ఐ, కానిస్టేబుల్ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని రవీంద్ర నాయక్ నగర్ కాలనీ ప్రెసిడెంట్ ఏ.కృష్ణ నాయక్ కోరారు. రవీందర్ నాయక్ నగర్ కాలనీ బంజారా వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో సౌత్ జోన్ డీసీపీ సాయి చైతన్యకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రవీందర్ నాయక్ నగర్ కాలనీలో గిరిజనులు ఎంపికైన అభ్యర్థులు వారు ఆర్థిక పరిస్థితి వల్ల ప్రవేట్ కోచింగ్ వెళ్లలేని పరిస్థితిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వారి కోసం పోలీసు వారి సహకారంతో స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని కోరారు. అవకాశం ఉంటే తమ వంతు గిరిజన ప్రజలకు సహాయం చేస్తానని సానుకూలంగా డీసీపీ స్పందించినట్టు తెలిపారు. దీంతో డీసీపీకి రవీంద్ర నాయక్ నగర్ కాలనీ బంజారా వెల్ఫేర్ కమిటీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రవీంద్ర నాయక్ నగర్ కాలనీ కమిటీ సభ్యులు కిషన్, రవి నాయక్, రాజేష్, బలరాం, తదితరులు పాల్గొన్నారు.



టెక్నాలజీ కళాశాలకు రూ.15 లక్షలు విడుదల

నవతెలంగాణ-ఓయూ

ఓయూ టెక్నాలజీ కళాశాలకు కేంద్ర మినిస్ట్రీ ఆఫ్ ఇండస్ట్రీ వారు ఇటీవలే రూ.15 లక్షలు విడుదల చేసినట్టు ప్రిన్సిపాల్ ప్రొ. చింత సాయిలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెక్నాలజీ కళాశాలలో 2022లో నూతనంగా ఏర్పాటు చేసిన ఇంక్యుబేషన్ సెంటర్ ద్వారా పంపిన ప్రతిపాదనల్లో బాగంగా మురుగు నీటిని శుద్ధి చేస్తూ దాని నుండి విద్యుత్ తయారీ చేసే యంత్రాన్ని కనుకొంటున్నారు. సదరు యంత్రాన్ని మరింతగా వృద్ధి చేయడానికి, ఇంకా మరిన్ని పరిశోధనలు చేయడానికి ఈ నిధులు వినియోగించనున్నారు. వీటితోపాటు 16 రకాల వివిధ అంశాలపై కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ ఇండస్ట్రీస్ కు ప్రతిపాదనలు పంపినట్టు ప్రిన్సిపాల్ చెప్పారు.

యువతి అదృశ్యం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

యువతి అదృశ్యమైన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం జగద్గిరిగుట్ట వెంకటేశ్వరనగర్‌కు చెందిన ఇల్లిందుల సుధీర్ కుటుంబ సభ్యులు గత కొన్ని నెలలుగా అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఇదిలా ఉండగా వరుసకు పిన్నికూతురైన ఇల్లిందుల రేష్మ (23) వీరి వద్ద గత ఐదు నెలలుగా ఉంటు ప్రైవేటు జాబ్ చేస్తుంది. ఈనెల 8న ఉదయం తన స్నేహితురాలు దగ్గరికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిందని కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పటి నుంచి రాక పోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో బంధువులు, స్నేహితుల వద్ద ఎంత వెతికినా ఫలితం పోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బెల్ట్ షాపులు తొలగించాలని వినతి



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలో యదేచ్చగా, అక్రమంగా కొనసాగుతున్న బెల్టు షాపులను తొలగించాలని కోరుతూ మంగళవారం ఎంపీపీ వీర్లపల్లి రజిత రాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ అమ్మగారి శైలజ విజయానందారెడ్డి, రాష్ట్ర సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడు, శ్రీరంగవరం సర్పంచ్ విజయానందరెడ్డిలు జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జాయింట్ కలెక్టర్ నర్సింహారెడ్డిలకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో ఎంపీటీసీ కటిక ప్రకాష్ ఉన్నారు.

అంధత్వ రహిత తెలంగాణే లక్ష్యం

- **ఈనెల 18 నుంచి జూన్ 30 వరకు కంటి వెలుగు కార్యక్రమం**
- **విలేకరుల సమావేశంలో మంత్రి తలసాని**



నవతెలంగాణ-సిటీబ్యూరో

అంధత్వ రహిత తెలంగాణే లక్ష్యంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఈనెల 18 నుండి జూన్ 30వ తేదీ వరకు నిర్వహించే కంటి వెలుగు-2 కార్యక్రమం నిర్వహణ, ఏర్పాట్లపై మంగళవారం జీహెచ్ఎంసీ కార్యాలయంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, హోంమంత్రి మహమూద్‌అలీ, మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో కలిసి హైదరాబాద్ జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఏ కార్యక్రమం తలపెట్టినా ప్రజల పక్షాన ఆలోచించి నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. కంటి వెలుగు కార్యక్రమం నిర్వహణ కోసం రూ.250 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తుందని తెలిపారు. కార్యక్రమం నిర్వహణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతలో 827 బృందాలను ఏర్పాటు చేయగా, ఇప్పుడు 1500 బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని, వారికి ప్రత్యేకంగా వాహనాలను కూడా సిద్ధం చేసినట్టు వివరించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని 91 వార్డులలో 115 శిబిరాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలో శిబిరాల ఏర్పాటు కోసం కమిటీ హాల్స్, మల్టీపర్పస్ ఫంక్షన్ హాళ్లు, ఇతర ప్రభుత్వ భవనాలు, మున్సిపల్ గ్రౌండ్‌లను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. శిబిరాల వద్ద సరైన ఫర్నిచర్, విద్యుత్ సౌకర్యం, టాయిలెట్స్ వంటి సౌకర్యాలు ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. వృద్ధులను కూడా దృష్టిలో ఉంచుకుని తగిన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. 100 పని దినాలపాటు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ శిబిరాలు పనిచేస్తాయన్నారు. ప్రతీ టీంలో ఒక డాక్టర్, ఒక కంటి వైద్యుడు, ఒక ఫార్మసిస్ట్, ఆశా వర్కర్‌లతో కలిపి 10 మంది వరకు ఉంటారని తెలిపారు. ఇది ఎంతో గొప్ప కార్యక్రమం అని, గిన్నీస్ బుక్‌లో నమోదయ్యే విధంగా విజయవంతం చేసేందుకు రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. మొదటి విడతలో 1.54 కోట్ల మందికి కంటి పరీక్షలు నిర్వహించి 50 లక్షల మందికి కండ్లద్దాలు అందజేసినట్టు పేర్కొన్నారు. ఈసారి కోటిన్నర మందికి పరీక్షలు చేసి 55లక్షల మందికి అద్దాలు ఇవ్వాలని నిర్ణయించిట్టు తెలిపారు. కంటి ఆపరేషన్‌లు అవసరమైన వారికి సరోజినీదేవి, ఎల్వీప్రసాద్ హాస్పిటల్స్‌కు మాత్రమే కాకుండా లయన్స్ క్లబ్, రెడ్‌క్రాస్ ఇతర స్వచ్ఛంద సంస్థలకు చెందిన హాస్పిటల్స్‌లో సేవలను వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతోనే విజయవంతంగా నిర్వహించబడతాయని అన్నారు. మీమీ పరిధిలో ఉన్న కార్పొరేటర్‌లు, కాలనీలు, బస్తీల కమిటీలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని జీహెచ్ఎంసీ అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రయివేట్ హాస్పిటల్స్‌లో కంటి పరీక్ష కోసం 300 నుంచి 500 రూపాయల వరకు ఫీజుగా వసూలు చేస్తారని, ఆపరేషన్ కోసం వేల రూపాయలు ఖర్చవుతుందన్నారు. కంటి వెలుగు కార్యక్రమం ఎంతో గొప్ప కార్యక్రమం అని, పేద, మధ్యతరగతి ప్రజలకు ఒక వరం లాంటిదని సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ప్రశంసించారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ మోతేశ్రీలత, ఎమ్మెల్సీలు ప్రభాకర్‌రావు, సురభివాణిదేవి, స్టీఫెన్‌సన్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కాలేరువెంకటేష్, ముఠాగోపాల్, సాయన్న, రాజాసింగ్, కౌసర్ మొహినోద్దిన్, కార్పొరేషన్ చైర్మెన్‌లు రావుల శ్రీధర్‌రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, గజ్జెలనగేష్, నగర గ్రంథాలయ సంస్థ చైర్మెన్ ప్రసన్న, కలెక్టర్ అమోయ్ కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్, అడిషనల్ కమిషనర్ సంతోష్, హెల్త్ అడిషనల్ డైరెక్టర్ పద్మజ, హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకట్, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌లు, డిప్యూటీ కమిషనర్‌లు, హెల్త్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను ఎత్తివేయాలి

సీఐటీయూ జోన్ కార్యదర్శి టి.మహేందర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

సీఐటీయూ జాతీయ మహాసభలు 18, 19, 20, 21 జనవరి 2023 బెంగళూరులో జరుగుతున్న నేపథ్యంలో మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ దేశవ్యాప్తంగా సీఐటీయూ జెండా అవిష్కరణలు విస్తృతంగా చేయాలని జాతీయ కమిటీ పిలుపు మేరకు చిలకలగూడ గాంధీ విగ్రహం దగ్గర సికింద్రాబాద్ కార్యదర్శి టి.మహేందర్ సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి టి.మహేందర్ మాట్లాడుతూ బెంగుళూరులో జాతీయ మహాసభలు జరుగుతున్నాయని, ఈ మహాసభల్లో కార్మిక చట్టాల ఉల్లంఘన, కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్నటువంటి లేబర్ కోడ్‌లు, కనీస వేతన చట్టం అమలు చేయాలని, అనేక అంశాలపైన చర్చించి తీర్మానాలు చేయనున్నట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ కార్మికులని అనేక రకాలుగా ఇబ్బందులు గురిచేస్తుందని అన్నారు. బీజేపీ ప్రభుత్వం 44 చట్టాలను గురించి నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకొచ్చి కార్మికులకు పనిగంటలుగా పెంచే విధంగా ప్రయత్నాలు చేస్తుందన్నారు. కార్మిక హక్కులు సాధించుకోవడం కోసం ఐక్యంగా బీజేపీ ప్రభుత్వం ఎత్తుగడలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ జోన్ నాయకులు మధు, ఎల్లస్వామి నర్సింగరావు, సురేష్, అజిభాయి, సోమయ్య, ఆంజనేయులు, వెంకటేష్, నరేందర్, పాషా పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షల్లో చాయిస్ ప్రశ్నలు పెంచాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు చంద్రకాంత్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

రాబోయే పదో తరగతి పరీక్షల్లో ఛాయిస్ ప్రశ్నలు పెంచాలని, అదేవిధంగా ఒకరోజు తప్పించి ఒక రోజు పరీక్షలు నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.చంద్రకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో విద్యా శాఖకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పదో తరగతి పరీక్షల్లో మొదటిసారిగా పబ్లిక్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులను మానసిక ఒత్తిడికి దూరం చేసే విధంగా టెన్త్ పేపర్లో 30 శాతం ఛాయిస్ ప్రశ్నలు పెంచాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రానున్న పదవ తరగతి పరీక్షలలో పేపర్లను తగ్గించి 6 పేపర్లు చేయడం ఆహ్వానించదగ్గ విషయమని అన్నారు. ఆబ్జెక్టివ్ ప్రశ్నలు రెండు మార్కులు, మూడు మార్కులు ప్రశ్నలకు ఎలాంటి ఛాయిస్ ఇవ్వలేదని వ్యాఖ్యానించారు. వ్యాసరూప ప్రశ్నలు ఇచ్చిన సమయంలో అన్నీ రాయాలని పెట్టారని, ఈ పద్ధతి వల్ల సిలబస్ మొత్తం ఒకే పేపర్లో రాయడం సమయం సరిపోదని, ఇలా చేయడంవల్ల విద్యార్థులు పరీక్ష అంటే కఠినంగా ఉంటుందని ఒత్తిడికి గురయ్యే పరిస్థితి కూడా ఉందన్నారు. పదో తరగతి పరీక్షలో ప్రతీరోజు పరీక్షలు ఉన్నాయని, ప్రతీరోజు ఉండడం వల్ల విద్యార్థులు ఒత్తిడికి లోనవుతారని, ఈ షెడ్యూల్లో మార్చి ఒకరోజు తప్పించి ఒక రోజు పరీక్షలు నిర్వహించే విధంగా అధికారులు ఆలోచించి కొత్త షెడ్యూల్‌ను విడుదల చేయాలని, అదేవిధంగా టెన్త్ క్లాస్ పరీక్షల దృష్ట్యా ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని, వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రి, కలెక్టర్‌కు వినతి



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం మేడ్చల్ మున్సిపల్ పాలకవర్గ సభ్యులు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి, జిల్లా కలెక్టర్ హరీష్‌లను మర్యాదపూర్వకంగా కలిసి మున్సిపల్‌లోని పలు సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. కలిసిన వారిలో మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ షఫీఉల్లాఖాన్, వైస్ చైర్మెన్ చీర్ల రమేష్ కురుమ, కౌన్సిలర్లు కౌడే మహేష్ కురుమ, వీరమల్ల మానస శ్రావణ్ కుమార్ గుప్తా, జాకట దేవరాజ్, తుడుం గణేష్, సముద్రం సాయి కుమార్, బత్తుల శివకుమార్ యాదవ్, పానుగంటి సుహాసిని, బత్తుల ప్రియాంక మధుకర్ యాదవ్, జంగా హరికృష్ణ యాదవ్, నడికొప్పు ఉమా నాగరాజు ముదిరాజ్, సాటే మాధవి నరేందర్ వంజరి, ఆప్షన్ సభ్యులు ఆర్.గీత, మహమ్మద్ మహబూబ్ అలీ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అత్వెల్లి సందీప్‌గౌడ్, నారెడ్డి రవీందర్ రెడ్డి, బత్తుల మధుకర్ యాదవ్, సాటే నరేందర్ వంజరి, నడికొప్పు నాగరాజు ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

'చిరువ్యాపారుల సమస్యల పరిష్కారానికి కృషి'

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



చిరు వ్యాపారుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పేర్కొన్నారు. ఈ మేరకు నేషనల్ అసోసియేషన్ ఆఫ్ స్ట్రీట్ వండర్స్ ఆఫ్ ఇండియా సభ్యులు మంగళవారం ఎమ్మెల్యేని ఆయన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చిరువ్యాపారుల జీవనోపాధి మరియు క్రమబద్ధీకరణ చట్టం-2014 ప్రకారం వెండింగ్ జోన్ మరియు వెండింగ్ సర్టిఫికెట్లు వండర్స్‌కు అందించేలా కృషి చేయాలని ఎమ్మెల్యేని కోరారు. ఐడిపిఎల్ జంక్షన్ అభివృద్ధిలో భాగంగా 90 నుంచి 100 మంది వెండర్స్‌ని తొలగించడంతో జీవన ఉపాధి కోల్పోయామని జంక్షన్‌లో బస్ స్టాప్ వెనుక మార్కింగ్ వేసి స్ట్రీట్ ఫుడ్ వెండర్స్ మరియు స్ట్రీట్ వెండర్స్‌ను వెండింగ్ జోన్ చేసి జీహెచ్ఎంసి ద్వారా వెండర్స్‌కి సర్టిఫికెట్లు అందజేసేలా కృషి చేయాలని ఎమ్మెల్యేని కోరారు. దాంతో ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడారు. స్ట్రీట్ వెండర్స్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ రంగ శాలివన్, జనరల్ సెక్రెటరీ అలివేలు మంగ, ఈసీ నెంబర్ పోచమ్మ తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-దుండిగల్

మన తెలంగాణ యాజమాన్యం రూపొందించిన నూతన ఆంగ్ల సంవత్సర క్యాలెండర్‌ను తెలంగాణ రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ టీడీపీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ నందిగామ సత్యనారాయణ ముదిరాజ్, నందిగామ ముదిరాజ్‌తో కలిసి మంగళవారం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాసాని యువసేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని వీరేశ్ ముదిరాజ్ టీటీడీపి నాయకులు రాము, నాగేష్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కూచిపూడి నృత్యంలో లక్ష్మీదుర్గ అద్భుత ప్రతిభ

ప్రముఖులతో మెమెంటో అందజేత



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాల్లో భాగంగా ఏడీఎస్ ఛానల్ అధ్యక్షులు జన్ను రాజు ఆధ్వర్యంలో నగరంలోని రవీంద్రభారతిలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఉమెన్ ఐకాన్ సాంస్కృతిక ప్రదర్శనలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రంగారెడ్డి నగర్ ప్రాంతానికి చెందిన జి.లక్ష్మీదుర్గ కుత్బుల్లాపూర్ బహదూర్‌పల్లిలోని ప్రభుత్వ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతుంది. కూచిపూడి నృత్య విభాగంలో నిర్వహించిన ప్రదర్శనలో అద్భుత ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి సాధించింది. ఈ మేరకు ప్రముఖ సామాజికవేత్త కొత్త కృష్ణవేణి శ్రీనివాస్, వికలాంగుల సంఘం చైర్మెన్ వాసుదేవరెడ్డి, క్రైమ్ బ్రాంచ్ ఏసీపీ సీతారెడ్డి, ఎస్సై శ్రీలత, ప్రపంచ హ్యూమన్ రైట్స్ సంఘం ప్రతినిధి వి.వెంకటేష్, మహబూబ్‌నగర్ జిల్లా చైర్మెన్ జి.సతీష్, సంఘ సేవకులు చిన్నయ్య చేతుల మీదుగా విజేతగా నిలిచిన జి.లక్ష్మీ దుర్గను మంగళవారం శాలువాతో ఘనంగా సన్మానించి మెమెంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో శాంతి, వికలాంగుల సంఘం అధ్యక్షురాలు భ్రమరాంబ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల మీద చెత్త వేయకుండా అవగాహన కల్పించాలి

కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్ సిక్కుల బస్తీ వద్ద ఉన్న వెటర్నరీ హాస్పిటల్ పరిసర ప్రాంతాలను శుభ్రం చేసేందుకు, జీహెచ్ఎంసీ మరియు రాంకీ గ్రూప్ వారు నిర్వహించిన మాస్ క్లీనింగ్ డ్రైవ్ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పాల్గొని సిబ్బందితో కలిసి పరిసరాలను శుభ్రం చేయడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ చెత్తను రోడ్ల మీద వేయకుండా కాలనీ నాయకులు ప్రజలలో అవగాహన వచ్చేలా ప్రయత్నించాలని అన్నారు. వారి ఇండ్లతోపాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాల బారిన పడకుండా ఉంటామని, చెత్తను వీధుల్లోనూ కాలువలోను కాకుండా తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి చెత్త సేకరించే ఆటోలలో మాత్రమే వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సమ్మారెడ్డి, ఉపాధ్యక్షులు కాశీనాథ్ యాదవ్, ప్రధానకార్యదర్శి గుడ్ల శ్రీనివాస్, రాములుగౌడ్, మౌలానా, యాదగిరి, దుర్గేష్, మోజెస్, దేవేందర్, కటికరవి, సాయిగౌడ్, సంపత్, బాలరాజు, జోనల్ హెడ్ రామకృష్ణారెడ్డి, సర్కిల్ ఇన్‌చార్జ్ సంతోష్, ఎస్.ఆర్.పి సత్యనారాయణ, డబ్ల్యూ.ఎఫ్.ఎ సుధాకర్ రెడ్డి, ఎస్.ఎఫ్.ఎ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నవచిత్రం



ఆస్కార్ బరిలో 10 భారతీయ సినిమాలు

ఈసారి భారతీయ సినిమా అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటేందుకు రెడీ అవుతోంది. ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే ఆస్కార్ అవార్డులను అందుకునేందుకు పలు భారతీయ సినిమాలు ఆస్కార్ బరిలో అమీతుమీ తేల్చుకోబోతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ఏకంగా 10 సినిమాలు ఆస్కార్ కోసం పోటీ పడుతున్నాయి. వీటిల్లో తెలుగు సినిమా 'ఆర్ఆర్ఆర్' ఇప్పటికే రెండు విభాగాల్లో అర్హత సాధించడం విశేషం.
95వ ఆస్కార్ అవార్డుల కోసం మన దేశం నుంచి అధికారికంగా 'ది ఛల్లో షో'ని పంపారు. దీంతోపాటు 'ఆర్ఆర్ఆర్', 'ది కాశ్మీర్ ఫైల్స్', 'కాంతార', 'విక్రాంత్ రోణ', 'గంగూభాయి కతియావాడి', 'మి వసంతరావ్', 'తుజ్యా సాథీ కహీ హై', 'రాకెట్రీ', 'ఇరవిన్ నిళల్' చిత్రాలు ఓపెన్ కేటగిరిలో నిలిచాయి. వీటితోపాటు ప్రపంచ వ్యాప్తంగా మొత్తం 301 సినిమాలు ఆస్కార్ పురస్కారాల కోసం పోటీ పడుతున్నాయి. 95వ ఆస్కార్ అవార్డ్స్‌కు నామినేట్ అయిన చిత్రాలను ఈనెల 24న ప్రకటిస్తారు. మార్చి 12న ఆస్కార్ వేడుకలు జరుగనున్నాయి. 'ఆర్ఆర్ఆర్' సినిమాతోపాటు రిషబ్‌శెట్టి హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన 'కాంతార' సినిమా ఉత్తమ చిత్రం, ఉత్తమ నటుడు విభాగాల్లో ఆస్కార్ నామినేషన్లకు అర్హత సాధించడం మరో విశేషం.

సంక్రాంతి పండగకి ప్రతిబింబం

ప్రతి ఏటా సంక్రాంతి పండగ కోసం రెండు తెలుగు రాష్ట్రాలలోని ప్రజలు ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తారనే విషయం మనందరికీ తెలిసిందే. రెడ్ సెడార్ ఎంటర్టైన్మెంట్ వారు ఈ పండగ వాతావరణం ఉట్టి పడేలా 'సంక్రాంతి తకధై' పాటను సోషల్ మీడియా ద్వారా గ్రాండ్‌గా విడుదల చేశారు.
శరద్ గుమస్తే నిర్మించిన ఈ పాటలో మానస్ నాగులపల్లి, బిగ్ బాస్ ఫేమ్ కీర్తి భట్, నిఖిల్ నర్తించారు. అంతేకాకుండా ఈ పాటలో కన్నడ సూపర్ స్టార్ రమేష్ అరవింద్ స్పెషల్ అప్పీరెన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.
'తకధై.. తకధై తకధై...తకధై తకధై తకధై తకధై దూరమున్న నింగిలో తార నేలకు జారిందా..' అంటూ ఈ పాటను అవినాష్ రావి నూతల రాయగా, అనీ మాస్టర్ నృత్య దర్శకత్వంలో అనూప్ మీనన్ అద్భుతంగా మ్యూజిక్ కంపోజ్ చేసిన ఈ పాటను అనూప్ మీనన్, లక్ష్మి హేసల్ అద్భుతంగా ఆలపించారు. జై సరికొండ అందించిన ఈ పాటలో గంగిరెద్దు, ముగ్గులు, పచ్చని పొలాలు వంటి కెమెరా విజువల్స్ చూస్తుంటే ప్రేక్షకులకు సంక్రాంతి ముందే వచ్చిన ఫ్రెష్ ఫీల్‌ని కలిగిస్తుంది. యూట్యూబ్‌లో విడుదలైన కొన్ని గంటలలోనే ఈ పాటకు సంగీత ప్రియుల నుండి అద్భుతమైన రెస్పాన్స్ వస్తుండడంతో మేకర్స్ చాలా హ్యాపీగా ఫీల్ అవుతున్నారు.


రమేష్ అరవింద్

పాన్ వరల్డ్ సినిమా స్థాయిలో జీ2


అడివి శేష్

హీరో అడివి శేష్ నటించిన చిత్రం 'గూఢచారి'. దీనికి సీక్వెల్‌గా 'జీ2' తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి అడివి శేష్ కథ అందించారు. 'మేజర్' ఎడిటర్ వినయ్ కుమార్ సిరిగినీడి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌లపై ఈ చిత్రాన్ని టిజి విశ్వ ప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మించనున్నారు.
మంగళవారం నిర్వహించిన ఈ చిత్ర ప్రెస్‌మీట్‌లో 'ప్రీ విజన్'ని మేకర్స్ లాంచ్ చేశారు.
అడివి శేష్ మాట్లాడుతూ,"జీ2'ని ఒక ఫ్రాంచైజ్‌గా ప్రపంచవ్యాప్తంగా తీసుకెళ్లాలనే తపన వుంది. కొత్త దర్శకుడు వినయ్‌కి చాలా గ్రేట్ విజన్ ఉంది. తనకి గూఢచారి వరల్డ్ పై చాలా మంచి పట్టు ఉంది. మా నిర్మాతలు విశ్వప్రసాద్, అనిల్, అభిషేక్‌కి కృతజ్ఞతలు. 'గూఢచారి' సౌత్ ఇండియా స్పై సినిమాల ట్రెండ్‌ని మళ్ళీ తీసుకొచ్చింది. 'జీ2'తో ఆల్ ఇండియా ఫ్రాంచైజ్‌గా మారబోతుంది. ఇది నెక్స్ట్ లెవల్‌లో ఉంటుంది. ఈ చిత్రాన్ని ఐదు దేశాల్లో షూట్ చేయబోతున్నాం. 2024లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తుంది' అని తెలిపారు.
'ఈ సినిమా ప్రేక్షకుకులకు గొప్ప అనుభూతిని ఇస్తుంది. ప్రీ విజన్‌కి శ్రీచరణ్ చాలా చక్కని సంగీతం అందించారు. సినిమా అంచనాలకు మించి ఉంటుంది' అని దర్శకుడు వినయ్ కుమార్ అన్నారు. నిర్మాత టిజి విశ్వ ప్రసాద్ మాట్లాడుతూ,'నిర్మాణంలోకి వచ్చిన కొత్తలో 'గూఢచారి' చేశాం. కొత్త కంటెంట్‌ని ప్రేక్షకులు ఆదరిస్తారని నమ్మకాన్ని ఇచ్చిన చిత్రమిది. ఇప్పుడు మా నిర్మాణంలో దాదాపు 20 చిత్రాలు ఉన్నాయి. ఈ సినిమా మాకు ఎంతో ప్రత్యేకం. పాన్ ఇండియాగా లాంచ్ చేసి, పాన్ వరల్డ్ సినిమా స్థాయికి తీసుకువెళ్లాని భావిస్తున్నాం' అని చెప్పారు. మరో నిర్మాత అభిషేక్ అగర్వాల్ మాట్లాడుతూ, 'ఈ సినిమా పై భారీ అంచనాలు ఉన్నాయి. ఆ అంచనాలు అందుకునే భాద్యతని శేష్, మేము తీసుకున్నాం. ఈ సినిమా అద్భుతంగా ఉండబోతుంది' అని అన్నారు.

పవర్‌స్టార్ బర్త్‌డే కానుకగా రిలీజ్


జి.ఎస్.ఎన్ నాయుడు


శ్రీ లక్ష్మి గణ సుబ్రమణ్య స్వామి ప్రొడక్షన్స్ పతాకంపై నూతన నటుడు జి.ఎస్.ఎన్ నాయుడు ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'యుగల్' (ది మాస్ విత్ డైవర్సన్ అనేది ట్యాగ్ లైన్). ప్రమోద్ కుమార్ కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వంలో ఆర్ బాలాజీ నిర్మిస్తున్నారు. ఈ చిత్ర మొదటి ప్రచార చిత్రాన్ని పాత్రికేయుల సమక్షంలో విడుదల చేశారు.
ఈ సందర్భంగా హీరో జిఎస్ఎన్‌నాయుడు మాట్లాడుతూ, 'ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా చిత్రీకరిస్తున్నాం. హీరో క్యారెక్టరైజేషన్ చాలా కొత్తగా ఉంటుంది. మంచి యాక్షన్ ఎపిసోడ్స్ ఉన్నాయి' అని తెలిపారు. 'మా చిత్ర హీరో జి ఎస్ ఎన్ నాయుడు మెగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్‌కి వీరాభిమాని. అందుకే మా చిత్రాన్ని పవన్ కళ్యాణ్ పుట్టిన రోజైన సెప్టెంబర్ 2న విడుదల చేస్తున్నాం. ఈ సినిమా పవన్ కళ్యాణ్ అభిమానులకి విపరీతంగా నచ్చుతుంది. కథ, స్క్రీన్ ప్లే చాలా బాగా వచ్చింది. ప్రస్తుతం షూటింగ్ జరుగు తోంది. మా నిర్మాతలు ఎక్కడా రాజీపడటం లేదు' అని కథ, స్క్రీన్ ప్లే దర్శకత్వం వహిస్తున్న ప్రమోద్ కుమార్ అన్నారు. ఈ చిత్రానికి మాటలు : ప్రమోద్ కుమార్, రాహుల్ జి గౌలికర్, ఎడిటర్ : అలోషియస్ జేవియర్, కెమెరా మాన్ : ప్రేమ్ జై విన్సన్ట్, సంగీత దర్శకుడు : సన్నీ మాణిక్, నిర్మాత : ఆర్.బాలాజీ.


కశ్మీర పర్దేశీ, కిరణ్ అబ్బవరం

మాటలు గుర్తుండిపోతాయి

అల్లు అరవింద్ సమర్పణలో జీఏ2 పిక్చర్స్ బ్యానర్ పై తెరకెక్కుతున్న సినిమా 'వినరో భాగ్యము విష్ణు కథ'. మురళి కిషోర్ దర్శకుడు. బన్నీ వాసు నిర్మాత. ఈ చిత్ర టీజర్ రిలీజ్ ఈవెంట్‌లో హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ, 'గీతా ఆర్ట్స్‌లో సినిమా చేయడం వేరు, వినరో భాగ్యము విష్ణు కథ సినిమా కథ చేయడం వేరు. ఇలా ఎందుకు చెప్తున్నానో మీకు ఫిబ్రవరి 17న తెలుస్తుంది. ఈ సినిమాలోని డైలాగ్స్ అలా గుర్తుండిపోతాయి. సినిమా చాలా ఇంపాక్ట్ ఫుల్‌గా ఉంటుంది' అని తెలిపారు. 'ఇందులో విష్ణు తత్త్వం ఉంది. ఒక మనిషి చిరునవ్వుని, అవతలవాడికి సాయం పడే విధానాన్ని కమర్షియల్‌గా చెప్పాం. ఈ సినిమా నుంచి రిలీజ్ చేసిన సాంగ్‌కు ఇండస్ట్రీ పెద్దలనుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది' అని నిర్మాత బన్నీవాసు చెప్పారు.

అందరికీ రిలేట్ అయ్యే కథ


సంతోష్ శోభన్

యువ కథానాయకుడు సంతోష్ శోభన్ నటించిన కొత్త సినిమా 'కళ్యాణం కమనీయం'. ప్రియ భవానీ శంకర్ నాయిక. యూవీ కాన్సెప్ట్స్ నిర్మాణంలో దర్శకుడు అనిల్ కుమార్ ఆళ్ల రూపొందించారు. సంక్రాంతి పండగ కానుకగా ఈ నెల 14న ఈ సినిమా విడుదల కానుంది.
ఈ నేపథ్యంలో హీరో సంతోష్‌శోభన్ మంగళవారం మీడియాతో మాట్లాడుతూ, 'సంక్రాంతికి సినిమా రిలీజ్ చేసుకోవాలనేది నా కల. అది ఈ చిత్రంతో తీరుతోంది. దర్శకుడు అనిల్ కుమార్ చెప్పిన కథ బాగా నచ్చింది. ఇది మనందరికీ రిలేట్ అయ్యే కథ. ఇలాంటి కథలు అరుదుగా వస్తుంటాయి. నేను ఇప్పటిదాకా చేసిన సోషల్ కామెడీ మూవీస్‌లో నా పాత్రలు రియాల్టీకి కొంత దూరంగా ఉంటాయి. కానీ ఈ చిత్రంలో నేను చేసిన శివ క్యారెక్టర్ చాలా జెన్యూన్‌గా ఉంటుంది. ఇందులో శృతి జాబ్ చేస్తుంది, శివకు ఉద్యోగం ఉండదు. అయితే ఇదొక్కటే కథలో కీలకం కాదు. ఈ కొత్త జంట తమ వైవాహిక జీవితంలో ఎదురైన పరిస్థితులను తట్టుకుని ఎలా ముందుకు సాగారు అనేది చూపిస్తున్నాం. ఈ సినిమా ఒక ఎక్స్‌పీరియన్స్‌లా ఉంటుంది. కథ కూడా పాటలతో ముందుకు వెళ్తుంది. శ్రావణ్ భరద్వాజ్ మంచి సంగీతాన్ని అందించాడు. అలాగే కార్తీక్ ఘట్టమనేని సినిమాటోగ్రఫీ ఆకర్షణ అవుతుంది. యూవీ క్రియేషన్స్ సంస్థ నా ఫ్యామిలీ ప్రొడక్షన్ లాంటిది. ఇందులో మూడు చిత్రాలు చేశాను. ప్రస్తుతం నందినీ రెడ్డి దర్శకత్వంలో 'అన్ని మంచి శకునములే'తోపాటు మరో యాక్షన్ ఎంటర్‌టైనర్ కూడా చేస్తున్నాను' అని తెలిపారు.

రూట్స్ ప్రచారకర్తగా హంపీ

రూట్స్ కొలీజియం విద్యాసంస్థల ప్రకటన



హైదరాబాద్ : భారత చెస్ ముఖచిత్రం, 15 ఏండ్ల పిన్న వయసులోనే గ్రాండ్‌మాస్టర్ హోదా దక్కించుకుని చరిత్ర సృష్టించిన కోనేరు హంపీ.. రూట్స్ కొలీజియం విద్యా సంస్థల బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించింది. సమగ్ర విద్యను అందించటంలో 30 ఏండ్ల వారసత్వ వేడుక సందర్భంగా.. కోనేరు హంపీని ప్రచారకర్తగా నియమించారు. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో రూట్స్ కొలీజియం విద్యా సంస్థల చైర్మెన్ బి.పి పడాల ఈ మేరకు ప్రకటించారు. 'రూట్స్ కొలీజియం ప్రచారకర్తగా వ్యవహరించటం ఎంతో సంతోషం. రూట్స్ కొలీజియం, నేను 30 ఏండ్ల క్రితం ప్రయాణం మొదలుపెట్టాం. సుమారుగా మా ఇద్దరికీ ఒకే కథ. ప్రచారకర్తగా కళాశాల స్థాయిని పెంచేందుకు కృషి చేస్తాను. బ్రాండ్ అంబాసిడర్‌గా నన్ను ఎంచుకున్నందుకు ధన్యవాదాలు' అని కోనేరు హంపీ తెలిపింది.

జాతీయ మాస్టర్‌గేమ్స్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ

ఫిబ్రవరి 2-5 వరకు గచ్చిబౌలిలో పోటీలు



హైదరాబాద్ : 5వ జాతీయ మాస్టర్‌గేమ్స్ (2023) టోర్నమెంట్ వాల్‌పోస్టర్‌ను రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ మంగళవారం ఆవిష్కరించారు. రవీంద్ర భారతిలోని కార్యాలయంలో మంత్రిని కలిసిన మాస్టర్‌గేమ్స్ నిర్వాహకులు టోర్నీ వివరాలను వెల్లడించారు. గచ్చిబౌలి స్టేడియంలో ఫిబ్రవరి 2 నుంచి 5 వరకు జాతీయ స్థాయి ఈవెంట్ జరుగనుంది. 27 రాష్ట్రాల నుంచి 15 వేలకు పైగా మాస్టర్ అథ్లెట్లు 18 క్రీడాంశాల్లో పోటీపడనున్నారు. మాస్టర్‌గేమ్స్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహిస్తున్న నిర్వాహకులను మంత్రి శ్రీనివాస్ గౌడ్ అభినందించారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ చైర్మెన్ కొలన్ జగ్జీవన్ రెడ్డి, కార్యదర్శి రామారావు, ఉపాధ్యక్షులు అనూప్ చక్రవర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఓర్సు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మోటార్‌స్పోర్ట్స్‌తో బ్లాక్‌బర్డ్స్ దోస్తీ



హైదరాబాద్ : ఇండియన్ రేసింగ్ లీగ్ (ఐఆర్ఎల్) ఫ్రాంచైజీ, మోటార్‌స్పోర్ట్స్ టీమ్ హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ 2023 సీజన్‌కు ప్రణాళికబద్ధంగా సిద్ధమవుతోంది. ఇండియన్ రేసింగ్ లీగ్ తొలి సీజన్ ఓవరాల్ రన్నరప్‌గా నిలిచిన హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్.. 2023 సీజన్‌కు టైటిల్ భాగస్వామిగా ఎంపీ మోటార్‌స్పోర్ట్స్‌లో ఒప్పందం చేసుకుంది. 2023 ఫార్ములా మిడిల్‌ఈస్ట్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ నాలుగు కార్లతో బరిలోకి దిగుతుండగా.. మూడు కార్లకు ఎంపీ మోటార్‌స్పోర్ట్స్ మద్దతు అందించనుంది. గ్లోబల్ ఫార్ములా రేసు సర్క్యూట్‌లో హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ ప్రస్థానానికి ఎంపీ మోటార్‌స్పోర్ట్స్ దోహదం చేయగలదని బ్లాక్‌బర్డ్స్ టీమ్ ప్రిన్సిపల్ కార్తీక్ సెల్వరాజ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

శతకొట్టిన కోహ్లి

- తొలి వన్డేలో భారత్ ఘన విజయం
- రాణించిన రోహిత్, గిల్, సిరాజ్

సిరీస్‌లో భారత్‌కు 1-0 ఆధిక్యం



విరాట్ కోహ్లి (113) శతకంతో చెలరేగాడు. ఓపెనర్లు రోహిత్ శర్మ (83), శుభ్‌మన్ గిల్ (70) అర్థ సెంచరీలతో రాణించారు. టాప్-3 బ్యాటర్లు కదం తొక్కటంతో తొలుత 373 పరుగుల భారీ స్కోరు నమోదు చేసిన టీమ్ ఇండియా.. గువహటి వన్డేలో శ్రీలంకను చిత్తు చేసింది. ఛేదనలో శ్రీలంక 306 పరుగులే చేయగా భారత్ 63 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. వన్డే సిరీస్‌లో 1-0 ఆధిక్యం దక్కించుకుంది.



నవతెలంగాణ-గువహటి

శ్రీలంకపై తొలి వన్డేలో భారత్ 63 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. పరుగుల వరద పారిన గువహటి వన్డేలో పర్యాటక జట్టును చిత్తు చేసిన టీమ్ ఇండియా సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. విరాట్ కోహ్లి (113, 87 బంతుల్లో 12 ఫోర్లు, 1 సిక్స్) ధనాధన్ శతకానికి తోడు ఓపెనర్లు రోహిత్ శర్మ (83, 67 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సులు), శుభ్‌మన్ గిల్ (70, 60 బంతుల్లో 11 ఫోర్లు) అర్ధ సెంచరీలతో చెలరేగారు. టాప్ ఆర్డర్ ముగ్గురు బ్యాటర్లు మెరవటంతో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 373 పరుగుల భారీ స్కోరు సాధించింది. పేసర్లు ఉమ్రాన్ మాలిక్ (3/57), మహ్మద్ సిరాజ్ (2/30) నిప్పులు చెరగటంతో ఛేదనలో శ్రీలంక 306 పరుగులకే పరిమితమైంది. 206/8తో ఓటమి ఖాయం చేసుకున్న శ్రీలంకకు కెప్టెన్ దశున్ శనక (108 నాటౌట్, 88 బంతుల్లో 12 ఫోవర్లు, 3 సిక్సులు) సెంచరీ ఊరట కలిగించింది. కెరీర్ 45వ వన్డే సెంచరీ సాధించిన విరాట్ కోహ్లి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. భారత్, శ్రీలంక రెండో వన్డే కోల్‌కత ఈడెన్‌గార్డెన్స్‌లో గురువారం జరుగనుంది.

టాప్-3 దూకుడు : బ్యాటింగ్ పిచ్‌పై టాస్ నెగ్గిన శ్రీలంక తొలుత బౌలింగ్ ఎంచుకుంది. బంగ్లా చేతిలో వన్డే సిరీస్ నుంచి వచ్చిన రోహిత్‌సేన.. లంకేయులపై బ్యాంగ్ బ్యాంగ్ ఆరంభం చేసింది. ఓపెనర్లు రోహిత్ (83), గిల్ (70) దంచికొట్టారు. తొలి వికెట్‌కు 19.4 ఓవర్లలోనే 143 పరుగులు పిండుకున్నారు. ఏడు ఫోర్లు, రెండు సిక్సర్లతో 41 బంతుల్లో రోహిత్ అర్థ సెంచరీ సాధించగా, ఏడు ఫోర్లతో 51 బంతుల్లో గిల్ ఫిఫ్టీ మార్క్ చేరుకున్నాడు. అదిరే ఆరంభాన్ని అందించిన ఓపెనర్లు



అర్థ సెంచరీల అనంతరం నిష్క్రమించగా.. నం.3 బ్యాటర్ విరాట్ కోహ్లి (113) ఆ తర్వాత కథ చూసుకున్నాడు. కెప్టెన్ రోహిత్‌తో కలిసి సావధానంగా ఇన్నింగ్స్ మొదలెట్టిన విరాట్..మూడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 47 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించాడు. అర్థ సెంచరీ అనంతరం కోహ్లి ఇన్నింగ్స్‌లో అమాంతం వేగం పెరిగింది. మరో 33 బంతుల్లోనే 50 పరుగులు కొట్టిన కోహ్లి.. 80 బంతుల్లో కెరీర్ 45వ వన్డే శతకం అందుకున్నాడు. ఓ ఎండ్‌లో కోహ్లి దంచికొట్టగా.. మరో ఎండ్‌లో శ్రేయస్ అయ్యర్ (28), కెఎల్ రాహుల్ (39), హార్దిక్ పాండ్య (14) చక్కగా సహకరించారు. ఓ దశలో భారత్ 400 మార్క్ తాకుతుందని అనిపించింది. కానీ కోహ్లి నిష్క్రమణ తర్వాత చివర్లో భారత్ ఆశించిన వేగంగా పరుగులు సాధించలేదు. నిర్ణీత ఓవర్లలో భారత్ 7 వికెట్లకు 373 పరుగులు చేసింది.

పేసర్ల ప్రతాపం : తొలుత భారత్ 373 పరుగుల భారీ స్కోరుతో మ్యాచ్‌ను ఏకపక్షం చేయగా.. పేసర్ల విజృంభణతో శ్రీలంక సైతం ఆరంభంలోనే ఆశలు వదులుకుంది. హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ వరుస వికెట్లతో శ్రీలంకను దెబ్బకొట్టాడు. ఓపెనర్ ఫెర్నాండో (5), కుశాల్ మెండిస్ (0)లను స్వల్ప స్కోర్లకే సాగనంపాడు. స్పీడ్‌గన్ ఉమ్రాన్ మాలిక్ సైతం జోరందుకోవటంతో శ్రీలంక పతనం వేగవంతమైంది. అసలంక (23), దునిత్ (0), నిశాంక (72) వికెట్లతో మాలిక్ మ్యాచ్‌ను లాంఛనం చేశాడు. ఆరంభంలో ఓపెనర్ నిశాంక అర్ధ సెంచరీతో శ్రీలంక స్కోరు బోర్డును కదిలించగా.. చివర్లో ఆ బాధ్యతను కెప్టెన్ శనక (108 నాటౌట్) తీసుకున్నాడు. 206/8తో ఉన్న శ్రీలంకకు తొమ్మిదో వికెట్‌కు 100 పరుగులు జోడించాడు. 88 బంతుల్లో సెంచరీ సాధించిన శనక శ్రీలంక శిబిరంలో ఊరట కలిగించాడు. భారత బౌలర్లు సమిష్టిగా రాణించటంతో శ్రీలంక 50 ఓవర్లలో 8 వికెట్లకు 306 పరుగులే చేసింది. 63 పరుగుల తేడాతో భారత్ ఘన విజయం సాధించింది.

స్కోరు వివరాలు :

భారత్ ఇన్నింగ్స్ : రోహిత్ (బి) మధుశంక 83, గిల్ (ఎల్బీ) శనక 70, కోహ్లి (సి) మెండిస్ (బి) రజిత 113, శ్రేయస్ (సి) ఫెర్నాండో (బి) డిసిల్వ 28, రాహుల్ (బి) రజిత 39, పాండ్య (సి) హసరంగ (బి) రజిత 14, అక్షర్ (సి) ఫెర్నాండో (బి) కరుణరత్నె 9, షమి నాటౌట్ 4, సిరాజ్ నాటౌట్ 7, ఎక్స్‌ట్రాలు : 6, **మొత్తం : (50 ఓవర్లలో 7 వికెట్లకు) 373.**

వికెట్ల పతనం : 1-143, 2-173, 3-213, 4-303, 5-330, 6-362, 7-364.

బౌలింగ్ : రజిత 10-0-88-3, మధుశంక 6-0-43-1, హసరంగ 10-0-67-0, కరుణరత్నె 8-0-54-1, దునిత్ 8-0-65-0, శనక 3-0-22-1.

శ్రీలంక ఇన్నింగ్స్ : నిశాంక (సి) అక్షర్ (బి) మాలిక్ 72, ఫెర్నాండో (సి) హార్దిక్ (బి) సిరాజ్ 5, మెండిస్ (బి) సిరాజ్ 0, అసలంక (సి) రాహుల్ (బి) మాలిక్ 23, డిసిల్వ (సి) రాహుల్ (బి) షమి 47, శనక నాటౌట్ 108, హసరంగ (సి) శ్రేయస్ (బి) చాహల్ 16, దునిత్ (సి) గిల్ (బి) మాలిక్ 0, కరుణరత్నె (సి) రోహిత్ (బి) హార్దిక్ 14, రజిత నాటౌట్ 9, ఎక్స్‌ట్రాలు : 12, **మొత్తం : (50 ఓవర్లలో 8 వికెట్లకు) 306.**

వికెట్ల పతనం : 1-19, 2-23, 3-64, 4-136, 5-161, 6-178, 7-179, 8-206.

బౌలింగ్ : షమి 9-0-67-1, సిరాజ్ 7-1-30-2, హార్దిక్ 6-0-33-1, మాలిక్ 8-0-57-3, చాహల్ 10-0-58-1, అక్షర్ 10-0-58-0.

ఆటలు

హైదరాబాద్ ధమాల్

79 పరుగులకే ఆలౌట్



హైదరాబాద్ : రంజీ ట్రోఫీలో హైదరాబాద్ నిలకడగా చెత్త ప్రదర్శన చేస్తుంది. ఎలైట్ గ్రూప్-బిలో సౌరాష్ట్రతో మ్యాచ్‌లో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 79 పరుగులకే కుప్పకూలింది. జింఖానా మైదానంలో తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన హైదరాబాద్ 30.5 ఓవర్లలోనే చేతులెత్తేసింది. రోహిత్ రాయుడు (23), భగత్ వర్మ (11), అనికెత్ రెడ్డి (10) మినహా మరో బ్యాటర్ రెండెంకల స్కోరు సాధించలేదు. తన్మయ్ (2), అలంకృత్ (7), తొల్కంటి గౌడ్ (4), చందన్ (2), భవేశ్ (3), రవితేజ (8), శశాంక్ (5), మోహిద్దున్ (0) తేలిపోయారు. సౌరాష్ట్ర బౌలర్లలో జడేజా (3/8), జైదేవ్ (3/28), సకారియ (1/8), యువరాజ్‌సిన్హ (2/23) వికెట్ల వేటలో అదరగొట్టారు. ఇక, సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు దిశగా సాగుతోంది. ఓపెనర్లు హార్విక్ (81), చిరాగ్ (68) సహా షెల్డన్ జాక్సన్ (59) అర్ధ సెంచరీలు బాదటంతో తొలి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 250/5తో పటిష్ట స్థితిలో కొనసాగుతోంది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి సౌరాష్ట్ర 171 పరుగుల ముందంజలో నిలిచింది.

సైనా, శ్రీకాంత్ ఔట్

- తొలి రౌండ్లోనే పరాజయాలు
- మలేషియా ఓపెన్ సూపర్ సిరీస్



కౌలాలంపూర్ : భారత స్టార్ షట్లర్లు సైనా నెహ్వాల్, కిదాంబి శ్రీకాంత్ నూతన ఏడాదిని ఓటమితో ఆరంభించారు. మలేషియా ఓపెన్ సూపర్ సిరీస్‌లో మాజీ వరల్డ్ నం.1 క్రీడాకారులు మట్టికరిచారు. మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్, పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ పోరాడి ఓడారు. సైనా నెహ్వాల్ 12-21, 21-17, 17-21తో హాన్ యు (చైనా) చేతిలో పరాజయం పాలైంది. కిదాంబి శ్రీకాంత్ 19-21, 14-21 వరుస గేముల్లో జపాన్ స్టార్ కెంటో నిషిమోట చేతిలో ఓటమి చెందాడు. మహిళల సింగిల్స్‌లో వర్ధమాన షట్లర్ ఆకర్షి కశ్యప్ 10-21, 8-21తో చైనీస్ తైపీ షట్లర్ చేతిలో భంగపాటుకు గురైంది. మెన్స్ డబుల్స్‌లో కృష్ణ ప్రసాద్, విష్ణువర్ధన్ గౌడ్ జోడీ 10-21, 18-21తో దక్షిణ కొరియా జోడీ చేతిలో ఓడారు. మహిళల డబుల్స్‌లో ట్రెసా జాలీ, గాయత్రి పుల్లెల జంట 21-19, 21-14తో తొలి రౌండ్లో మెరుపు విజయం సాధించింది. మహిళల సింగిల్స్‌లో నేడు జరిగే తొలి రౌండ్ పోరులో ఆరో సీడ్ పి.వి సింధుతో స్పెయిన్ స్టార్ కరొలినా మారిన్ తలపడనుంది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

ఐపీఎస్ వర్గాలలో కలకలం రేపిన సీఎస్ సోమేష్ కేడర్‌పై హైకోర్టు తీర్పు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్‌కుమార్ కేడర్‌కు సంబంధించి రాష్ట్ర హైకోర్టు మంగళవారం ఇచ్చిన తీర్పు రాష్ట్ర ఐపీఎస్ వర్గాలలో కలకలం రేపింది. రాష్ట్రంలో అత్యున్నత పదవి అయిన చీఫ్ సెక్రటరీ హోదాలో ఉన్న సోమేష్‌కుమార్‌కు తెలంగాణ కేడర్‌కు కేటాయిస్తు కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును రద్దు చేయడమే గాక ఆయనను ఏపీ కేడర్‌కు కేటాయిస్తు హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రభావం ఇంకా ఎంత మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై పడనుందో నన్న వాడి వేడి చర్చ పోలీసు ఉన్నతాధికార వర్గాలలో సాగుతున్నది. ముఖ్యంగా రాష్ట్ర విభజన సమయంలో ఐఏఎస్ ఐపీఎస్ అధికారుల కేటాయింపులు రెండు రాష్ట్రాలకు జరిగాయి. అయితే ఆ సమయంలో ఏపీ కేడర్‌కు తాఉము కేటాయించబడినప్పటికి కొందరు ఐపీఎస్ అధికారులు ఆ రాష్ట్రానికి వెళ్లకుండా ఇక్కడే కీలకమైన పోస్టులలో కొనసాగుతున్నారు. ఈ విషయమై రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు సదరు అధికారులకు సంబంధించి సర్దుబాటు ధోరణితోటే వ్యవహరిస్తున్నాయని తెలుస్తోంది. కాగా తాజాగా సోమేష్‌కుమార్ కేడర్‌కు సంబంధించి కేంద్ర డీఓపీటీ విభాగం 1917లో వేసిన పిటీషన్‌పై తాజాగా హైకోర్టు తీర్పు నివ్వడంతో ఐఏఎస్, ఐపీఎస్ వర్గాలలో అంతర్గతంగా ఆందోళనకు దారి తీసింది. ఈ నేపథ్యంలోనే ఇటీవలనే రాష్ట్ర డీజీపీగా నియమితులైన అంజనీకుమార్‌కు ఇంకా తెలంగాణ కేడర్‌కు కేటాయించబడలేదని తెలుస్తోంది. తాజా పరిణమాల దృష్ట్యా రాష్ట్ర పోలీసు బాస్‌కు సైతం కేడర్ సమస్య ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయా అనే చర్చ సాగుతున్నది. సోమేష్‌కుమార్ విసయంలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన డీఓపీటీ విభాగం జోక్యం చేసుకున్న కారణంగా ఆయనకు సమస్య తలెత్తిందని అదే సమయంలో అంజనీకుమార్ విసయంలో ఈ పరిస్థితి తలెత్త బోదని కొందరు పోలీసు ఉన్నతాధికారులు వాదిస్తున్నారు. అదే సమయంలో మరో ఇద్దరు అదనపు డీజీ స్థాయి అధికారుల విషయంలోను కేడర్ సమస్య ఇంకా తొలగి పోలేదు. ముఖ్యంగా ప్రస్తుతం రాష్ట్ర పోలీసు సంక్షేమ విభాగం అదనపు డీజీ అభిలాష బిస్త్, కేంద్రంలో డిప్యూటేనషన్‌పై ఉన్న సంతోష్ మెహ్రాల కేడర్ ఏపీగానే కొనసాగుతున్నట్టు తెలిసింది.

సరకు రవాణాలో ద.మ.రైల్వే రికార్డు 9 నెలల్లో 100 మి.టన్నులు లోడింగ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దక్షిణ మధ్య రైల్వే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వంద మిలియన్ టన్నులకు పైగా సరుకు రవాణా చేసి రికార్డు సృష్టించింది. కేవలం 9 నెలల 9 రోజుల వ్యవధిలో ఈ రికార్డు సాధించినట్టు ఆ సంస్థ మంగళవారంనాడొక పత్రికా ప్రకటనలో తెలిపింది. జనవరి 9 నాటికి 100.236 మిలియన్ టన్నులను లోడ్ చేసినట్టు పేర్కొన్నారు. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే దాదాపు 11.5 మిలియన్ టన్నులు అధికంగా సరకు రవాణా లోడింగ్ చేసి, రూ.9,755 కోట్ల ఆదాయం సాధించామన్నారు. గత ఏడాదికంటే తక్కువ టైంలో 24 శాతం పైగా అధిక ఆదాయం వచ్చినట్టు తెలిపారు. 50.35 మిలియన్ టన్నుల (మి.ట) బొగ్గు (17.7శాతం), 26 మి.ట. సిమెంట్ (5శాతం), 5 మి.ట. ఎరువులు (23శాతం), 18.76 మి.ట. ఇతర సరకులు (11శాతం) పై కాలంలో రవాణా జరిగాయన్నారు. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ ఆపరేషన్స్ అండ్ కమర్షియల్ విభాగం బృందాన్ని అభినందించారు.

మీరెళ్తే...మాగోడు చెప్పండి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శికి టీఎస్‌ఆర్టీసీఈయూ విజ్ఞప్తి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఖమ్మంలో జరిగే భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) బహిరంగ సభకు హాజరైతే తమ గోడును ఆ వేదికపై ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావుకు వినిపించాలని టీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఈయూ ప్రధాన కార్యదర్శి కే రాజిరెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం మంగళవారం మగ్దూం భవన్‌లో కూనంనేనిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆర్టీసీలో యూనియన్ కార్యకలాపాలకు అనుమతించపోవడంతో కార్మికులు అనేక అవస్థలు పడుతున్నారని వారు ఈ సందర్భంగా తెలిపారు. మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను కూడా అమలు చేయలేదని గుర్తుచేశారు. ఆర్టీసీలో యూనియన్లను పునరుద్ధరించాలని కోరారు. అలాగే ఆర్టీసీ కార్మికులకు 2017, 2021 వేతన సవరణలు ఆమలు చేయాలని కోరారు. వేతన సవరణ చేయడానికి మునుగోడు ఉప ఎన్నికకు ముందు ఎన్నికల సంఘం నుంచి ఎలక్షన్ కోడ్ మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వం అడిగిందనీ, ఎన్నికలు ముగిసి 60 రోజులు దాటినా ఇప్పటికీ పట్టించుకోలేదని చెప్పారు. వాటితో పాటు పలు పెండింగ్ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు కొవ్వూరు యాదయ్య, ఎమ్ఏ మజీద్, సుర్కంటి మోహన్ రెడ్డి, కిషన్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణితో ఎన్టీపీసీ ఒప్పందం ఏప్రిల్ వరకు 4 లక్షల టన్నులు

వచ్చే ఏడాదిలో 80 లక్షల టన్నుల బొగ్గు సరఫరా

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రామగుండంలో ఎన్టీపీసీ నిర్మించిన తెలంగాణ సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్ (2ఞ800=1,600 మెగావాట్లు) ఫేజ్-1 ప్లాంట్లకు బొగ్గు సరఫరా కోసం ఆ సంస్థ సింగరేణితో ఒప్పందం చేసుకుంది. మంగళవారం సింగరేణి సంస్థ ఈడీ(కోల్ మూమెంట్) జె అల్విన్, ఎన్టీపీసీ తెలంగాణ ప్రాంత పర్యవేక్షక ఉన్నతాధికారి పాల్ సమక్షంలో జనరల్ మేనేజర్ (మార్కెటింగ్) కె సూర్యనారాయణ, ఎన్టీపీసీ జీఎం(ఫ్యూయెల్) తపస్ సాహెూలు ఈ ఒప్పందాలపై సంతకాలు చేశారు. దీని ప్రకారం ఫేస్ -1 లోని 800 మెగావాట్ల ప్లాంట్‌కు సింగరేణి ఈ ఏడాది ఏప్రిల్ వరకు 4 లక్షల టన్నుల బొగ్గు సరఫరా చేయనున్నదని జీఎం(మార్కెటింగ్) కె.సూర్యనారాయణ తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఫేస్ -1 లోని రెండు ప్లాంట్లకు 80 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేయడానికి ఒప్పందం కుదిరిందన్నారు. సింగరేణి రామగుండంలో ఇప్పటికే అక్కడి ఎన్టీపీసీకి చెందిన 2,600 మెగావాట్ల ప్లాంట్‌కు ఏడాదికి 112 లక్షల టన్నుల బొగ్గును సరఫరా చేస్తున్నదని తెలిపారు. తెలంగాణతో పాటు దేశ వ్యాప్తంగా 8 రాష్ట్రాల్లోని 13 ఎన్టీపీసీ ప్లాంట్లకు ఏటా 139 లక్షల టన్నుల బొగ్గు సరఫరా చేస్తున్నట్టు వివరించారు. సమావేశంలో సింగరేణి డీజీఎం (మార్కెటింగ్) తాడబోయిన శ్రీనివాస్, ఎస్వోఎం సురేందర్‌రాజు, అడిషనల్ మేనేజర్ మహేందర్ రెడ్డి, ఎస్ఈ రవి శ్రీవాస్తవ, ఎన్టీపీసీ ఏజీఎం ఆవిష్కర్ మెష్రమ్ పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్,ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల జాతీయ సదస్సు ..

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత సాధించడం కోసం నేడు బెంగుళూరులో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్టు ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం నియమించబడ్డ జస్టిస్ సదాశివన్ కమిటీ నివేదికను ఆమోదించడంలోనూ, అసెంబ్లీలో తీర్మానించి కేంద్రానికి నివేదించడంలో కర్నాటకలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యానికి పాల్పడుతున్నదని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన జస్టిస్ ఉషా మెహ్రా కమిషన్ నివేదికను ఆమోదించడంలో, పార్లమెంట్ ద్వారా ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ చేస్తామని దశాబ్దకాలంగా మాదిగలను నమ్మిస్తూ బీజేపీ మోసంచేస్తున్నదని తెలిపారు. మాదిగల పట్ల మోసపూరితంగా వ్యవహరిస్తున్న కేంద్రం, కర్నాటక ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావడమే ప్రధాన కర్తవ్యంగా మాదిగ ఉపకులాలు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలోనే నేడు బెంగుళూరులో ఎంఆర్‌పీఎస్ అనుబంధ సంఘాల జాతీయ సదస్సు వసంత్ నగర్ లో గల అంబేద్కర్ భవన్‌లో జరుగుతున్నదని తెలిపారు.

ప్రజలే నా రాజకీయ గాడ్ ఫాదర్..

నన్ను టార్గెట్ చేసేందుకు నలుగురు సీఎంలతో బహిరంగ సభ

- పోడు భూముల సమస్యను పరిష్కరించలేదు
- ఆత్మీయ సమ్మేళనంలో పొంగులేటి



నవతెలంగాణ-మణుగూరు

ఎవరి అండా లేకుండా రాజకీయాల్లో స్వయం శక్తితో ఎదిగాననీ, ప్రజలే తన రాజకీయ గాడ్ ఫాదర్ అని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం మణుగూరు మండలం తోగ్గూడెం పంచాయతీ సమ్మక్క సారక్క ఆలయ ప్రాంగణంలో డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య అధ్యక్షతన పినపాక నియోజకవర్గం ఆత్మీయ సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. దీనికి పొంగులేటి హాజరై మాట్లాడారు. నాలుగేండ్లలో ఎన్నో ఇబ్బందులు ఎదురైనా మౌనంగా భరించానని తెలిపారు. పదవి లేకున్నా ప్రజల్లో ఉంటూ సాయం చేస్తూనే ఉంటానని స్పష్టంచేశారు. రాబోయే సాధారణ ఎన్నికల్లో పోటీ చేస్తానని తెలిపారు. సంక్రాంతి పండుగలో వచ్చే గంగిరెద్దును కాదనీ, మౌనం అంగీకారం అనుకుంటే సరికాదనీ, మనసులో ఎన్నో బాధలు, గాయాలు ఉంటాయనీ, ప్రేమా, గౌరవం లేని చోట తాను ఇమడలేనన్నారు. సెక్యూరిటీలను తీసేసినా నొచ్చుకోలేదని, ప్రజలే నాకు సెక్యూరిటీ అని తెలిపారు. కష్టపడి సంపాధించిన ధనాన్ని ఇన్‌కమ్ టాక్స్ కట్టిన తర్వాత మిగిలిన దాన్ని ప్రజలకు పంచుతున్నానన్నారు. రాబోయే కాలంలో ప్రజా తీర్పును గౌరవిస్తానన్నారు. నాలుగేండ్లలో పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపులేకపోయారని అన్నారు.

ప్రజలను పాలకులు చిత్రహింసలు పెడుతున్నారనీ, తిరిగి వడ్డీతో చెల్లించాల్సి వస్తుందని పరోక్షంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. ఎన్నికల కోసం రాలేదని చెప్పారు. రాష్ట్రంలో ఎన్ని వేల కోట్ల రూపాయల పనులు చేశానో, ఎంత సంపాదించానో త్వరలోనే ప్రజల ముందు ఉంచుతానని తెలిపారు. రాష్ట్రం ఏర్పడకముందే పదిమంది కాంట్రాక్టర్లల్లో నేనూ ఒక ప్రముఖ కాంట్రాక్టర్ అని, రాజకీయాల్లోకి వచ్చి కాంట్రాక్టర్‌ని కాలేదన్నారు. నన్ను టార్గెట్ చేసేందుకు ఖమ్మంలో నలుగురు ముఖ్యమంత్రితో బహిరంగ సభ పెడుతున్నారని అన్నారు. ఇబ్బందులు పెట్టినా, ఆర్థికంగా నష్టపోయినా ప్రజల వద్దకు జోల పట్టుకొని అడుక్కుంటూ రాజకీయం చేస్తానన్నారు.

నాలుగేండ్ల కాలంలో కేసీఆర్, తనది తండ్రి కొడుకుల బంధంగా భావించాననీ, కానీ అటువైపు నుంచి ఏమీ దక్కకపోవడంతో రాజకీయ నిర్ణయం తీసుకుంటు న్నానని తెలిపారు. పినపాక మాజీ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. నియోజక వర్గంలో తన హయాంలోనే అభివృద్ధి జరిగింద న్నారు. రూ.400 కోట్లు నేనే తెచ్చానని, వాటికి శంకుస్థాపన చేస్తూ ప్రస్తుత ఎమ్మెల్యే కాలయాపన చేస్తున్నారని చెప్పారు. భూ కబ్జాలు, భూదందాలు, ఇసుక మాఫియా చేస్తూ కార్ల మీద కార్లు కొంటూ దోచుకుని దాచుకుంటున్నారని ఘాటుగా విమర్శించారు. అభివృద్ధి చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో జాలే ఆదినారాయణ, మువ్వ విజయబాబు, ముత్తినేని సుజాత, కె.వి. రావు, పుచ్చకాయల శంకర్, బల్లెం సురేష్, ఎస్కే బాజీ, నియోజకవర్గంలోని ఏడు మండలాల్లోని 117 పంచాయతీల నుంచి అధిక సంఖ్యలో పొంగులేటి అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ సమర్పణకు గడువును రెండేండ్ల పాటు పొడిగించాలి

ఓయూ పీహెచ్.డీ విద్యార్థుల ఫోరమ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కోవిడ్-19 సమయానికి మినహాయింపునిస్తూ పీహెచ్‌డీ పూర్తి చేసి థీసిస్ సమర్పించేందుకు సమయాన్ని రెండేండ్లు పొడిగించాలని ఓయూ పీహెచ్.డీ విద్యార్థుల ఫోరమ్ డిమాండ్ చేసింది. మంగళవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఫోరం కన్వీనర్ సీహెచ్.మురళీ, కో కన్వీనర్ కనకారెడ్డి, సభ్యులు మల్లేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వన్‌టైమ్ పేరుతో పీహెచ్‌డీ అడ్మిషన్ లేని వారికి కూడా పట్టాలిచ్చి అవినీతికి పాల్పడిన ఓయూ వీసీపై విచారణ చేపట్టి విద్యావ్యవస్థను కాపాడాలని కోరారు. ఆయన చేసే అవినీతి, అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేయాలని విజ్ఞప్తి చేశారు. నాసిరకం, దొంగ పీహెచ్‌డీలపై యూజీసీతో పాటు రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేపట్టాలన్నారు. దేశంలో ఏ యూనివర్సిటీలో లేని విధంగా ఓయూ 26 మంది సీనియర్ ప్రొఫెసర్లని యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా పదోన్నతులు కల్పించారని ఆరోపించారు.

దేశవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల్లో ప్రీ-పీహెచ్‌డీ పూర్తయ్యాక డిపార్ట్‌మెంట్ రీసెర్చ్ కమిటీ (డీఆర్‌సీ) అనుమతితో ఎన్ని సంవత్సరాల్లోనైనా పరిశోధన గ్రంథం (థీసీస్) సమర్పించుకోవడానికి వీలుందని తెలిపారు. కరోనా సమయంలో ఉస్మానియా యూనివర్సిటీ దాదాపు రెండేండ్లు మూసేశారనీ, ఆ సమయంలో ల్యాబులు, లైబ్రరీలు సైతం మూతపడ్డాయని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో కోవిడ్ సమయాన్ని రెండేండ్లు పొడిగించాలంటూ యూజీసీ చెప్పినా వినకుండా ఆరు నెలల్లో పూర్తి చేయకపోతే పీహెచ్‌డీలు రద్దవుతాయంటూ ఆదేశాలిచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఒక్కొక్క ప్రొఫెసర్ కింద 10 నుంచి 15 మంది స్కాలర్లని కేటాయించి అడ్డగోలుగా పీహెచ్‌డీలు పూర్తి చేయించారని విమర్శించారు. ఈ విధంగా దాదాపు 1,500 మంది పీహెచ్‌డీలు రద్దయినట్టు ప్రకటించారని తెలిపారు. సమావేశాలు, ధర్నాలు, ర్యాలీలపై నిషేధం విధించి నిజాం పాలకులను మించి విద్యార్థులపై అక్రమ కేసులను నమోదు చేయిస్తున్నారని విమర్శించారు.

రేషన్ బియ్యం ఎందుకు పంపిణీ చేయలేదు?

- సీఎం కేసీఆర్‌కు బండి సంజయ్ బహిరంగ లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పండుగపూట ఇప్పటిదాకా పేదలకు రేషన్ బియ్యం ఎందుకు పంపిణీ చేయలేదో చెప్పాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం ఈ మేరకు ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు బహిరంగ లేఖ రాశారు. కరోనా కాలంలోనూ గరీబ్ కళ్యాణ్ యోజన పథకం కింద కేంద్రం ఇచ్చిన బియ్యాన్ని కూడా పేదలకు అందకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకున్నదని విమర్శించారు. ఎఫ్‌సీఐ కోసం కొనుగోలు చేస్తున్న బియ్యాన్ని మొత్తం ఫోర్టిఫైడ్ రైస్‌గా ఇచ్చి విద్యార్థుల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు కేంద్రం చేస్తున్న కృషిలో భాగస్వామ్యం కావాలని కోరారు. పదో తేదీ వచ్చినా ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు జీతాలివ్వకపోవడం, పెన్షనర్ల సొమ్మును ఖాతాల్లో జమచేయకపోవడం దారుణమని పేర్కొన్నారు. సంక్రాంతి పండుగకు పెండింగ్‌లోని నాలుగు డీఏలు చెల్లిస్తారని ఆశిస్తే కనీసం జీతాలు కూడా ఇవ్వకపోవడం అన్యాయమని తెలిపారు.

అన్ రిజిస్టర్డ్ ఆస్తులను కొనుగోలు చేయొద్దు

- రెరా వైబ్‌సైట్‌లో తనిఖీ చేసుకోవాలి :టీఎస్ రెరా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అన్ రిజిస్టర్డ్ ప్లాట్లు, ఫ్లాట్లు, విల్లాలు, షాపులను కొనుగోలు చేయవద్దని టీఎస్ రెరా హెచ్చరించింది. ఈ మేరకు మంగళవారం టీఎస్ రెరా చైర్మెన్ సోమేశ్ కుమార్ ఒక ప్రటన విడుదల చేశారు. కొనుగోలు చేసే ముందు ఒక సారిరెరా వెబ్ సైట్ https://rerait.telangana.gov.in/SearchList/Searchలో తనిఖీ చేసుకోవాలని సూచించారు. స్క్వైర్ యార్డ్ ఫ్యాక్టరీ పేరుతో చేవెళ్ల వద్ద గోల్డెన్ పామ్స్ ఎన్ క్లేవ్ (12 ఎకరాలు), కిస్టాపూర్ వద్ద గ్రీన్ స్క్వైర్, ప్రైమ్ ఎవెన్యూ (10.5 ఎకరాలు), రాకంచర్ల వద్ద మ్యాజెస్టిక్ విల్లాస్ (11.5 ఎకరాలు), రాకంచర్ల వద్ద స్టార్ కాలనీ (3.5 ఎకరాల)కు ఎకరాల్లో పెట్టుబడి పెట్టండి... స్క్వైర్ యార్డ్స్‌లో లాభం పొందడి అంటూ ఆ సంస్థ ఫోన్ నెంబర్లు, వెబ్‌సైట్‌తో ప్రచారం చేసుకుంటుందని తెలిపారు.

సోమేశ్‌కుమార్‌ను మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నాం : మహేష్‌కుమార్ గౌడ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌పై తాము మొదటి నుంచి ఫిర్యాదు చేస్తున్నామని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఇక్కడ ఉన్న వాళ్ళను కాదని ఏపీ క్యాడర్ అధికారిని సీఎస్ చేయడం ఏంటని ప్రశ్నించారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కొందరు అధికారులు కేసీఆర్ అడుగులకు మడుగులొత్తుతున్నారని చెప్పారు. వరుసగా రెండు రోజులపాటు నేతలతో సమావేశాలు ఉంటాయన్నారు. పీఏసీ, ఎగ్జిక్యూటివ్ కమిటీ, డీసీసీ నేతలతో, వివిధ కమిటీలతో ఆయన మాట్లాడుతారని పేర్కొన్నారు. అనుబంధ సంఘాల నేతలతో కూడా సమావేశమవుతారని వివరించారు. అన్ని నియోజకవర్గాల్లో కేసీఆర్,కేటీఆర్ దిష్టిబొమ్మలు దహనంచేయాలని పిలుపునిచ్చారు.

దూదిమెట్ల బాలరాజ్‌తో ఉత్తరాఖండ్ బృందం భేటీ

- గొర్రెల పంపిణీ పథకం అమలుపై చర్చ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ గొర్రెల పంపిణీ పథకం అమలు తీరు అధ్యయం చేసేందుకు ఉత్తరాఖండ్ బృందం రాష్ట్రానికి చేరుకుంది. మంగళవారం హైదరాబాద్‌లోని షీప్ కార్పొరేషన్ రాష్ట్ర కార్యాలయంలో చైర్మెన్ దూదిమెట్ల బాలరాజ్‌తో బృందం సమావేశమైంది. ఉత్తరాఖండ్ ప్రభుత్వ అధికారులు, గొర్రెలు, ఉన్ని అభివృద్ధి బోర్డు జేడీ డాక్టర్ నీత్వాల్ ఆర్ఎస్, షీప్ అండ్ గోట్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ డాక్టర్ అశోక్ బిస్త్, డిప్యూటీ మేనేజర్ సంజయ్ సక్సేనా తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా గొర్రెల పంపిణీ కార్యక్రమం అమలు తీరును బాలరాజు వివరించారు. ఆ పథకం పనితీరు, తద్వారా పొందుకున్న లబ్దిదారుల కుటుంబాల ఆదాయ స్థితిగతులను తెలిపారు. రెండో విడతలో మరో 3,57,971 మంది లబ్దిదారులకు పంపిణీ జరుగుంతందని తెలియజేశారు. ఈ సమావేశంలో తెలంగాణ పశుసంవర్థక శాఖ ఎమ్‌డీ డాక్టర్ యస్.రామచందర్, ఏడీ డాక్టర్లు సత్యనారాయణ, వెంకటయ్య గౌడ్, డాక్టర్ సాయిరాజ్, డాక్టర్ మనోజ్, ఎంకే రాజు,క్రిష్ణ తదితరులు ఉన్నారు.

ఫిబ్రవరి 23 నుంచి హైదరాబాద్‌లో బయో ఆసియా-2023 సదస్సు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కోవిడ్-19 తర్వాత జీవశాస్త్ర రంగంలో వచ్చిన కొత్త అంశాలు, సవాళ్లు, అవకాశాలపై బయో ఆసియా - 2023లో చర్చించనున్నారు. ఫిబ్రవరి 23 నుంచి 26 వరకు హైదరాబాద్‌లోని హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో జరగనున్న వేదికలో ప్రపంచ నాయకులు, శాస్త్రవేత్తలు, జీవశాస్త్ర రంగానికి సంబంధించిన చట్టబద్ధ సంస్థల ప్రతినిధులు, పారిశ్రామిక సంఘాలు, విద్యావేత్తలు తదితరులు పాలుపంచుకోనున్నారు. కరోనా మహమ్మారి ప్రజలకు అందుబాటులో ఆరోగ్య సేవలను అందించేందుకు బయో సైన్సెస్ రంగంతో ముడిపడిన భాగస్వాములంతా సమన్వయంతో వ్యవహరించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. 20వ బయోఆసియా సదస్సును రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్నది. ఆరోగ్యసేవలు మానవీయతతో అందరికీ అందించడమెలా? అనే దానిపై భాగస్వాములు వివిధ అంశాల వారీగా చర్చించనున్నారు. ఈ సదస్సుకు ఎర్న్స్ అండ్ యంగ్ (ఇవై) నాలెడ్జ్ పాట్నర్‌గా వ్యవహరించనున్నది.

ఈ సదస్సులో ప్రజారోగ్య పరిరక్షణలో 20 కొత్త ఔషధాలు, సెల్, జీన్ థెరపీలను అభివృద్ధి చేసిన నోవార్టిస్ సీఇఓ డాక్టర్ వసంత్, మోడర్నా సహ వ్యవస్థాపకులు ప్రొఫెసర్ రాబర్ట్ లంగర్, కోయలేషన్ ఫర్ ఎపిడమిక్ ప్రిపేర్డ్నెస్ ఇన్నోవేషన్స్ సీఇఓ డాక్టర్ రిచర్డ్ హాట్ చెట్, రీసైలెన్స్ డాక్టర్ రాహుల్ సింఘ్వి యూఎస్-ఎఫ్ డీఏ గ్లోబల్ పాలసీ, స్ట్రాటజీ అసోసియేట్ కమిషనర్ డాక్టర్ మార్క్ అబ్డో, మైక్రోసాఫ్ట్ కార్పొరేట్ ప్లానింగ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ గ్రిగరీ మూర్, చికాగో ఇలినాయిస్ యూనివర్సిటీ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రొఫెసర్ సర్ఫరాజ్ కె.నియాజీ తదితరులు వివిధ దేశాల నుంచి పాల్గొననున్నారు. మన దేశం నుంచి అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీతా రెడ్డి, డాక్టర్ రెడ్డీస్ ల్యాబోరేటరీస్ చైర్మెన్ సతీష్ రెడ్డి, వెల్లూర్ సీఎంసీ గ్యాస్ట్రోఇంటెస్టినల్ విభాగం ప్రొఫెసర్, వైరాలజిస్ట్ డాక్టర్ గంగదీప్ కంగ్ తదితరులు పాల్గొననున్నారు. హైదరాబాద్ మరోసారి బయో ఆసియా సదస్సుకు వేదిక కానుండటం పట్ల రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కె.తారక రామారావు హర్షం వ్యక్తం చేశారు.

దేశ వైవిధ్య ప్రదర్శనకు జీ20 మంచి అవకాశం

గవర్నర్ తమిళిసై

నవతెలంగామ బ్యూరో - హైదరాబాద్

ప్రపంచం ఎదుట మన దేశ వైవిధ్యతను ప్రదర్శించేందుకు జీ-20 ప్రెసిడెన్సీ మంచి అవకాశమని గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ తెలిపారు. మంగళవారం రాజ్ భవన్‌లో నిర్వహించిన ఇండియాస్ జీ20 ప్రెసిడెన్సీ రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలకు ఆమె అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశాన్ని లోతుగా అర్థం చేసుకునేలా పోటీల్లో పాల్గొన్న భాగస్వాములు ఆసక్తి చూపించారని అభినందించారు. జీ20 అంశం వసుదైక కుటుంబం, ఈ విషయంలో భారతదేశానికి పురాతన కాలం నుంచి అనుభవముందని తెలిపారు. ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తంటూ ఆమె గుర్తుచేశారు. స్వాతంత్ర్య సమరయోధులు కలలుగన్న ప్రపంచ అగ్రగామి నాయకత్వంలోకి భారత్ ప్రవేశిస్తున్నదని చెప్పారు. లక్ష్యాలను చేరుకోవడంలో ఎదురయ్యే చిన్న, చిన్న అడ్డంకులకు భయపడొద్దంటూ ఆమె విద్యార్థులకు సూచించారు. వారిలో ఆత్మవిశ్వాసం పెరిగేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కోరారు. ప్రతి ఒక్కరూ తమదైన ప్రత్యేక ప్రతిభతో జన్మిస్తారనీ, వారిలోని ప్రతిభను ఎవరికి వారు గుర్తించేలా ప్రోత్సహించడం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బాధ్యత అని ఆమె గుర్తుచేశారు. అనంతరం ఆమె వ్యక్తృత్వం, వ్యాసరచన, పోస్టర్ పోటీల్లో విజేతలకు పురస్కారాలను, బహుమానాలను అందజేశారు. రాష్ట్రంలోని ఆయా యూనివర్సిటీల నుంచి దాదాపు 500 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా, ఉస్మానియా యూనివర్సిటీ బోధనా సిబ్బంది న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రాజ్ భవన్ సీనియర్ ఉన్నతాధికారులు, యూనివర్సిటీల బోధనా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రూ.60వేల కోట్ల డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యం

- 2023-24కు గాను కేంద్రం యోచన

న్యూఢిల్లీ : వచ్చే ఏప్రిల్ నుంచి ప్రారంభం కానున్న ఆర్థిక సంవత్సరం 2023-24లో ప్రభుత్వ రంగ సంస్థల్లోని రూ.50,000 నుంచి రూ.60,000 కోట్ల విలువ చేసే వాటాలను ప్రయివేటుకు విక్రయించాలని కేంద్రం యోచిస్తోందని సమాచారం. వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని డిజిన్వెస్ట్‌మెంట్ అంశంలో దూకుడుగా వ్యవహరించకూడదని భావిస్తోన్నట్టు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో వచ్చే ఆర్థిక సంవవత్సరంలో చమురు, బ్యాంకింగ్ రంగాల్లోని పీఎస్‌యూల వాటాల ఉపసంహరణ విషయంలో అచీతూచి వ్యవహరించనుందని ఫైనాన్సియల్ ఎక్స్‌ప్రెస్ ఓ కథనంలో పేర్కొంది. "ఇప్పటికే క్యాబినెట్ ఆమోదించిన పీఎస్‌యూల్లో డిజిన్వెస్ట్‌మెంట్‌ను వచ్చే ఏడాది కొనసాగించనున్నాము. వాటాల విక్రయ జాబితాలో ఐడీబీఐ బ్యాంక్, కాన్‌కోర్, బీఈఎంఎల్, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఎన్ఎండీసీ స్టీల్, హెచ్ఎల్ఎల్ లైఫ్ కేర్, పీడీఐఎల్ తదితర ప్రభుత్వ రంగ సంస్థలు ఉన్నాయి." అని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ (దీపమ్) సెక్రటరీ తూహిన్ కాంత పాండే తెలిపారు.

రెండు ప్రభుత్వ రంగ బ్యాంకులను, ఒక సాధారణ బీమా కంపెనీని ప్రయివేటీకరించనున్నామని క్రితం బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన విషయం తెలిసిందే. వీటి డిజిన్వెస్ట్‌మెంట్‌లో కొంచెం పురోగతి సాధించామని పాండే తెలిపారు. ఇటీవలి శీతాకాల సమావేశాల్లో ప్రభుత్వం ఎలాంటి ప్రయివేటీకరణ బిల్లును కేంద్రం ప్రవేశపెట్టలేదన్నారు. ఎల్ఐసీ, కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంలోని ఐడీబీఐ బ్యాంక్ ప్రయివేటీకరణ ప్రక్రియ కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ బ్యాంక్‌ను కొనుగోలు చేయడానికి విదేశీ పెట్టుబడిదారులు ఆసక్తి చూపుతున్నారని తూహిన్ కాంత తెలిపారు. ఐడిబిఐ బ్యాంక్‌లోని మెజారిటీ 60.72 శాతం వాటాలను దేశ, విదేశీ కార్పొరేట్లకు విక్రయించాలని కేంద్రం నిర్ణయించింది. ప్రస్తుతం 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.65వేల కోట్ల విలువ చేసే పిఎస్‌యుల వాటాలను ప్రయివేటు శక్తులకు విక్రయించాలని మోడీ సర్కార్ గడిచిన బడ్జెట్‌లో లక్ష్యంగా పెట్టుకున్న విషయం తెలిసిందే.

డిసెంబర్ కల్లా 200 షోరూంల ఏర్పాటు

దేశవ్యాప్త విస్తరణపై ఫ్రాంక్లిన్ ఇవి దృష్టి

హైదరాబాద్ : విద్యుత్ స్కూటర్ల తయారీలో ఉన్న హైదరాబాద్ కంపెనీ ఫ్రాంక్లిన్ ఇవి దేశ వ్యాప్త విస్తరణపై దృష్టి పెట్టినట్టు ప్రకటించింది. ఈ ఏడాది డిసెంబర్ ముగింపు కల్లా 200 షోరూంలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా చేసుకున్నట్టు తెలిపింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడులో ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించినట్టు ఆ సంస్థ ఫౌండర్ డాక్టర్ శశిధర్ తెలిపారు. హైదరాబాద్‌లో మంగళవారం ఆ సంస్థ కో-ఫౌండర్లు రంజిత్ కుమార్, నవీన్ కుమార్‌లతో కలిసి శశిధర్ మీడియాతో మాట్లాడారు. తమ లక్ష్యాలను చేరుకోవడానికి రూ.50 కోట్లు వ్యయం చేయనున్నామని తెలిపారు. తమ సంస్థ హైదరాబాద్, బెంగళూరు, చెన్నయ్, వైజాగ్, విజయవాడ వంటి 30 నగరాల్లో మొత్తం 54 షోరూంలను నిర్వహిస్తోన్నామన్నారు. ఒక్క హైదరాబాద్‌లోనే 14 షోరూంలు కలిగి ఉన్నామన్నారు. రెండేళ్లలోనే 6వేల పైగా వినియోగదారులను సొంతం చేసుకున్నామన్నారు. కొత్తగా ఫ్రాంచైజీ కోసం 30 మంది ఔత్సాహికులతో చర్చలు జరుగుతున్నాయన్నారు. నేపాల్, బంగ్లాదేశ్, ఆఫ్రికాకు ఎగుమతులు చేస్తున్నామన్నారు.

రూ.25 కోట్లతో జినోమ్ వ్యాలీలో ఆర్అండ్‌డీ

మెటీయరిక్ బయో ఫార్మా వెల్లడి

హైదరాబాద్ : రూ.25 కోట్లతో జినోమ్ వ్యాలీలో పరిశోధన, అభివృద్ధి (ఆర్అండ్‌డీ) కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నామని మెటీయరిక్ బయో ఫార్మాస్యూటికల్స్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ గౌరవ్ కౌశిక్ వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 2023 ముగింపు నాటికి ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అహ్మదాబాద్‌లోని తన ఆర్అండ్‌డి సెంటర్‌ను ఇక్కడికి తరలించనున్నామని తెలిపారు. తొలుత 20-25 మంది సైంటిస్టులను తీసుకోనున్నామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా తమ సంస్థకు 600 మంది క్లయింట్లున్నారన్నారు. 80 దేశాలకు ఎగుమతులు చేస్తున్నామన్నారు. మెటీయిక్ బయోకు 100కు పైగా ఉత్పత్తులు, 10కి పైగా పేటెంట్లు, 50కు పైగా ట్రేడ్ మార్క్‌లున్నాయన్నారు.

రూ.2 లక్షల కోట్ల సంపద ఆవిరి

సెన్సెక్స్ 637 పాయింట్ల పతనం

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం భారీ నష్టాలను చవి చూశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 637 పాయింట్లు లేదా 1.04 శాతం పతనమై 60,657కు పడిపోయింది. దీంతో సోమవారం ర్యాలీతో వచ్చిన లాభాలు ఆవిరయ్యాయి. ఎన్ఎస్ఇ నిఫ్టీ 190 పాయింట్లు లేదా 1.04 శాతం తగ్గి రూ.18,043 వద్ద ముగిసింది. దీంతో బీఎస్ఈ మార్కెట్ కాపిటలైజేషన్ విలువ రూ.2.02 లక్షల కోట్ల విలువ కోల్పోయి.. రూ.282.64 లక్షల కోట్లకు పరిమితమయ్యింది. దీంతో రూ.2.02 లక్షల కోట్ల సంపదను ఇన్వెస్టర్లు నష్టపోయినట్లయ్యింది. బీఎస్ఈలోని 3,563 స్టాక్స్‌లో 2,211 సూచీలు నష్టాలను చవి చూడగా.. 1,206 స్టాక్స్ లాభాలను గడించగా.. 149 స్టాక్స్ యథాతథంగా నమోదయ్యాయి. ంతర్జాతీయ మార్కెట్లలో ఉన్న అస్థిర పరిస్థితులు ఇన్వెస్టర్లను ఆందోళనకు గురి చేశాయి. ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం పెరగడం, వడ్డీ రేట్ల పెంపు ఉండొచ్చన్న నిపుణుల అంచనాలు, మాంద్యం భయాలు మార్కెట్లను ఒత్తిడికి గురి చేశాయి.

హైదరాబాద్‌లో భారీగా పెరిగిన ఆఫీసు లీజింగ్ : నైట్‌ఫ్రాంక్ వెల్లడి

హైదరాబాద్ : నగరంలో వాణిజ్య అవసరాల ఆఫీసు లీజింగ్ భారీగా పెరిగిందని రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ నైట్ ఫ్రాంక్ తెలిపింది. గతేడాది 2022లో హైదరాబాద్‌లో ఆఫీసు లీజింగ్ 67 లక్షల చదరపు అడుగులుగా చోటు చేసుకుందని వెల్లడించింది. ఇంతక్రితం ఏడాదితో పోల్చితే 12 శాతం వృద్ధితో 10 ఏండ్ల గరిష్ట స్థాయికి చేరిందని పేర్కొంది. దేశంలోని ఎనిమిది టాప్ మార్కెట్లలో హైదరాబాద్ మూడో స్థానంలో నిలిచిందని పేర్కొంది. ఈ డిమాండ్‌కు కారణం ఇన్ఫర్మేషన్ టెక్నలాజీ రంగమే ప్రధాన కారణమని పేర్కొంది.

లోక్‌సభ స్థానాలకు ప్రభారీల నియామకం

జాబితా విడుదల చేసిన బండి సంజయ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని 17 లోక్‌సభా స్థానాలకు ప్రభారీలను పునర్‌నియమిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఒక జాబితాను మంగళవారం విడుదల చేశారు. కడగంచి రమేశ్(ఖమ్మం), కాసం వెంకటేశ్వర్లు యాదవ్(చేవెళ్ల), గోలి మధుసూదన్‌రెడ్డి(సికింద్రాబాద్), అల్జాపూర్ శ్రీనివాస్(ఆదిలాబాద్), అంకాపురం విష్ణువర్దన్‌రెడ్డి(పెద్దపల్లి), ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్(కరీంనగర్), వెంకటరమణి(నిజామాబాద్), బాదం మహిపాల్‌రెడ్డి(జహీరాబాద్), ఎం.జయశ్రీ(మెదక్), యెండల లక్ష్మీనారాయణ(మల్కాజిగిరి), దేవకి వాసుదేవరావు(హైదరాబాద్), వీరెళ్లి చంద్రశేఖర్(మహబూబ్‌నగర్), ఆట్లూరి రామకృష్ణ(నాగర్‌కర్నూల్), ఎం.ధర్మారావు(నల్లగొండ), చింతల రామచంద్రారెడ్డి(భువనగిరి), గోట్ల ఉమారాణి(వరంగల్), కట్టా సుధాకర్‌రెడ్డి(మహబూబాబాద్) ప్రభారీలుగా నియమితులయ్యారు. ఆ స్థానాలకు సంబంధించి కన్వీనర్లు, జాయింట్ కన్వీనర్లను కూడా ప్రకటించారు.

సందీప్ కుమార్ సుల్తానియా .... బెస్ట్ సీఏ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీనియర్ ఐఏఎస్ అధికారి సందీప్ కుమార్ సుల్తానియా బెస్ట్ సీఏ అవార్డును అందుకున్నారు. ప్రజా సేవలో ఉత్తమ సీఏగా 2022 అవార్డులకుగాను ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ఆయనను ఎంపిక చేసింది. ఈ మేరకు పురస్కారాన్ని పశ్చిమ బెంగాల్ గవర్నర్ చేతుల మీదుగా సుల్తానియా అందుకున్నారు.